# సత్యం కోసం చిత్రహింస



# సత్యం కోసం
# చిత్రహింస

ర చ యి త

## రిచర్డ్ వుర్మ్ బ్రాండ్

**THE LOVE IN ACTION SOCIETY**
P.O. Box 4532, New Delhi 110016

# TORTURED FOR CHRIST
**TELUGU**
**RICHARD WURMBRAND**

1986
Copies 5000

© Richard Wurmbrand

Printed and Published by Dr. P.P. Job, Post Box No. 4532
V-31, Green Park, New Delhi-110 016, For the Love in Action
Society at Sabina Printing Press, India.

# రిచర్డ్ వుర్మ్ బ్రాండ్

14 సంవత్సరాలు కమ్యూనిస్టు చెఱసాలల్లో అమానుషంగా చిత్ర హింసలు పొందాడు, ఈ యన రుమానియా దేశీయుడు. అక్కడి సంఘ నాయకుల్లో ఈయన ప్రసిద్ధుడు.

1945లో కమ్యూనిస్టులు ఆ దేశాన్ని హస్తగతం చేసికున్నారు. వాళ్ళకు ఎదురునిల్చి బహిరంగంగానూ, అజ్ఞాతంగాను యీయన క్రైస్తవ ప్రబోధం చేస్తూ వచ్చాడు. చివరికి 1948లో కమ్యూనిస్టులు ఆయన్ని నిర్బంధంలోనికి తీసికొన్నారు. అదే సమయంలో ఆయన భార్యను కూడా పట్టుకొని 3 సంవత్సరాలు ఆమెతో నిర్దాక్షిణ్యంగా వెట్టి చాకిరీ చేయించారు.

రిచర్డ్ వుర్మ్ బ్రాండ్ మూడేళ్ళు ఏకాకిగా ఓ గదిలో నిర్బంధించ బడ్డాడు. ఆ మూడేళ్ళ కాలంలో తనను హింసించడానకు వచ్చే వ్యక్తుల్ని తప్ప మరెవ్వర్నీ ఆయన చూడలేదు. ఆ తరువాత ఇతర ఖైదీలతో బాటు ఆయన్ని ఓ చిన్ని అఱలో 5 సంవత్సరాలు బాధపెట్టారు.

ఇలా ఎనిమిదేళ్ళు గడిచాక ఆయన్ని వదిలేశారు, రావడమే తడవుగా ఆయన తన పూర్వపు పరిచర్యను మళ్ళీ ప్రారంభించాడు. దేనికోసం తాని తకాలం నానా హింసల పాలై పోయాడో ఆ క్రైస్తవ ప్రబోధాన్నే మళ్ళీ చేపట్టాడు. వెంటనే కమ్యూనిస్టులు అతన్ని అరెస్టు చేసి మరో 25 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు; అయితే 1964లో రాజకీయ ఖైదీల్ని విడుదల చేసిన సందర్భంలో అదృష్టవశాత్తు రిచర్డ్ వుర్మ్ బ్రాండ్‌ను కూడా విడుదల చేశారు.

రుమానియాలో క్రైస్తవ సంఘాలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితుల్ని యథాతథంగా స్వతంత్ర దేశాల్లోని విశ్వాసులకు తెలియజేయాలనే సంకల్పంతో ఈయన తప్పించుకొని ఆ దేశాన్నుండి బయటపడ్డాడు, ఆయన తన పర్యటనలో ఇంగ్లాండ్, అమెరికా దేశాల్లో చెప్పిన గాథే ఈ పుస్తకం.

ఇదొక వాస్తవగాథ. దీన్ని చదవడం వల్ల సత్యం కోసం వుర్మ్ బ్రాండ్ ఎలా భయంకర చిత్రహింసల్ని అనుభవించాడో తెలుస్తుంది. అది మాత్రమే కాకుండా కమ్యూనిజం అసలు రూపమేవిటో బాగా అర్థమౌతుంది.

—పబ్లిషర్.

# ఇందులో......

| అధ్యాయం | | పేజీ నం |
|---|---|---|
| 1. క్రీస్తుకోసం ఒక నాస్తికుని అన్వేషణ | .... | 1 |
| 2. రష్యన్లు - ఆత్మసంబంధమైన ఆకలి | ... | 10 |
| 3. దాస్యశృంఖలాల్లో నున్న దేశానికి మా రహస్య పరిచర్య | .... | 22 |
| 4. నా చెరసాల జీవిత ఆరంభం | .... | 28 |
| 5. స్వల్ప స్వాతంత్ర్యం ఆపై మళ్ళీ నిర్బంధం | ... | 37 |
| 6. విడుదల | .... | 48 |
| 7, కమ్యూనిస్టుల్ని కూడా ప్రేమించాలి | .... | 53 |
| 8. కమ్యూనిజాన్ని ఎదుర్కోవాల్సిన విధానం | | 61 |
| 9. నా విడుదల, నా అన్వేషణ | .... | 69 |
| 10. రహస్య సంఘం | .... | 81 |
| 11. రష్యాదేశ విశ్వాసులు | .... | 100 |
| 12. రహస్య సంఘాన్నుండి మీకు నా సందేశము | .... | 120 |

# 1
# క్రీస్తుకోసం ఒక నాస్తికుని అన్వేషణ

ఏ మతాన్నైనా ఒప్పుకోని ఒక కుటుంబంలో నేను పెరిగాను. నా బాల్యదశలో మత సంబంధమైన సంగతులే మాత్రం నాకెవరూ చెప్పలేదు. గనుక 14వ సం॥ వయస్సు వచ్చేటప్పటికే నేను సంపూర్ణ నాస్తికునిగా తయ్యారైనాను. నా జీవితారంభం నుండి ఒక అనాథునిగా పెరుగుతూ, మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో అనేక దురవస్థలకు గురయ్యాను. ఈనాటి కమ్యూనిస్టుల్లాగానే నేను కూడా నా 14వ యేటనే ఒప్పింపబడ్డ నాస్తికుడనై వున్నాను. నాస్తికత్వానికి సంబంధించిన పుస్తకాలు చదివాను,గాని దేవుని గురించి, క్రీస్తును గురించి వ్రాయబడ్డ సంగతులు మానసిక జ్ఞానానికి విరుద్ధమని వాటిని విసర్జించాను. ఈ విధంగా మతమంటే చాలా అసహ్యపడుతూ పెరిగాను.

అయితే కొంత కాలానికి దేవుని కృపచేత దేవుడు ఏర్పర్చుకొన్న వారిలో నేను ఒకడనని తెలిసికొన్నాను. దేవుడు నన్ను ఏర్పరచుకోడానికి గల కారణం నేను గ్రహించలేదు. ఒకటి మాత్రం తెలుసు— అది నా మంచి తనాన్నిబట్టి మాత్రం కాదని తెలుసు ఎందుకంటే నా జీవితం బహు చెడ్డది.

నేను నాస్తికుడనైనా నాకు తెలియని ఏదో కారణాన్నిబట్టి క్రైస్తవ దేవాలయాలకు వెళ్ళ కోరేవాడను. ఏదైన క్రైస్తవ

దేవాలయం ప్రక్కగా వెళ్ళాల్సి వచ్చినా దానిలో ప్రవేశింపకుండా పోయేవాడను కాను. అయితే ఈ ఆరాధన స్థలాల్లో జరిగేది నా కేమాత్రం తెలిసేదికాదు. ప్రసంగాలు విన్నా అవి నన్నాకర్షించ లేక పోయాయి. దేవుడు లేడనెడి సిద్ధాంతంలో మాత్రం స్థిరపడి పోయాను. దేవుడొక యజమానుడనీ ఆయనకు విధేయత చూపాలి అనే విషయాన్ని నే నసహ్యించుకొన్నాను. దేవుని గురించిన తలంపులంటేనే నాకు చాలా అసహ్యం. అయినా ఈ జగత్తులో నన్ను బహుగా ప్రేమించే ఒక హృదయం వుంటే బాగుండునని తలచేవాడిని. నా బాల్యదశలో గాని యౌవనదశలో గాని సంతోషాన్ని నేనేమాత్రం అనుభవించ లేక పోయాను.

దేవుడు లేడని తలంచాను, అయినా అట్టి ప్రేమగల దేవుడు లేనందుకు దుఃఖపడ్డాను. నా ఆంతర్యం ఇలా గందరగోళంతో వుంది. అప్పుడు ఒకనాడు కథోలిక్ దేవాలయంలో ప్రవేశించాను. అక్కడ కొంతమంది మోకరించి ఏమో వల్లించడం గమనించాను. అప్పుడు నాకేమైనా సంభ విస్తుందేమో చూడాలని నేను కూడా వారితో కలసి మోకరించి ప్రార్థనలు వల్లించడానికి మొదలు పెట్టాను. వారు మరియమ్మకు ప్రార్థన చేస్తారు. నేను కూడా వారితో కలసి కన్య మరియ విగ్రహం వైపు చూస్తూ ప్రార్థించాను గాని ఏ లాభం లేకపోగా విచారపడ్డాను.

సంపూర్ణ నాస్తికుడనుగానే వుండి ఒకనాడు ఇలా దేవుడికి ప్రార్థించాను– "దేవా, నీవు లేనేలేవని నాకు బాగా తెలుసు గాని ఒకవేళ నీవు వుంటే నీయందు విశ్వసించడం నాకు చెత కాదు. నిన్ను నీవు నాకు ప్రత్యక్ష పర్చుకోవాలి " నేను నాస్తికుడనే గాని నా స్తికత్వం నా హృదయానికి సమాధానాన్ని కల్గించలేదు.

నేను యిలా కలతపడుతున్న దినాల్లో రుమేనియా దేశ పర్వత గ్రామంలో నివసిస్తున్న వడ్లవాడొకడు ఈలా ప్రార్థించాడు— "నా దేవా, నేను ఈ భూలోకంలో నిన్ను సేవించాను. గనుక నాకు ఈ లోకంలోను, పరలోకంలోను దానికి ప్రతిఫల మియ్యాలి. నీవు నాకివ్వాల్సిన బహుమానం— నేను మరణించక ముందు నా ద్వారా నీవు ఒక యూదుణ్ని క్రీస్తు దగ్గరకు నడి పించాలి. ఎందుకంటే యేసు యూదా జనాంగంలో నుండే వచ్చాడు. అయితే నేను వృద్ధుడ్ని, బలహీనుడ్ని నేను చుట్టు ప్రక్కల తిరిగి ఒక యూదుణ్ని కనుగోలేను. నా ఊరిలో ఒక్క యూదుడు కూడా లేడు. నీవే ఒక యూదుణ్ని ఈ ఊరికి పంపించు అప్పుడు అతన్ని క్రీస్తు దగ్గరకు నడిపించడానికి నా శక్తి కొద్దీ ప్రయత్నిస్తాను."

ఆశ్చర్యం! నేను సరిగా ఆ వూరికే వెళ్ళాను అక్కడ నాకేలాంటి పని లేదు. రుమానియాలో 12,000 గ్రామాలున్నయ్. అయినా నేను ఆ వూరికే వెళ్ళాను. నేను యూదుడనని ఆ వడ్ల వాడు గమనించి ఎంతో ప్రేమతో మాట్లాడాడు. నేనక్కడికి రావడం తన ప్రార్థనకు ఫలమని చెప్పి చదువడానికి ఒక బైబిలు ఇచ్చాడు. జ్ఞానాభివృద్ధికోసం ఇదివరకెన్నో సార్లు బైబిలు చదివాను. అయితే వడ్లవాడు యిచ్చిన బైబిలు చాలా విశిష్టమైంది. నాకోసం, నా భార్య రక్షణకోసం అతడు, అతని భార్య ఎన్నో గంటలు ప్రార్థించినట్లు నాకు తరువాత తెలిసింది. ఆ బైబిలు వట్టి అక్షరాలతోగాక వారి ప్రార్థనలనే ప్రేమా జ్వాలల్తో వ్రాయ బడినట్లుంది. దాన్ని చదువడం నాకు చాలా కష్టం అయింది. నా పాపజీవితానికీ యేసు పరిశుద్ధ జీవితానికి, నా అపవిత్రతకు

ఆయన పవిత్రతకు, నా ద్వేషానికి ఆయన ప్రేమకు పోల్చుకొని చూచి చాలా ఏడ్చాను. యింతటి దుష్టుడనైన నన్ను తన సొంత వానిగా యేసు అంగీకరించాడు.

నేను రక్షింపబడ్డ కొద్ది కాలంలోనే నా భార్య కూడా అంగీకరించింది. ఆమె ఇతర వ్యక్తుల్ని ప్రభువుదగ్గరకు నడిపించింది. రక్షణ నొందినవారు మరికొంత మందిని రక్షణలోకి నడిపించినందువల్ల అక్కడ ఒక క్రొత్త సంఘం స్థాపితమైంది.

ఇంతలో రెండో ప్రపంచయుద్ధం ఆరంభమైంది. జర్మనీ దేశపు సైన్యం మా దేశాన్ని ఆక్రమించింది. మేం చాలా శ్రమ అనుభవించాం. రుమానియాలో జర్మను ఏలుబడిలో యూదులు మాత్రం కాక ప్రొటెస్టాంటు క్రైస్తవులు కూడ భయంకర హింసలకు గురై పోయారు.

వేదాంత విద్య, అభిషేకం లేకుండానే నేనీ సంఘానికి నాయకుడనై సేవ ప్రారంభించాను. నేనే ఈ సంఘ స్థాపనకు కారకుడనైనందున దాని బాధ్యతను స్వీకరించాల్సి వచ్చింది. నన్ను, నా భార్యను అనేక పర్యాయాలు పట్టుకొని, కొట్టి, జర్మను న్యాయాధిపతుల యెదుట నిలబెట్టారు. ఆ హింస చాలా కఠినమైనదేగాని రాబోయే కమ్యూనిష్టు శ్రమలతో దాన్ని పోల్చి చూస్తే అది చాల స్వల్పం. నా కుమారుడు మిహాయిని మరణాన్నుండి కాపాడ్డంకోసం అతనికి యూదుల పేరు పెట్టలేదు

అయితే ఇట్టి భయంకర దినాల్లో ఒక మేలులేకపోలేదు. శరీరానికి ఎన్ని దెబ్బలు తగిలినా దైవ సహాయాన మానవాత్మ ఎన్ని శ్రమలనైనా ఎదుర్కొనగలదని మేం నేర్చుకొన్నాం. అంతే గాక క్రైస్తవ సేవ రహస్యంగా చేయు పద్ధతుల్ని ఆ దినాల్లో

నేర్చుకొన్నాం. ఇలా రాబోయే శ్రమ దినాలకోసం సిద్ధపడు తున్నాం.

## రష్యా ప్రజల్లో నా పరిచర్య

ముందు నేనొక నాస్తికుడనైనందున రక్షింపబడిన దినం నుండి రష్యా ప్రజలకు సాక్ష్యమివ్వాలన్న ఆశ నాలో చాలా బలీయంగా వుంది. రష్యా ప్రజలు చిన్నానాటినుండే నాస్తికులుగా పెరుగుతారు. నా ఆశ గట్టిగా వుంది అది అట్టి దుర్దినాల్లోనే నెర వేరింది. ఎందుకంటే రుమానియాలో అనేక వేల మంది రష్యా యుద్ధఖైదీలున్నందున వారి మధ్య క్రైస్తవ సేవ చేయడానికి అవకాశమేర్పడింది.

అది చాలా వింతైన సేవ. మొదట ఒక రష్యా దేశపు ఇంజనీరుతో నాకు పరిచయం గలిగింది. దేవున్ని విశ్వసిస్తు న్నావా? యని నేనతన్ని అడిగాను. "లేదు" అని అతడు చెప్పినా నేను చింతించక పోయేవాణ్ని. విశ్వసించడం లేక విశ్వసించక పోవడం అది అందరి హక్కుగాని నేను ఎప్పుడైతే "నీవు దేవున్ని విశ్వసిస్తున్నావా" యని అడిగానో లేదో అతడు నా ముఖంవైపు తేరిచూచి "నాకు అట్టి ఉత్తరువు లింకా మా సైన్యాధికారినుండి రాలేదు, నాకాలాంటి ఉత్తరువు వస్తే నేను విశ్వసిస్తాను," అని చెప్పాడు.

ఈ మాటలు వినగానే నా కళ్ళలోనుండి కన్నీళ్ళు రాలాయి. నా హృదయం ముక్కలుగా కోసినట్లయిపోయింది. నా యెదుట అతడు ఒక పీనుగలా యున్నాడు. మానవకోటికి దేవుడు దయచేసిన గొప్ప ఈవిని అనగా తన వ్యక్తిత్వాన్ని అతడు పోగొట్టుకొన్నాడు. అతడు కమ్యూనిస్టు చేతిలో కీలు

బొమ్మ. నమ్మమంటే నమ్ముతాడు, నమ్మకూడదంటే నమ్మడు. అతడు సొంతంగా ఏ తీర్మానమూ చేయలేడు. ఇదంతా చూచక ఈ ప్రజలకు తమ వ్యక్తిత్వాన్ని తిరిగి జ్ఞప్తికి తేవాలని దేవునిలో క్రీస్తుకోను వారు విశ్వాసముంచేలా చేయాలని వారికోసం నన్ను నేను సమర్పించుకొన్నాను.

రష్యనులకు సువార్త నందించడానికి నేను రష్యా దేశానికే వెళ్ళాల్సిన అవసరం నాకేమీ కనిపించలేదు.

1944 సం॥ ఆగష్టు 23వ తారీఖు మొదలుకొని పది లక్షల రష్యన్ సైనికులు రుమానియాలోకి ప్రవేశించారు. ఆ తర్వాత కమ్యూనిష్టు వారు అనతికాలంలో ఈ దేశంపై అధిపత్యం వహించారు. ఈ కాలంలో జర్మన్ వారి ద్వారా పొందిన శ్రమలే కొంతవరకు తక్కువనిపించాయి.

ఆ దినాల్లో 180 లక్షల జనసంఖ్య వున్న రుమానియాలో, కమ్యూనిస్టులు 10,000 మంది మాత్రమే. అయితే సోవియట్ ఫారిన్ సెక్రటరీ మా ప్రియ రాజైన మైఖల్‌గారి ఆఫీసులోకి ప్రవేశించి, తన పిడికిలితో బల్ల గ్రుద్దుతు, "నీవు దేశ అధికారంలో కమ్యూనిస్టుల్ని" నియమించాలి. అని చెప్పాడు. మా సైన్యాన్ని, పోలీసుల్ని, నిరాయుధుల్ని చేసి, ప్రజలందరి ఆశకు ప్రతికూలంగా కమ్యూనిస్టులు అధికారులై మా దేశాన్ని ఏల నారంభించారు.

## పవిత్ర ప్రేమ మోసపూరితమైన ప్రేమ ఒకే విధంగా మాట్లాడుతుంది

కమ్యూనిస్టులు మా దేశానికి నాయకులై పోయాక వారు క్రైస్తవ సంఘంపట్ల బహూ కుయుక్తిగా ప్రవర్తించసాగారు. ఒక

కన్యను వివాహమాడ నుద్దేశించువాడూ, ఒక రాత్రికి మాత్రమే స్త్రీని వుంచుకొనేవాడు, వీరిద్దరూ ఆ స్త్రీలతో "నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పవచ్చు, కాని, ఈ రెండు విధాలైన ప్రేమల్లోని తారతమ్యాన్ని, గొర్రె చర్మాలు వేసికొన్న తోడేళ్ళకూ నిజమైన గొర్రెలకూ మధ్యవున్న భేదాన్ని తెలిసికోవాలని యేసు హెచ్చరించాడు.

కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చాక ఈ రెండు స్వరాలలో నున్న భేదాన్ని అనేక వేలమంది క్రైస్తవ నాయకులు, పాస్టర్లు గ్రహించ లేక పోయారు.

కమ్యూనిస్టువారు క్రైస్తవ శాఖలన్నిటికీ ఐక్యసభ ఒకటి మా పార్లమెంట్ భవనంలో ఏర్పాటు చేసారు. ఆ యా గుంపులకు చెందిన గురువులు, పాస్టర్లు, పరిచారకులు, నాల్గువేలమంది దానిలో హజరైనారు ఈ నాలుగువేల మంది మతనాయకులు జోసఫ్ స్టాలిన్‌ను గౌరవించాలనీ అతడు అక్కడ లేకపోయినా అతన్ని సభాధ్యక్షునిగా నియమించారు, అతడు ప్రపంచ నాస్తిక సమాజానికి అధ్యక్షుడు, అనేక క్రైస్తవుల్ని హతమార్చిన నరహంతకుడు. ఒకరి తర్వాత ఒకరు బిషప్పులు, పాస్టర్లు లేచి,నిలిచి, కమ్యూనిజము, క్రైస్తవ్యమూ ఈ రెండు సిద్ధాంతాలు ఒకటేనని అవి రెండూకలసి ముందుకు సాగడానికి వీలుందని చెప్పారు. ఒకరి తర్వాత ఒకరు కమ్యూనిజాన్ని పొగడుతు, నూతన ప్రభుత్వానికి క్రైస్తవ సంఘం అన్ని విధాల తోడ్పడగలదని హామీనిచ్చారు.

ఈ మహాసభలో నేనూ నా భార్యాకూడా ఉన్నాం. నా ప్రక్కలో కూర్చొనియున్న నా భార్య, నాతో "రిచర్డ్, క్రీస్తు

మీదికి వస్తున్న ఈ అవమానాన్ని తుడిచివేయడానికి లేచి నిలువు వీరు ఆయన ముఖంమీద ఉమ్మివేస్తున్నారు" అని చెప్పింది. అప్పుడు నేను నా భార్యతో "నేనలా చేస్తే నువ్వు నీ భర్తను కోల్పోతావు." అన్నాను. ఆమె యిలా ప్రత్యుత్తరమిచ్చింది "నా భర్త పిరికివాడు కాకూడదని నేను కోరుకుంటున్నాను."

అప్పుడు నేను ఆ సభలో లేచి క్రైస్తవుల్ని హత్య గావించిన నరహంతకుణ్ణి పొగడక, క్రీస్తును, దేవుణ్ణి మాత్రమే స్తోత్రించి. ఆయనకే మనం నమ్మకస్థులమై యుండాలని చెప్పాను. కమ్యూనిస్టు పార్లమెంటునుండి నేను ఇచ్చిన క్రీస్తు సందేశాన్ని ఆ దేశమంతా రేడియోలో విన్నారు. దీని ప్రతిఫలాన్ని తర్వాత నేను అనుభవింపక తప్పలేదు. అయినా అది నాకు చాలా తృప్తి కలిగించింది

కమ్యూనిజానికి లొంగిపోయే విషయంలో ఆయా సంఘ నాయకులు ఆతురతతో ముందుకు పరుగెత్తారు, ఒక సంఘ బిషపు తన నిలువుటంగీపై కొడవలి సుత్తె గుర్తును వేసికొని, ఇక మీదట ఎవరైనా తన్ను గౌరవనీయులైన బిషప్ అనకూడదు గాని కామ్‌రేడ్ బిషప్ అనాలని తన ప్రజల్ని హెచ్చరించాడు.

గెసీటా అనే పట్టణంలో నేనొక బాప్టిస్టు సంఘాల మహా సభలో పాల్గోడానికి వెళ్ళాను. ఆ సభ కమ్యూనిస్టు జండానీడను జరగడం, రష్యా దేశభక్తి గీతాన్ని పాడుతుండగా క్రైస్తవులంతా లేచి నిలుచుండటం చూచాను. ఈ బాప్టిస్టువారి అధ్యక్షుడు లేచి, స్టాలిన్ దేవుని ఆజ్ఞల్ని నెరవేర్చడం తప్ప మరి వేరేమీ చేయ లేదని చెప్పాడు.స్టాలిన్ ఒక గొప్ప బైబిల్ బోధకుడని చెప్పాడు! మరి కొందరు మతనాయకులైతే నేరుగా కమ్యూనిస్టు రహస్య

పోలీసు బృందంలో ఆఫీసర్లుగా చేరారు. రుమానియా దేశంలోని లూథరన్ సంఘ బిషప్ సహాయకుడు రాఫ్ వేదాంత విద్యాలయంలో దేవుడు తనకు ముమ్మారు సత్యాన్ని బయలుపర్చాడని చెప్పాడు. మొదటగా మోషే ద్వారా, రెండోసారి యేసుక్రీస్తు ద్వారా. మూడోసారి స్టాలిన్‌ద్వారా అన్నాడు.

అయితే యధార్థమైన బాప్టిస్టులు సత్యంకోసం సరిగా నిల్చి గొప్ప శ్రమలు అనుభవించారు. కమ్యూనిస్టులు తమ నాయకుల్ని ఎన్నుకొన్నారు. గనుక బాప్టిస్టులు విధిలేక వారిని ఒప్పుకోవాల్సి వచ్చింది. నేడు కూడా నాయకులైనవారి స్థితి అట్లే యుంది. క్రీస్తుకు గాక కమ్యూనిజంకు దాసులైనవారు, తమతో ఏకీభవించని సహోదరుల్ని బహిరంగంగా నిందించి దూరపర్చారు.

అందుచేత రష్యాలో విప్లవం జరిగాక ఆ దేశంలో రహస్య క్రైస్తవ సంఘం ఎలా ఏర్పడిందో అట్లే రుమానియాలో కూడా ఏర్పడింది. సువార్త ప్రచారం చేయడం. పిల్లల మధ్యసేవ, ఇటువంటి పనులన్నీ కమ్యూనిస్టులు ఆపివేశారు. అందుకు నామకార్థ క్రైస్తవ సంఘాలన్నీ సమ్మతించాయి.

ఇతరులతో గూడ నేనూ రహస్య సేవ నారంభించాను. నేనొక గౌరవనీయమైన పదవిలో నున్నందున అది నా రహస్య సేవకు కొంత సహాయపడింది. నేను ఒక లూథరన్ మిషనులో పాస్టరుగాను, ప్రపంచ క్రైస్తవ సంఘాల ప్రతినిధిగా నున్నాను. (ఆ కాలంలో ఈ సంస్థ కమ్యూనిస్టులతో ఏకీభవించక సాంఘిక సేవలోనే వుండేది). ఈ రెండు పదవులు నా రహస్య సేవను కాపాడుకోడానికి సహాయపడ్డాయి.

# 2
# రష్యన్లు-ఆత్మసంబంధమైన ఆకలి

నామట్టుకైతే రష్యన్లకు సువార్త నందించడం భూలోకంలోనే స్వర్గం వున్నట్లుండేది. నేను అనేక దేశాల వారికి సువార్త బోధించాను గాని రష్యన్లలా వాక్యాన్ని ఆశతో అంగీకరించేవారు మరెవరూ లేనట్లు గమనించాను. వారెంతో ఆధ్యాత్మిక దాహంతో వున్నారు.

నా స్నేహితుడు ఒక క్రైస్తవ మత నాయకుడు. నాకు టెలిఫోన్ చేసి, తన దగ్గరకు ఒక రష్యను ఆఫీసరు తన పాపాల్ని వొప్పుకోడానికి వచ్చాడన్నాడు. నా స్నేహితునికి రష్యా భాష రాదు. అందువల్ల నా దగ్గరకు అతన్ని పంపించాడు. అతనికి దేవునిపై చాల ప్రేమ వుంది. దేవుని విషయంలో చాల ఆశగలవాడు గాని, అతడు బైబిల్ను ఎప్పుడూ చూడలేదు. అతడెప్పుడూ ఒక క్రైస్తవ సంఘారాధనలో పాల్గోలేదు. ఎందుకంటే రష్యాలో సంఘాలు బహు అరుదు. ఇతనికి మత సంబంధమైన జ్ఞానం లేకపోయినా దేవున్ని ప్రేమించాడు.

నేనతనికి కొండమీది ప్రసంగాన్ని యేసు చెప్పిన ఉపమానాల్ని చదివి వినిపించాను. ఇది విన్నతర్వాత అతడు ఎంతో గంతులేస్తూ "ఎంత అద్భుతం! ఇలాంటి క్రీస్తును తెలిసికోకుండ నేనెలావుండగలను" అన్నాడు. క్రీస్తులో ఇంత ఆనందంతో

గంతులువేసే వారిని అంతకు ముందెన్నడూ నేను చూచివుండ లేదు.

క్రీస్తు సిలువ మరణాన్ని గూర్చి చదివాను. అతడు ముందెన్నడూ దీన్ని వినలేదు. క్రీస్తు ఇలా మరణించాడని ఎన్నడు తలంచ లేదు. మరణించిన క్రీస్తును గూర్చి విన్న వెంటనే అతడు ఎంతో కృంగి కన్నీళ్ళు విడిచాడు. అతడు నమ్మిన ఆ రక్షకుడు చనిపోయాడు. దీన్ని వర్ణించు విధానంలో నేను పొరపాటు చేసాను.

తిరిగి నేను ప్రభువు పునరుత్థానాన్ని గూర్చి చదివాన. యేసు సమాధిఖండి లేచాడని అతనికి తెలీదు. క్రీస్తు మృత్యుంజయుడై నాడని వినిన వెంటనే ఆ మిలిటరి ఆఫీసరు పట్టశాలని సంతోషంతో ఎగురుతు "ఆయన సజీవుడు. ఆయన సజీవుడు" అని పెద్ద కేకలు వేశాడు.

"ప్రార్థించుదాం" అని నేను అంటే ఎలా ప్రార్థించాలో అతనికి తెలియలేదు. మనం వాడు మతసంబంధమైన భాష తెలియదు. అయినా అతడు తన మోకాళ్ళమీద పడి ఇలా ప్రార్థించాడు. "ఓ దేవా, నీవు భలే మంచోడివయ్యా! ఒకవేళ నేనే నీవైతే లేక నీవే నేనైతే నేనెప్పుడు నీ పాపాల్ని క్షమించను.నీవుచాల మంచోడివి నేను నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను."

ఈ రష్యా ఆఫీసరు ప్రార్థన వినడానికి పరలోకమంతా కొంత సేపు మౌనం వహించియుండవచ్చని నా భావం. ఈ వ్యక్తి క్రీస్తు కోసం దొరికాడు.

ఒక రోజున నేనిద్దరు రష్యన్ ఆఫీసర్లను ఒక దుకాణంలో చూచాను. సరకులమ్మేవానికి రష్యా భాష రానందున వారికి

ఇబ్బంది కల్గడం చూచి, భాషాంతరం చేయడంలో నేను సహాయ పడ్డాను. దానివల్ల వారికి నాకు పరిచయం కల్గింది. వారిని నా యింటికి భోజనానికి ఆహ్వానించాను. వారు వచ్చారు మేం భోజనం చేయకముందు "మీరు ఇప్పుడు ఒక క్రైస్తవ గృహంలో వున్నారు. మేం ప్రార్థన చేయకుండా భోజనం చేయమ"ని చెప్పి రష్యన్ భాషలో ప్రార్థించాను. వారు తమ చేతుల్లోనున్న గరిటెల్ని అలానే వదలి దేవుని విషయం, క్రీస్తు విషయం, బైబిలు విషయం అనేక ప్రశ్నలు అడుగ నారంభించారు. ఈ విషయాలు వారికేమి తెలీవు.

వారితో మాట్లాడం సామాన్యమైన విషయం కాదు. ఒక మనుష్యునికి నూరు గొఱ్ఱెలున్నాయి. అందులో ఒకటి తప్పిపోయిన ఉపమానాన్ని వారికి చెప్పాను. అప్పుడు వారు "ఒకనికి నూరు గొఱ్ఱెలు ఎలా వుంటాయి? కమ్యూనిస్టు సమిష్టి సంఘం వాటిని తీసుకెళ్ళలేదా?" అన్నారు. తరువాత "క్రీసు రాజు"అని చెప్పాను. అప్పుడు వారు "రాజులంతా మహా క్రూరులు వాళ్ళు ప్రజల్ని హింసిస్తారు. గనుక క్రీస్తు కూడా క్రూరుడు కావచ్చున"న్నారు. ద్రాక్షా వనంలో పనిచేసే కూలివాండ్ల విషయం చెప్పగా "వారు యజమానుని ఎదిరించడం సరియే ఎందుకంటే ద్రాక్షవనాలు సమిష్టి సంఘానికి చెందాల్సిందే" అన్నారు. ప్రతీది వారికి క్రొత్తగా వుంది. క్రీస్తు జన్మం విషయం నేను చెప్పితే "మరియ దేవునికి భార్యా?" అంటూ దూషణకర భాషను వాడారు. అనేక సంవత్సరాలు కమ్యూనిజం పాదాలక్రింద త్రొక్కబడిన ఇట్టి ప్రజలకు సువార్త నందించడానికి సంపూర్ణంగా నూతన భాషా విధానాన్ని వాడాల్సి వుందని గ్రహించాను.

మధ్య ఆ ఫికాలో సేవ చేయడానికి వెళ్ళిన మిషనేరీలు యెషయా గ్రంథంలో వున్న "మీ పాపాలు రక్తంవలె ఎఱ్ఱనివైనా అవి హిమంలా తెల్లబడతాయి" అను వచనాన్ని తర్జుమా చేయ డానికెంతో కష్టపడ్డారట. ఎందుకంటే ఆ మంచు ప్రదేశాన్ని వారెప్పుడూ చూచినవారు కారు. వారికి ఆమాటే తెలీదు. అందువల్ల వారు "మీ పాపాలు కొబ్బరికాయలోని కొబ్బరిలా తెల్లనౌతాయి" అని తర్జుమా చేశారట.

అలాగే మేం వారు సువార్తనంతా గ్రహించు భాషలోకి తర్జుమా చేయాల్సి వచ్చింది. దీన్ని పరిశుద్ధాత్మ మాద్వారా చేయించాడు.

ఆ రోజునే ఆ యిద్దరు మిలిటరి ఆఫీసర్లు ప్రభువునందు విశ్వసించారు. అది మొదలుకొని రష్యన్ల మధ్య మేం చేస్తున్న రహస్య సేవలో వారిరువురూ ఎంతో సహాయపడ్డారు.

రహస్యంగా వేలకొద్దీ సువార్తలు, కరపత్రాలు, పుస్తకాలు, అచ్చువేయించి, పంచిపెట్టాం రక్షింపబడిన రష్యా సైనికులద్వార అనేక బైబిళ్ళు నెమ్మదిగా రష్యా దేశంలోకి పంపగలిగాం

రష్యన్లకు దేవుని వాక్యం నందించడంలో మేం ఒక నూతన ఉపాయాన్ని కనిపెట్టాం. రష్యన్ సైనికులు తమ భార్యా బిడ్డల్ని విడచి అనేక సంవత్సరాలు యుద్ధ భూముల్లో నుంటారు. వారికి చిన్న బిడ్డలంటే చాల యిష్టం వారిలో అనేకులు కొన్ని సంవత్సరాల తరబడి తమ బిడ్డల్ని చూడరు. నా కుమారుడు మిహాయి, పది సంవత్సరాల లోపునవున్న ఇతర పిల్లలు కొందరు కలసి వీధుల్లోను, పార్కుల్లోను వెళ్ళి ఆడుకొనే వారు. వెళ్ళేట ప్పుడు తమ జేబుల్లో అనేక సువార్తలు, బైబిళ్ళు తీసుకెళ్ళేవారు

రష్యా సిపాయిలు వీర్ని చూచి ఎంతో ప్రేమగా వీపును తట్టుతు తమాషాగా ఆడుతు వారికి మిఠాయి యిచ్చారు. పిల్లలు వాటి నంగీకరించి, బదులుగా తమవద్దనున్న బైబిళ్ళు, సువార్తల్ని వారి కిచ్చారు. వీటిని వారు ఎంతో సంతోషంతో అంగీకరించారు. పెద్దలమైన మేం బహిరంగంగా దీన్ని చేయలేకపోయాం గాని పిల్లలు హాయిగా చేయగల్గారు. ఈ చిట్టిపొట్టి బిడ్డలే మిషనెరీలై నారు. దీని ఫలితం గొప్పగా వుంది. రష్యన్ సైనికులకు సువార్త నందించడానికి ఇంకో విధానం లేనప్పుడు ఇలా చేయగల్గాం.

## సిపాయిల శాలల్లో బోధించడం

రష్యన్ల మధ్య వ్యక్తిగతంగా మాత్రం గాక చిన్నచిన్న గుంపులుగా కూడి కూటాలు జరిపాం. గడియారమంటే రష్యన్లకు ప్రీతి. వారు గడియారాల్ని దొంగిలించేవారు. వీధుల్లో మనుష్యుల నాపి వారి గడియారాల్ని లాగేసుకొనేవారు. ఒక్కొక్క సిపాయి చేతికి ఎన్నో గడియారాలుండటం చూచాం. రుమానియా వారికి గడియారాలు కావలిస్తే వీరి శాలల్లోకి ప్రవేశించి కొనుక్కొనేవారు. కావున ఈ వర్తకాన్నిబట్టి వారి శాలల్లో ప్రవేశించడం సాధారణ మైన విషయం గనుక రహస్య క్రైస్తవ సంఘాన్ని కూడ వారి మధ్యలోకి ప్రవేశింప చేయడానికి మంచి అవకాశం దొరికింది.

వారి మధ్యకు వెళ్ళడానికి నేను ఒక దినాన్ని ఏర్పాటు చేసుకొన్నాను. ఏదో గడియారం కొనదలచినట్లు నటిస్తూ వార్ని కలిసికొన్నాను వారిలో కొందరు తమ గడియారాల్ని అమ్మడాని కొచ్చి నాచుట్టు నిలువ బడ్డారు అప్పుడు నేను నవ్వుతు "మీలో పౌలు, పేతురు అనువారెవరైనా వున్నారా?" అని అడిగాను. "ఉన్నామ"ని కొందరన్నారు. "పౌలు, పేతురు ఎవరో మీకు

తెలుసా?" అన్నాను. ఒక్కరికి కూడ తెలీదు. ఈ సంగతులు బోధింపనారంభించిన వెంటనే ఒక సిపాయి "నీవు గడియారం కొనడానికి రాలేదు గాని మతబోధ చేయడానికొచ్చావు" అన్నాడు. "ఇలారా, ఇక్కడ కూర్చొని ఆ సంగతులు మాకు చెప్పు. అయితే నీవు చాలా జాగ్రత్తగా వుండాలి. ఇక్కడ సువార్తకు విరోధులున్నారు ఎప్పుడైతే నేను నీ మోకాటి మీద చేయివేస్తానో అప్పుడు నీవు గడియారాల విషయం మాట్లాడాలి. నా చేయి తీయగానే సువార్త బోధించాలి" అని చెప్పాడు.

ఈ విధంగా అనేక సార్లు నేను వెళ్ళి వారికి సువార్త నందించాను. దీని విషయంలో దేవుని బిడ్డలైన రష్యన్ సిపాయిలే ఎంతో సహకరించారు. అనేక సైనికులు క్రీస్తు నంగీకరించి, రక్షింపబడ్డారు. వేలకొలది సువార్త పుస్తకాలు ఇలా రహస్యంగా పంచబడ్డాయి. అయితే ఇలా చేసినందున అనేక సహోదరీలను పట్టుకొని హింసించారు. (అయినా వారు మా రహస్య సంఘాన్ని గూర్చి అధికారులకు తెలియ పర్చలేదు (ద్రోహం చేయలేదు.)

ఈ పని జరుగుతున్న కాలంలో రష్యాలోని రహస్య సంఘంలో చేర్చబడ్డ సహోదరుల్ని కలిసికొని వారి అనుభవాల్ని వినడానికి మాకు గొప్ప అవకాశం దొరికింది. వారు గొప్ప భక్తులై పోయారు వారు అనేక సంవత్సరాలు కమ్యూనిస్టు సిద్ధాంతం క్రింద వున్నా క్రీస్తుకోసం నిలకడగా నిలుపబడ్డారు. కొందరు కమ్యూనిస్టు యూనివర్శిటీలలో చదివారు అయినా ఉప్పుతో నిండిన సముద్రంలోని చేప ఏ విధంగా తన మాంసాన్ని ఉప్పులేకుండ వుంచుకొంటుందో అలాగే ఈ విశ్వాసులు కూడ యిన్ని విధాలైన బోధలక్రింద వున్నా తమ ఆత్మల్ని క్రీస్తులో శుద్ధిగాను, పవిత్రంగా కాపాడుకొన్నారు.

ఈ రష్యన్ క్రైస్తవులు ఎంతో పవిత్రాత్మలు గలిగిన వారు! ఇతర రష్యన్ సిపాయిల మధ్య సేవ చేయడానికి వీరు ఎంతో తోడ్పడ్డారు.

సంతోషం తప్ప వీరిలో క్రైస్తవ గుణ లక్షణాలన్నీ కన బడ్డాయి. వారు రక్షణనొందిన రోజుల్లో మాత్రమే సంతోషంగా వున్నారు. తరువాత అది మాయమై పోయింది. అది నాకు చాల ఆశ్చర్యం కలిగించింది. "సంతోషం నీకెందుకు లేదు" అనినేనొక బాప్టిస్టు క్రైస్తవున్ని అడిగాను. అతడు "నేనొక యథార్థ క్రైస్తవుడను. ప్రార్థనలో గడుపుతాను, ఆత్మల సంపాదనకు పాటుపడతాను. అయినా నేనీ విషయాలు నా పాస్టరుగారితో మాట్లాడకూడదు. నేనెలా సంతోషంగా వుంటాను? మా సంఘ కాపరి రహస్య పోలీసుల తరపున పని చేస్తూవున్నాడు. కాపరులే ద్రోహులై పోయారు. హృదయంలో సంతోషం వుంది. గాని మీ లాంటి బాహ్య ఉల్లాసం మేము అనుభవించలేకున్నాం. మరొక విషయం మత స్వాతంత్ర్యం వున్న క్రైస్తవులు ఒక వ్యక్తిని రక్షణలోకి నడిపించినప్పుడు, అతడు నెమ్మదిగా బాహ్యసంఘంలో చేరవచ్చు. అయితే మేం ఒక వ్యక్తిని క్రీస్తునొద్దకు నడిపిస్తే అతడు జైలు పాలై పోవచ్చు. అతని బిడ్డలు అనాధులై పోతారు. కావున మా సంతోషం దుఃఖంతో మిళితమైవుంది" అన్నాడు.

మేం విచిత్రమైన క్రైస్తవుల్ని కల్సికొన్నాం. రహస్య సంఘంలోని క్రైస్తవులమైన మేం రష్యన్ల మధ్య సేవ చేసినప్పుడు అనేకసార్లు విస్మయమొందాం. నిజక్రైస్తవులు కాని వారనేకులు తాము నిజక్రైస్తవులని ఏలా భావిస్తారో ఆలాగే రష్యన్లలో నాస్తి

కులు కాని వారనేకులు తాము నాస్తికులమని భావిస్తారు.

ఒక పర్యాయం నేనొక రష్యన్ దంపతులతో మాట్లాడాను. వారు శిల్పకారులు. దేవుని గూర్చి చెప్పగా వారు "మేం నాస్తికుల మన్నారు— దేవుడనేవాడు లేడు అయితే మాకు జరిగిన ఒక విచిత్రమైన సంగతి చెబుతాం" అని చెప్పి ఈ కథ చెప్పారు—

"మేం ఒక పర్యాయం స్టాలిన్ విగ్రహాన్ని చెక్కుతున్నాం. పని చేస్తూవుండగా నా భార్య అకస్మాత్తుగా యిలా చెప్పింది. "ఏమండీ! బొటనవ్రేలు సంగతి ఎన్నడైనా ఆలోచించారా? వ్రేళ్ళన్నీ వున్నా బొటనవ్రేలు లేకుంటే ఎంత కష్టంగా వుంటుంది? సమ్మెట, సుత్తె, పుస్తకం లేక రొట్టెముక్కను పట్టుకోవాలంటే, బొటనవ్రేలు ఎంతో అవసరం! అలాగైతే ఈ బొటనవ్రేలును ఎవరు చేసారు? కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రకారం పరలోకం, భూలోకం, తమంతటతాముగా పుట్టుకొచ్చాయనీ దేవుడు వాటిని చేయలేదనీ, నేను నేర్చుకొన్నాను. అదే నమ్ముతాను. బహుశ దేవుడు భూమ్యాకాశాల్ని సృజించకపోవచ్చు కాని కనీసం ఈ చిన్న బొటనవ్రేలునైనా సృజిస్తే దాన్నిబట్టి కూడా ఆయన స్తోత్రార్హుడు. విద్యుద్దీపం, టెలిఫోన్ రైలు ఇంకా తదితరమైనవి కనుగొన్న ఎడిసన్, బెల్, స్టీవెన్‌సన్ అను వారిని మనమెంతో శ్లాఘిస్తాం. వాస్తవంగా మన బొటనవ్రేలును కల్పించిన వాన్ని మనం ఘనపరుస్తే ఏం? ఎడిసన్‌కు బొటనవ్రేలు లేకపోతే అతడు దేన్నీ కనుగొనివుండేవాడు కాడు. బొటనవ్రేలును కల్పించిన దేవున్ని ఆరాధించడం మంచిదనిపిస్తూందని" చెప్పింది.

"అప్పుడు నేను చాలా కోపంతో బుద్ధిలేని మాటలు మాట్లాడొద్దు! దేవుడు లేడని నీవు నేర్చుకొన్నావు. ఇప్పటిదాకా నీవు

చెప్పింది ఎవరైనా వింటే మనం ఎంతో అపాయంలో చిక్కు కొంటాం. నీ బుద్ధిని క్రమపర్చుకో, దేవుడు లేడని గట్టిగా నమ్ము. పరలోకంలో ఎవరూలేరు" అన్నాను.

"మన పితరులు బుద్ధిహీనంగా పరలోకంలోవున్న సర్వ శక్తిగల దేవున్ని విశ్వసించారు. సర్వశక్తిగల దేవుడు సమస్తాన్ని చేయసమర్థుడు అట్టివాడు ఒక బొటనవ్రేలును కూడ చేయగలడు. ఒకవేళ పరలోకంలో ఎవ్వరూ లేక పోయినా నామట్టుకైతే నా బొటనవ్రేలును సృజించిన ఆ "లేనివాన్నే" నా హృదయపూర్వ కంగా ఆరాధిస్తాను" అని చెప్పింది.

ఇలాంటి దేవునిలోనే వారి విశ్వాసమభివృద్ధి జెందింది. "లేనివాడు" అనేవాడు బొటనవ్రేలును మాత్ర మేగాక నక్షత్రాల్ని, పుష్పాల్ని, పిల్లల్ని, రమ్యమైన వాటినన్నింటినీ సృజించాడని చివరకు విశ్వసించారు.

పూర్వకాలంలో అథేనీయులు "గుర్తులేని దేవున్ని" ఆరా ధించినట్లే వీరూ చేసారు.

ఈ దంపతులతో నేను మాట్లాడిన తర్వాత వారు సంగతు లన్ని విపులంగా తెలిసికొని సిలువ వేయబడిన యేసు క్రీస్తును బహు సంతోషంతో అంగీకరించి రక్షణ పొందారు.

ఒకసారి రైల్వేస్టేషన్‌లో సువార్తచెప్పే ఒక సోదరి ఒక మిలిటరీ ఆఫీసరుగార్కి నా అడ్రసు నిచ్చింది.ఒకనాటి సాయంత్రం ఆయన నా యింటికి వచ్చాడు. "మీకు ఏం సహాయం చేయ మంటారు?" అని నేను అడిగితే ఆయన "నేను వెలుగుకోసం వచ్చాను" అని జవాబిచ్చాడు. దేవుని గ్రంథంలోని ప్రాముఖ్య వచనాన్ని నేనతనికి చదివి వినిపించాను. అతడు తన చేతిని నా

చేయిపైవేసి "నేను హృదయపూర్వకంగా అడుగుతున్నాను, నన్ను మోసం చెయ్యవద్దు. చీకటిలో బంధింప బడిన ప్రజల్లో నేను ఒకణ్ని. నిజంగా ఇది దేవుని వాక్యమేనా? దయచేసి చెప్పు" అన్నాడు. "ఔను దేవుని వాక్యమే" అని నేను గట్టిగా చెప్పాను. అతడు ఎంతో సేపు విని చివరికి క్రీస్తు నంగీకరించాడు.

మత విషయాల్లో రష్యన్లు లోతుగా చొరబడుతారు. మతానికి విరోధంగా గాని, లేక మతపక్షంగా గాని వారు త్రికరణ శుద్ధిగా పోరాడుతారు. అందువల్లే రష్యాలో ప్రతి నిజక్రైస్తవుడు ఆత్మలను సంపాదించు ఒక మిషనెరీగా వున్నాడు. సువార్త నంగీకరించడంలో ఈ దేశాన్ని మించింది ప్రపంచాన మరే దేశం లేదు.

మనం ఖచ్చితంగా సువార్త నందించితే అనతికాలంలో లోకమంతా మారిపోతుంది.

దేవుని వాక్యంకోసం ఇంతటి వాంఛవున్న రష్యాదేశ ప్రజల్ని దాదాపు ప్రపంచంలోని దేవుని పిల్లలంతా పూర్తిగా మర్చిపోవడం ఎంతో దుఃఖకరం.

ఒక పర్యాయం రైలు ప్రయాణం చేస్తున్నాను రష్యన్ ఆఫీసరు ఒకడు నాకెదురుగా కూర్చొని వున్నాడు. నేను కొన్ని నిమిషాలు మాత్రం అతనితో క్రీస్తును గూర్చి మాట్లాడానో లేదో అతడు ఉద్రేక పూరితుడై తన నాస్తిక వాదం చెప్పనారంభించాడు. మార్క్స్, స్టాలిన్, వాల్టెర్, డార్విన్ అనువారు బైబిలుకు విరోధంగా వ్రాసిన విషయాల్ని ఆగకుండ చెప్పుకుపోయాడు. నాకు తరుణమే ఇవ్వకుండా గంటసేపు దేవుడు లేడన్న అంశంపై మాట్లాడాడు. అతడు ముగించగానే నేనిట్ల

న్నాను, "ఒకవేళ దేవుడే లేకపోతే, కష్టాలొచ్చినప్పుడు, నీవెందుకు ప్రార్థిస్తావు?" అతడు ఆశ్చర్యచకితుడై "నేను ప్రార్థన చేస్తానని నీకెలాతెలుసు?" అని అడిగాడు. "మొదట నా ప్రశ్నకు జవాబు చెప్పు. నీవెందుకు ప్రార్థన చేస్తావు?" అప్పుడతడు తన తలవంచి "రణ రంగంలో జర్మన్లు మమ్మను చుట్టుకొన్నప్పుడు మేమంతా ప్రార్థించాం. ఎలా ప్రార్థించాలో మాకు తెలీదు. అయినా 'దేవా తల్లి ఆత్మా' అని చెప్పాం." అన్నిసత్యం చెప్పాడు.

రష్యనుల మధ్య మా పరిచర్య చాలా ఫలభరితంగా వుంది.

మా రహస్య సేవద్వారా పీటర్ అను ఒక యౌవనస్థుడు రక్షింపబడి బాప్తిస్మం కూడ పొందాడు ఒకసారి నేనతనితో "బైబిల్లోని యే వచనంవల్ల నీవు పట్టబడ్డావు" అని అడిగాను.

ఒక పర్యాయం మా రహస్య కూటంలో నేను లూకా సువార్త 24వ అధ్యాయాన్ని చదివాను. అందులో యేసు క్రీస్తు ఇద్దరితో మాట్లాడుతూ ఎమ్మాయు అనే గ్రామానికి వెళ్తుంటాడు. గమ్యస్థానం చేరి తర్వాత వారు యేసుకు ఇంటిలోకి రమ్మనేవరకు ఆయన లోనికి ప్రవేశింపక "ఇంకా కొంతదూరం వెళ్ళేవానిలా" కనిపించాడు. అందుకు ఆ యువకుడు- పీటర్ "లోనికి రమ్మని చెప్పేవరకు యేసు ఎందుకు వెళ్ళలేదు? ఆయనకు తన శిష్యులతో వుండటం యిష్టముండదన్నమాట" అని అనుకోసాగాడు. తర్వాత ఆ ప్రసంగంలో యేసు మర్యాదగల వాడని వివరించాను "ఆయన్ను ప్రేమతో ఆహ్వానిస్తేనేగాని ఏ ఇంటిలో చొరవగా ప్రవేశింపడు" అని చెప్పాను. దాన్ని విని "కమ్యూనిస్టులు అమర్యాదస్థులు, వాళ్ళు బలత్కారంగా ప్రవేశిస్తారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తమ బోధల్ని వినాలలి బలవంతం

చేస్తారు. వాటిని వారు తమ పాఠశాలలు, రేడియోలు, వార్తా పత్రికలు పోస్టర్లు, సినీమాలు, నాస్తిక కూటాలు, యిత్యాది వాటి ద్వార బలవంతంగా వినిపింప జేస్తారు ఎటు తిరిగినా వారి దుష్ట సంగతులే మనకు వినిపిస్తాయి మనకు ఇష్టంవున్నా లేకున్నా తప్పక వారి ప్రచారాల్ని విని తీరాల్సిందే. అయితే యేసు స్వాతంత్ర్యాన్ని లక్ష్యపెడతాడనీ నెమ్మదిగా మన హృదయ ద్వారాన్ని తట్టుతాడ"ని తలంచి యేసును అంగీకరించాడు.

"యేసు తన మర్యాద, మన్ననల ద్వారా నన్ను వశీకరించుకొన్నాడు" అని నాకు జవాబు యిచ్చాడు. కమ్యూనిజానికీ, క్రీస్తుకు మధ్యగల ఈ తారతమ్యమే అతన్ని ఒప్పింపచేసింది.

రక్షింపబడిన తర్వాత పీటర్ అనేకసార్లు తన ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకొని, కరపత్రాలు, బైబిళ్ళు రుమానియానుండి రష్యాలోకి పంపించాడు. చివరికి అతడు పట్టుబడిపోయాడు. 1959వ సంవత్సరం వరకు అతడు జైల్లో వున్నాడని నాకు తెలిసింది అతడు మరణించాడో? లేక తన ఘనమైన పరిచర్యను ఇంకా చేస్తునేవున్నాడో? నాకు తెలీదు. అది దేవుడికే ఎరుక.

ఇతనిలాగే అనేకులు రక్షణపొంది క్రీస్తు సేవకులైనారు ఒక ఆత్మను క్రీస్తుకోసం సంపాదించడంతో మన పని పూర్తి కాబోదు. అది మన పనిలో సగం మాత్రమే క్రీస్తుకోసం సంపాదించిన ప్రతి వ్యక్తీ ఆత్మల సంపాదకుడై వుండాలి. రష్యన్లు రక్షణపొందాక రహస్య సంఘంలో మిషనెరీల్లా వారు క్రీస్తుకోసం సాహసవంతులై త్యాగశీలులై తమ కోసం మరణించిన ఆ క్రీస్తు కోసం ఎంత జేసినా అది బహుకొద్దని భావించేవారు.

# 3

# దాస్యశృంఖలాల్లో నున్న దేశానికి మా రహస్య పరిచర్య

మా సేవ రెండో భాగం రుమానియా దేశీయులకు సువార్త నందించడం.

బహు త్వరలోనే కమ్యూనిస్టువారి నిజస్వరూపం వెల్లడై పోయింది. మొదట మా సాంప్రదాయాలచేత క్రైస్తవ సంఘనాయకుల్ని మచ్చిక చేసికొన్నారు. ఆ తర్వాత దౌర్జన్యం ప్రారంభమైంది. వేల సంఖ్యలో ప్రజల్ని బాధించడం ప్రారంభించారు.

నేనూ, నా పరిచర్యద్వారా రక్షణపొందిన వారిలో కొందరం జైలుపాలై పోయాం. నేనున్న గదిలోనే తన విశ్వాసాన్నిబట్టి బంధింపబడ్డ ఒకడున్నాడు. అతనికి ఆరుగురు పిల్లలు. వారిని, భార్యను అనాథలుగా వదలేసి వచ్చాడు. ఇంటివద్ద వాళ్ళు ఆకలికి అల్లాడిపోతున్నారు. ఇక అతడు వారిని ఎన్నటూ చూడక పోతే, చూడకపోవచ్చు. "... నిన్ను క్రీస్తులోనికి నడిపినందువల్ల నీ కుటుంబానికి ఈ దుర్గతి సంభవించింది. నామీద నీకు ఆయాసముందా?" యని అతన్ని అడిగాను. ... "నన్ను ... లోకి నడిపినందుకు నా కృతజ్ఞతను నీకెలా తెలుపాలో పాలుపోవడం లేద"ని బదులు చెప్పాడు.

ఈ నూతన పరిస్థితిలో సువార్త ప్రకటన మహా కష్టమై పోయింది. మేము కొన్ని క్రైస్తవ పత్రికలు అచ్చునెయ్యాలంటే

ముందు వాటిని కమ్యూనిస్టులు పరీక్షించి చూచాకే మాకు అనుమతి నిచ్చేవారు. మేం అచ్చు వేయగోరిన ప్రతీ పుస్తకం విషయం ఆలాగే జరిగేది. ఒకసారి మేం ఒక చిన్న పుస్తకాన్ని అచ్చు వేయడానికి ఏర్పాటు చేసికున్నాం. దాని అట్టమీద కారల్ మార్క్స్ (కమ్యూనిజానికి జనకుడు) పటాన్ని వేసి, దానికి "మతమంటే మనుషులకు నల్లమందు" అని పేరు పెట్టాం.దానిలో మార్క్స్. లెనిన్, స్టాలిన్ చెప్పిన సంగతుల్ని ఎత్తి వ్రాసాం. తరువాత క్రీస్తును గూర్చి వర్ణించాం మా పుస్తకాన్ని పరీక్షించే అధికారులు దాని పటాన్ని, పేరు, ముందు మాట చూచి అచ్చు వేయడానికి, పంచిపెట్టడానికి సెలవిచ్చారు. మేం ఈ పుస్తకాల్ని కమ్యూనిస్టునారు జరిపించే మహా సభల్లో పంచిపెట్టేవాళ్ళం. అట్ట మీది బొమ్మను చూసి ప్రజలు ఆశతో తీసుకొని చదివేవారు. సుమారు పదో పేజీకి వచ్చాక దేవుడి విషయం, క్రీస్తు విషయం కనబడతాయి. ఇంతలో మేం అక్కడి నుండి మెల్లగా తప్పుకొని వెళ్ళిపోయేవాళ్ళం.

ఆ కాలంలో అంతటా అని విధాలుగా ప్రజలు అణచివేయ బడటం చూశాం ప్రజల దగ్గరవున్న ప్రతీ వస్తువును కమ్యూనిస్టులు లాక్కున్నారు రైతులనుంచి పొలాల్ని. గొఱ్ఱెమందల్ని తీసుకొన్నారు చిన్నచిన్న దుకాణాల్ని దోచుకొన్నారు. ధనిక వర్గం మాత్రమే గాక నిరుపేదలు కూడా బహు బాధకు గురయ్యారు. ప్రతి ఇంటిలో ఎవరో ఒకర్ని చెరసాల్లో బంధించారు. పేదరికం పెరిగిపోయింది. "దయామయుడైన దేవుడు దుష్టత్వానికి ఎందుకు జయమిస్తున్నాడా?" అని ప్రజలు అడగడం మొదలెట్టారు.

అయితే అన్ని విధాల ప్రశ్నలకు దేవుని వాక్యంలో జవాబు లున్నవి. పేద లాజరుమ గూర్చి ప్రభువు మనకు చెప్పాడు అతడు ఆకలితోను, పుండ్లతోను బాధపడుతుంటే, కుక్కలు అతని పుళ్ళు నాకాయి. అయితే అతడు చనిపోయాక అబ్రహాం రొమ్ము నానుకోడానికి దేవ దూతలు పరలోకానికి అతణ్ణి తోడ్కొని వెళ్ళారు.

## రహస్య సంఘం కొంతమట్టుకు బహిరంగంగా సేవ చేసిన విధం

రహస్య సంఘం వేర్వేరు గృహాల్లో అడవుల్లో ఇంకా వీలైన స్థలాల్లో కలిసికొనేది అప్పుడు రహస్యంగా బహిరంగ సేవ చేయడానికి ఉపాయం పన్నుకొన్నాం. అదేమంటే చాలా జాగ్రత్తగా వీధుల్లో బోధించడం అలా చేసి అనేకులకు సువార్త నందించాం. ఇట్టి పనిలో నా భార్య చాల చురుగ్గా వుండేది. కొంత మంది క్రైస్తవులు కలసి ఒక వీధి మొగలో నిల్చి పాటపాడే వారు. దివ్యమైన సంగీతాన్ని వినడానికి ప్రజలు గుంపుకూడిన తర్వాత నా భార్య చిన్న ప్రసంగం చేసేది. పోలీసులు రాక ముందే వారు ఆ స్థలాన్ని విడిచి వెళ్ళేవారు.

ఒక మధ్యాహ్నం వేళ నేను వేరే స్థలంలో వున్నాను. నా భార్య బుఖారెస్ట్ పట్టణ లో పెద్ద కర్మాగారం వద్ద వేలాది కార్మికులకు వర్తమానాన్నందించింది. ఆమె దేవున్ని గూర్చి, రక్షణను గూర్చి చెప్పింది మరుసటి రోజున ఆ కర్మాగారంలోని అనేకులు కమ్యూనిస్టువారి అక్రమ చర్యల్ని ఎదిరించి దుర్మరణం పాల య్యారు. సరైన సమయంలోనే వారు సువార్తను వినగల్గారు!

మేం రహస్య సంఘానికి చెందినా, బాప్తిస్మమిచ్చు యోహానులా ధైర్యంగా, బహిరంగంగా ప్రజలకు, అధికారులకు, సువార్త నందించాం.

ఒక పర్యాయం మా సహోదరుల్లో ఇద్దరు ప్రధాన మంత్రి ఉండే సర్కారు భవనంలోకి ప్రవేశించి ఆయనకు కొన్ని నిమిషాల్లో సువార్త చెప్పారు. ఆయన తన దౌర్జన్యక్రియల్ని, పాపాల్ని వదలి క్రీస్తువైపు తిరగాలని వారు ఆయనకు చెప్పారు. అంత ధైర్యంగా వారు సాక్ష్యమిచ్చినందుకు ఆయన వారిని చెరసాల్లో వేయించాడు. కొన్ని సంవత్సరాలైన తర్వాత అదే ప్రధాన మంత్రికి బాగా జబ్బుచేసింది. కొంత కాలం క్రిందట అతనిలో నాటుకొన్న వాక్యం హృదయంలో ఫలించింది. తన క్లిష్టపరిస్థితిలో దేవుని పిల్లలు చెప్పిన మాటలు జ్ఞాపకానికొచ్చాయి. బైబిల్లో వ్రాసివున్న మాటలే వారు చెప్పారు. అవి "సజీవమై బలముగలవై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండెను." దేవుని వాక్యం ఆయన రాతి హృదయంలోకి దూసికొని పోగా అతడు తన ప్రాణాన్ని క్రీస్తుకు అప్పగించాడు. అతడు తన పాపాల్ని ఒప్పుకొని రక్షకని అంగీకరించి పడకలో కూడా క్రీస్తును సేవించాడు. కొంత కాలం తర్వాత ఆయన మరణించి తాను నూతనంగా కనుగొన్న రక్షకునిచెంతకు చేరాడు, ఎందుచేతనంటె ఇద్దరు క్రైస్తవులు గొప్ప విలువ చెల్లించారు కాబట్టి నేను కమ్యూనిస్టు దేశాల్లో విశ్వాసులు అనేకులీలాగు ధైర్యం వహించి సేవ చేస్తున్నారు.

రహస్య పోలీసువారు, మా రహస్య సంఘాన్ని బహుగా హింసించారు. కమ్యూనిస్టు అన్యాయ అధికారాన్నెదిరించడానికి

ఇదొకటే మిగిలి వుందని వారు తెలిసికొన్నారు. కాబట్టి ఆత్మ సంబంధమైన ఈ తిరుగుబాటును నాశనం చేయ యత్నించారు ఒక వ్యక్తి క్రీస్తును విశ్వసిస్తే అతడు అనాలోచనగా, తెలివి హీనంగా కమ్యూనిస్టు సిద్ధాంతాల్ని అవలంబించబోడని వారు గ్రహించారు. కావున వారు విశ్వాసులపై తీవ్ర పోరాటాన్ని జరిపారు. అయితే రహస్య సంఘం మేలు కోరువారు కూడ కమ్యూనిస్టుల్లో రహస్య పోలీసుల్లో వున్నారు.

మేము కొంతమంది క్రైస్తవుల్ని రహస్య పోలీసులతో కలిపి వేశాం. వారు వారి రహస్యాల్ని సంఘానికి ఎప్పటికప్పుడు తెలియ పర్చేవారు. కొందరు విశ్వాసులు తమ విశ్వాసాన్ని దాచిపెట్టుకొని అలా చేసేవారు. అలా చేయడంవల్ల తమ సొంత కుటుంబాలే వారిని తృణీకరించాయి ఎందుకంటే వారు చేస్తున్నదేమో కనీసం యింట్లోకూడా చెప్పే వారుకాదు అయినా వారు నిరుత్సాహపడక సంతోషంగా అలాగు చేయసాగారు. క్రీస్తుకోసం అంత ప్రేమతో వ్యవహరించారు.

ఓసారి కమ్యూనిస్టులు వీధిలో నన్ను పట్టుకొని ఎక్కడో రహస్య స్థలంలో నన్ను దాచేసారు నన్ను వెదకడానికి ఒక క్రైస్తవ డాక్టరు రహస్య పోలీసులతో కలిసి వారిలో ఒకడై వారి దుస్తులే ధరించుకొని తిరగసాగాడు. రహస్య పోలీసులకు వైద్యుడైనందున చెరసాల గదుల్లో బంధీలైన ఖైదీలందర్నీ చూడ్డానికి ఆయనకు అవకాశం చిక్కింది

అతడొక కమ్యూనిస్టుగా మారిపోయాడని తన మిత్రులంతా ఆయన్ను తృణీకరించారు ఖైదీల దుస్తు వేసికోడం కంటె హింసాకారుల దుస్తులు వేసుకోడమే క్రీస్తుకోసం చేసే గొప్ప త్యాగంగా వుండింది

నేనొక చీకటిగదిలో వుండడం ఆ డాక్టరు కనుగొన్నాడు. 1956 సం॥లో ఐసన్‌హోవర్ కృశ్చేవ్‌లు చేసిన ప్రయత్నాలద్వారా కొంత నెమ్మది కలిగింది. ఆ సందర్భంలో ఖైదీల్లో కొందరికి విడుదల కలిగింది. నా విడుదలకోసం క్రైస్తవులంతా గొడవ చేసినందున నన్ను కూడ కొంతకాలం వరకు విడుదల చేశారు

ఈ క్రైస్తవ డాక్టరు కృషి ఫలితంగానే నేను బయటికి రాగల్గాను. లేకుంటే నేనింకా చెరసాలలోనే బంధింపబడి వుండే వాడను, లేదా, సమాధిలో వుండియుందును.

రహస్య పోలీసుల్లో చేరిన ఈ క్రైస్తవులు మాకెన్నో విధాల సహాయపడ్డారు. ఇప్పటికీ అట్టివారు ఎందరో వుండి ప్రతి అపాయాన్ని గూర్చి క్రైస్తవుల్ని హెచ్చరిస్తున్నారు. వారిలో కొంతమంది కమ్యూనిస్టుల మధ్య ఉన్నత పదవుల్లోవుండి. క్రీస్తులో తమకున్న విశ్వాసాన్ని గూఢంగావుంచి మాకెంతో సహాయం చేస్తున్నారు అప్పుడు రహస్యంగా క్రీస్తును సేవిస్తున్న వీరు ఒక దినాన పరలోకంలో ఆయన్ను బహిరంగంగా ఒప్పుకొంటారు, సేవిస్తారు.

రహస్య సంఘస్థు లనేకుల్ని పట్టుకొని చెరసాల్లో వేశారు. మా మధ్యలో యూదా ఇస్కరియోతు వంటివారు కూడ ఉన్నారు. రహస్య పోలీసుల్తో వీరు చేయికలిపి మాకు శ్రమ కలిగించేవారు కమ్యూనిస్టులు బెదిరింపులద్వారా, దెబ్బలద్వారా ఇంకా అనే ఇతర ఉపాయాలద్వార క్రైస్తవ సహోదరుల్ని అప్పగించే ప్రయత్నాలు చేయ సాగారు

# 4
# నా చెరసాల జీవిత ఆరంభం

1948 సం॥ ఫిబ్రవరి 29 నాటికి నేను బాహ్యంగానూ, రహస్యంగాను పరిచర్య జరిగించాను. ఒక ఆదివారం ఉదయాన్నే నేను ఆరాధనకు వెళ్తుండగా, రహస్య పోలీసులు అకస్మాత్తుగా వచ్చి నన్ను బలాత్కారంగా పట్టుకెళ్లారు.

ఆ కాలంలో అనేకుల్ని ఈ విధంగానే పట్టుకొన్నారు ఒక పోలీసు కారు వచ్చి నా ముందాగింది వెంటనే నల్గురు పోలీసు వారు దాన్నుండి దుమికి నన్ను పట్టుకొని బలవంతంగా ఎక్కించుకొని వెళ్ళారు సుమారు ఎనిమిది సంవత్సరాలు. నేను బ్రతికానో? చనిపోయానో? ఎవ్వరికీ తెలీదు. కొంతమంది రహస్య పోలీసులు విడుదలపొందిన విశ్వాసుల్లాగా నటన చేస్తూ మా గృహాన్ని దర్శించారు. నేను మరణించినట్లునూ వారు నా అంత్యక్రియల్లో పాల్గొందినట్లునూ నా భార్యతో చెప్పారు. దుఃఖంతో ఆమె గుండె పగిలిపోయింది

అన్ని సంఘాల్లోంచి అనేక వేల మంది అప్పుడు చెరసాల్లో వేయబడ్డారు బోధకులు మాత్రంగాక పేదలు, యౌవనులు అన్ని రకాలవారు జైలుపాలయ్యారు అన్ని కమ్యూనిస్టు దేశాల జైళ్ళలో చిత్రహింస జరిగినట్లే రుమానియా జైళ్ళలో కూడా చిత్రహింస జరిగింది. ఇట్టి చిత్రహింస కొన్ని పర్యాయాలు అతి బాధాకరంగా

వుండేది. నేను అనుభవించిన వాటన్నిటినీ చెప్పలేను. అలా చెప్తితే ఆ రాత్రి నిద్రపోలేను.

## చెప్పనలవికాని చిత్రహింసలు

ఫ్లొరెస్కూ - యనే పాస్టరును బాగా ఎర్రగా కాల్చిన ఇనుప కోలల్తో కత్తులతో వారు హింసించారు దారుణంగా కొట్టారు. ఆయన గదిలో కొన్ని ఆకలితో నున్న ఎలుకల్ని విడిచారు. వాటిని పారదోలుతూ రాత్రంతా నిద్రలేక మెలుకువగా నుండాల్సి వచ్చింది. ఒక్క క్షణం విశ్రాంతికై కళ్ళు మూసినా ఎలుకలు ఆయనపై పడేవి

రాత్రింబవళ్ళు రెండు వారాలు అతడు నిలువబడే వుండేలా వారు బలవంతం చేశారు. తన తోటి విశ్వాసుల పేర్లు చెప్పించడానికి కమ్యూనిస్టులు అలా చేసారు. గాని ఆయన ఒప్పుకోక స్థిరంగా నిల్చాడు. తుదకు వారు 14 సంవత్సరాల వయస్సుగల అతని కుమారున్ని తీసికొచ్చి ఆయన ముందర కొరడాతో కఠినంగా దెబ్బలు కొట్టుతూ, ఆయన ఒప్పుకొనే పర్యంతం అలాగే కొట్టుతాం అని చెప్పారు. పాపం అతడు సగం మతి చెడినవాడయ్యాడు అతడు సహించినంత సేపు సహించాడు ఇక సహించే శక్తి లేక తన కుమారునితో యిలా చెప్పాడు.

"అలెగ్జాండర్, నేను నీ బాధను చూచి ఇక భరించలేను వారు కోరింది చేస్తా" అన్నాడు అప్పుడు కుమారుడు "నాన్న గారూ, నా తండ్రి విశ్వాసఘాతకుడైతే నేను చూచి సహించలేను. అట్టి అన్యాయం చెయ్యోద్దు. వారిని ఎదిరించండి. వారు నన్ను చంపినా, 'యేసు, నా ప్రియ దేశం' అను మాటల్తో చనిపోతాను" అన్నాడు. కమ్యూనిస్టులు కోపోద్రేకులై అతని పైబడి కొట్టి

చంపారు అతని రక్తం గదిలో గోడలమీదికి చిందింది. దేవున్ని స్తుతిస్తూ అతడు మరణించాడు. ఈ ఘోర కృత్యాన్ని చూచిన తర్వాత మన ప్రియ సహోదరుడు ఫ్లొరెస్కూకు మతి భ్రమించింది. మళ్ళీ అతడు ఎన్నడూ పూర్వస్థితికి రాలేదు.

మా చేతులకు వేసిన సంకెళ్ళకు లోపలి భాగంలో వాడియైన ముళ్ళుండేవి. చలనం లేక నెమ్మదిగా వుండే వాటివల్ల బాధ లేదు. అయితే చలివల్ల గడగడ వణికినప్పుడు చేతులు కదిలితే చాలు ఆ మేకులు గ్రుచ్చుకొని శరీరాన్ని చీల్చేవి

కమ్యూనిస్టులు క్రైస్తవుల్ని త్రాళ్ళతో కట్టి తలక్రిందులుగా వ్రేలాడదీసి బలమైన దెబ్బలు కొట్టుతుండగా వారి శరీరాలు ముందుకు వెనుకకు ఊయలలా ఊగేవి వారు క్రైస్తవుల్ని మంచుతోనిండిన చల్లని గదుల్లో బంధించేవారు. వేసికోడానికి నాకు సరైన వస్త్రాలు లేకున్నా నన్నుగూడ అట్టి గదిలో వేసారు. చెఱసాల డాక్టర్లు మమ్మల్ని జాగ్రత్తగా కనిపెడుతూ చలికి బిగిసి చనిపోవడానికి సిద్ధంగా నున్నప్పుడు వెంటనే డాక్టరు ఉత్తరువు చేసేవాడు. సిపాయిలు మమ్మల్ని బయటికి లాగివేసే వారు. తరువాత వారు పీనుగుల్లా పడివున్న ఈ క్రీస్తు భక్తులకు కొంత వెట్ట కలిగించి ప్రాణాల్ని తెప్పరిల్ల జేసేవారు. కొంచెం మంచిగా కనబడగానే తిరిగి అదే చల్లని కొట్టులో బంధించివేసేవారు. ఈవిధంగా మాటిమాటికి చేస్తుండేవారు.

ఇంకా చెక్కపెట్టెలు చేసి వాటి లోపల మమ్మల్ని పెట్టేవారు. అవి మా శరీర పరిమాణంకంటే కొంచెం పెద్దగావుండేవి. వాటిలో అటుయిటు కదల్లేక యిరుక్కొని పోయేవాళ్ళం. అంతే గాక పదునైన ఇనుప మేకులు అన్నివైపుల నుండి లోపలికి కొట్టి వున్నాయి మేము కదలకుండా జాగ్రత్తగా నిలిస్తే పర్వాలేదు.

గాని అలసి కొంచెము ప్రక్కకు ఒరిగితే ఆ మేకులు శరీరంలోకి చొచ్చుకొనిపోయి గాయపర్చేవి.

కమ్యూనిస్టులు క్రైస్తవులకు పెట్టిన శ్రమలు మానవ అవగాహనకు అందేవికావు.

కమ్యూనిస్టులు క్రైస్తవుల్ని హింసించడం నేను చూచి నప్పుడు వారి ముఖాలు ఆనందంతో ప్రకాశిస్తూ ఉండేవి. విశ్వా సుల్ని హింసిస్తూ "మేము పిశాచులం" అని కేకలు వేసేవారు.

నిజంగా మనం పోరాడేది శరీరులతో కాదు గాని దురాత్మల సమూహాలతోనే.

కమ్యూనిజం మనుష్యులు తెచ్చింది కాదు. అది సాతాను దగ్గర నుండి వచ్చిందని మేం తెలిసికొన్నాం. అదొక ఆత్మ సంబంధమైన శక్తి– దుష్ట శక్తి. దాన్ని జయించడానికి దాని కంటె బలమైన ఆత్మ శక్తి కావాలి. అదే దైవాత్మ.

మమ్మల్ని చిత్రహింస చేస్తున్నవార్ని అనేక పర్యాయాలు "మీ హృదయాల్లో కొంచెమైనా జాలి లేదా?" అని అడిగాము. సర్వసాధారణంగా వారు లెనిన్ చెప్పిన సూక్తుల నెత్తి, "గుడ్డుపై చిప్పను పగుల గొట్టకుండా దాన్ని అట్టువేయలేం. చిన్నచిన్న పేళ్ళు ఎగురకుండా కట్టెలు నరకలేం" అని జవాబిచ్చారు తిరిగి నేను "అవును, అదంతా నాకూ తెలుసు. అయితే వీటికీ మనుష్యు లకూ భేదం వుందికదా? నీవు కట్టెను నరికితే దానికి నొప్పి కలుగదు. అయితే మీరు ఇక్కడ కొడుతోంది మీ తోటిమానవుల్ని ప్రతి దెబ్బకు ఎంత బాధ కలుగుతోందో మీకేం తెలుసు? అందుకు కన్న తల్లులు ఎంతో రోదిస్తున్నారు"అన్నాను.గాని ఎంత చెప్పినా అంతా వ్యర్థమే. వారు అనాత్మవాదులు. పదార్థాన్నే వారు నమ్మ

తారు గాని మానవులు వారి దృష్టిలో ఒక కరలాగానో గ్రుడ్డు మీది పై పేంకులాగానో వున్నారు. ఇట్టి నమ్మకం గలవారైనందున ఎంతటి క్రూరకార్యాన్నైనా చేయ సాహసిస్తారు.

నాస్తికత్వంలోని క్రూరత్వాన్ని నమ్మడం కష్టం. చెడు కార్యాలకు దేవుడు శిక్ష విధిస్తాడనీ తీర్పు దినమొకటి వస్తుందనీ మనుష్యులు నమ్మకపోతే జాలి చూపుటకు కారణముండదు. కమ్యూనిస్టు హింసకులు పలుసార్లు కట్లనేవారు "దేవుడు లేడు, మోక్ష నరకాలు లేవు. మా ఇష్టం వచ్చినట్లు మేం జీవిస్తాం" ఒక హింసకుడు ఇలా చెప్పగా విన్నాను—"నా హృదయంలో నున్న చెడుగునంతటిని బయట పెట్టుకోడానికి, ఈ గడియవరకు బ్రతికివున్నందుకు, నేను ఏ దేవుణ్ని నమ్మలేక పోతున్నానో ఆ దేవునికి స్తోత్రాలు చెల్లిస్తున్నాను." తాను చెప్పిన ప్రకారమే అతడు వర్ణనాతీతమైన విధాలుగా ఖైదీల్ని హింసించాడు.

వీరినుండి నేను పాఠం నేర్చుకొన్నాను వారి హృదయాల్లో యేసుకు ఎంతమాత్రం స్థలం లేకుండా ఎలా చేసారో అలాగే సాతానుకు నా హృదయంలో ఏమాత్రం స్థలం ఇవ్వకూడదని తీర్మానించుకొన్నాను.

వారు క్రైస్తవుల్ని సిలువలకు కట్టేసి, నాల్గు రోజులు రాత్రింబగళ్ళు ఉంచారు. ఈ సిలువలను భూమి మీద పడుండజేసిన తర్వాత వందలాది ఖైదీలు తమ మలమూత్రాల్ని సిలువలో కట్టివున్న విశ్వాసుల ముఖాల మీదా శరీరాల మీదా విసర్జించారు తరువాత ఆ సిలువలను లేపి నిల్పిన తర్వాత కమ్యూనిస్టులు వారిని చూచి నవ్వుతు ఎగతాళి చేస్తూ, మీ క్రీస్తును చూడండోయ్! అతడెంత సౌందర్యవంతుడో చూడండి! పరలోకాన్నుండి ఎంత సుగంధాన్ని తెచ్చాడో చూడండి" అన్నారు.

ఒకప్పుడు వారు ఒక మత గురువును భరింపజాలని చిత్రహింసలు పెట్టిన తర్వాత, మనుష్య మల మూత్రాల్ని తెచ్చి ఆయనకిచ్చి, వాటిని ప్రభువు రాత్రి భోజనంగా తన ప్రజలకు వడ్డించుమని బలవంతం చేసారు. ఇది రుమానియా దేశంలోని డిటెస్టీ జైల్లో జరిగిన సంఘటన.

ఇది ఒక ఆదివారాన్న జరిగిన సంభవం మాత్రమే. ఇంకా అనేక ఆదివారాల్లో జరిగినదానిలో ఇది చిన్న భాగం మాత్రమే. ఇతర సంగతులైతే చెప్పనశక్యం. అట్టి సంగతుల్ని తిరిగి తిరిగి వర్ణిస్తే నా గుండె నిలిచిపోతుందని తలస్తున్నాను. అవి బహు భయంకరమైనవి, వ్రాయడానికి తగినవి కానివి. క్రీస్తునందు మీ సహోదరులు ఇటువంటి అవస్థలు పడినారు. ఇప్పుడు కూడా అనుభవిస్తున్నారు.

విశ్వాస వీరుల్లో పాస్టర్ మిలాన్ హైమోవీచి అగ్రగణ్యుడు.

ప్రజలతో జైలు కిక్కిరిసి వున్నందున కాపలా కాసేవారికి మా పేర్లన్నీ సరిగా తెలిగావు. జైలు చట్టాన్ని మీరినందుకు, ఇరువది ఐదు కొరడా దెబ్బలు కొట్టడం అధికారులిచ్చే శిక్ష. లెక్కలేనన్ని పర్యాయాలు పాస్టర్ మిలాన్ హైమోవీచి ఇతరులకు బదులు వెళ్ళి అట్టి దెబ్బలు తానే తిన్నాడు. దీన్నిబట్టి ఖైదీలు, ప్రభువైన క్రీస్తునూ, ఆ పాస్టరును కూడా ఎంతో శ్లాఘించారు

కమ్యూనిస్టులు పెట్టిన క్రూరమైన హింసల్ని గూర్చి క్రైస్తవులు చేసిన త్యాగాన్ని గూర్చి చెప్పాలంటే దానికి అంతంలేదు. బంధకాలలో నున్న విశ్వాసులు చేసిన త్యాగం బయటనున్న క్రైస్తవులకు గొప్ప సాక్ష్యంగా వుండేది.

మా రహస్య సంఘంలో ఒక యువతి ఉద్యోగం చేస్తుండేది. ఆమె రహస్యంగా సువార్తలు పంచిపెట్టుతున్నట్లు. పిల్లలకు క్రీస్తును

గూర్చి బోధిస్తున్నట్లు కమ్యూనిస్టు పోలీసులు గమనించి ఆమెను పట్టుకోవాలని తీర్మానించారు. ఆమెకు ఎక్కువ బాధ, దుఃఖం కల్గించాలని వెంటనే పట్టుకొనక కొంతకాలం కనిపెట్టుతూ ఆమె వివాహదినం వరకు ఆగినారు.

తన వివాహ దినాన ఆ సహోదరిని పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు ఒక కన్యజీవితంలో మహానందకరమైన, అద్భుతమైన శుభప్రదమైన దినం అది. అకస్మాత్తుగా తలుపు తోసికొని రహస్య పోలీసులు లోనికి ప్రవేశించారు.

పెండ్లికూతురు వారిని చూడగానే ముందుకు వచ్చి సంకెళ్లు వేయమని తన చేతులు చాపింది. వారు మొరటుగా సంకెళ్ళు వేసారు. అప్పుడు ఆమె ఆ సంకెళ్ళను ముద్దుపెట్టుకొని, "నా చేతులకు వేసిన ఈ ఆభరణాల కోసం నా పరలోక పెండ్లి కుమారునికి కృతజ్ఞత చెప్పకుండా వుండలేక పోతున్నాను. క్రీస్తుతో శ్రమ అనుభవించడానికు యోగ్యురాలనుగా నన్ను ఎంచినందుకు ఆయనకు వందనాలు" అని గంభీరంగా చెప్పింది. విశ్వాసులును పెండ్లి కుమారుడును ఏడుస్తుంటే వారు ఆమెను లాక్కొని వెళ్ళి పోయారు కమ్యూనిస్టు కావలివారి చేతుల్లో పడ్డ క్రైస్తవ యువతుల గతి ఏమౌతుందో వారికి తెలిసిందే అయిదు సంవత్సరాలైన తర్వాత ఆమెను విడుదల చేశారు. చెరసాలలోన హింసలవల్ల ఆ సోదరి ముసలిదానిలా అయిపోయింది. తన రక్షకుని కోసం తాను చేసింది బహు స్వల్పం అని చెప్పింది. ఇట్టి దివ్యజీవితాలు గల క్రైస్తవులు రహస్య సంఘాలలో నున్నారు.

## మానసిక శోషణా కార్యక్రమం.

మానసిక శోషణం అంటే చాలా మందికి తెలుసు. ఇది కొరియా యుద్ధంలోను ఇప్పుడు వియత్నాంలోను జరుగుతున్న

కార్యక్రమం. ఈ యనుభవం నాకు కూడా కలిగింది. ఇది బహు భయంకరమైన హింస.

దినానికి 17 గంటలు పాటు ఈ క్రింది మాటలు వింటూ సంవత్సరాలు గడపాల్సి వుంటుంది.

"కమ్యూనిజమే మంచిది!
కమ్యూనిజమే మంచిది!
కమ్యూనిజమే మంచిది!
క్రైస్తవ్యం బుద్ధిహీనమైంది!
క్రైస్తవ్యం బుద్ధిహీనమైంది!
క్రైస్తవ్యం బుద్ధిహీనమైంది!
దాన్ని వదలిపెట్టు
దాన్ని వదలిపెట్టు
దాన్ని వదలిపెట్టు"

ఈ ప్రకారం దినానికి 17 గంటలు చొప్పున—దినాలు, వారాలు, నెలల తరబడీ వినవలసి వచ్చేది.

ఈ శోధన నెలా ఎదిరించగలిగారని కొందరు క్రైస్తవులు నన్నడిగారు. దీని నెదిరించడానకు ఒకటే విధానం వుంది. పవిత్ర హృదయం. యేసుక్రీస్తు ప్రేమచేత హృదయం శాశనమైతే నీవు అన్ని విధాలైన హింసల్ని ఎదుర్కొన గలవు. ఒక పెండ్లి కుమార్తె తన వరునికోసం ఏం చేయమంటే అదే చేస్తుంది. ఒక తల్లి తన బిడ్డ కోసం ఏం చేయదు? మరియమ్మలా నీవు క్రీస్తును ప్రేమిస్తే ఒక పెండ్లికుమార్తె తన పెండ్లి కుమారుని ఎలా ప్రేమిస్తుందో అలా నీవు క్రీస్తును ప్రేమిస్తే ఇట్టి హింసల్ని నీవు కూడ భరించగలవు.

మన సహనాన్నిబట్టి దేవుడు తీర్పుతీరుస్తాడు. కమ్యూనిస్టు జైల్లోని క్రైస్తవులు దేవున్ని, తోటి మనుష్యుల్ని ప్రేమించగలరని నేను చెప్పగలను.

హింసలు బహు క్రూరంగా జరుగుతూనే వున్నాయ్. నేను దెబ్బలు తిని స్మృతితప్పి పడిపోయేవాడను. నన్ను తిరిగి నా గదిలోకి తెచ్చేవారు. నేను అలా కొన్ని దినాలు పడివుండేవాడను. తర్వాత కొంత బలం చేకూరేది. వారు మళ్ళీ నన్ను బాధింప మొదలు పెట్టేవారు. నాతోటి ఖైదీలు అనేకులు ఆ చిత్రహింసకు తట్టుకోలేక అలానే మరణించారు. గాని ఏదో ఒక విధంగా నేను మాత్రం బలం పొందుతూ బతికి వున్నాను.

ఆ సంవత్సరాలలో ఆయా జైళ్ళలో వారు నా వీపు ఎముకలలో నాల్గింటిని విరుగ్గొట్టారు. ఇంకా ఇతర ఎముకలు కూడా దెబ్బలకు విరిగాయి. నా శరీరాన్ని కాల్చడం, కత్తులతో కోయటం ద్వారా, పదునెనిమిది రంధ్రాలు జేసారు.

నేను విడుదల పొందినప్పుడు డాక్టర్లు నా గాయాల్ని, క్షయరోగాన్ని, పరీక్షించిన తర్వాత, నేను జీవించడం గొప్ప అద్భుతమని చెప్పారు. వారి వైద్యశాస్త్రం ప్రకారం నేను ఎప్పుడో మరణించి యుండవలసింది. నిజమే! అది మహాద్భుతమని నేను కూడా ఒప్పుకొంటాను. దేవుడు అద్భుతాలు చేయు దేవుడై యున్నాడు.

కమ్యూనిస్టు దేశాల్లోని రహస్య క్రైస్తవ సంఘం పక్షాన మీతో మాట్లాడానకు దేవుడు నన్ను బతికించి వుంచాడని నేను నమ్ముతున్నాను. విశ్వాసులైన మీ సోదరుల పక్షాన అభ్యర్థన చేయడానికీ, ఈ విషయాలు విశ్వాసుల దృష్టికి తేవడానికి దేవుడు నన్ను బ్రతుకనిచ్చి బయటికి రప్పించాడు.

# 5
# స్వల్ప స్వాతంత్ర్యం ఆపై మళ్ళీ నిర్బంధం

అది 1958 సంవత్సరం అప్పటికి నేను 8½ సంవత్స రాలుగా జైల్లో వుంటున్నాను నా బరువు చాలా తగ్గిపోయింది. శరీరమంతా వికారమైన మచ్చలు ఏర్పడ్డాయి. క్రూరమైన దెబ్బలు, తన్నులు సహించాను ఆకలి బాధ ననుభవించాను. భరో త్పాతం, అపహాస్యం పాలయ్యాను శతవిధ శ్రమలూ అనుభవించాను ఎన్ని విధాల వారు నన్ను శ్రమ పెట్టినా వారికి నేను ఆశాభంగాన్ని కలిగించాను తుదకు విసుగు జెంది నన్ను విడుదల చేశారు. అంతేగాక నా విడుదల కోసం అనేకులు ఆందో ళన చేయసాగారు.

ఒక వారంపాటు వారు నాపై అధికార జులుం సడ లించారు ఆ తర్వాత నన్ను పిలిచి,ఇకమీదట నేను బోధించ కూడ దని. ఏ విధమైన కార్యాల్లో పాలు పొందకూడదనీ ఆజ్ఞాపించారు. అందుకు "మా క్రైస్తవులకు ఎంతో సహనం అవసరం" అన్నాను. దానికి కమ్యూనిస్టులు "అంటే-వారు ఓపికపడితే అమెరికావారు వచ్చి వారిని విడిపిస్తారని అతని అభిప్రాయం కాబోలు" అంటూ కోపంతో అరచారు అంత మాత్రమే గాక రాను రాను పరిస్థితులు తప్పక మారిపోతాయని కూడా చెప్పాను. తిరిగి కమ్యూనిస్టు పోలీ సులు "అంటే నీ అభిప్రాయం కమ్యూనిస్టులు ఎప్పుడూ ఇక్కడ ప్రభుత్వం చేయరని నీ అభిప్రాయమా? ఇది కమ్యూనిస్టులకు

వ్యతిరేకంగా చేస్తున్నతప్పుడు ప్రచారం" అని కేకలు వేసారు. అంతటితో నా బహిరంగ సేవ అంతమొందింది.

నేను వారి ఆజ్ఞను ధిక్కరించలేక మళ్ళీ అజ్ఞాత సేవ చేయ భయపడతానని అధికారులు తలంచారేమో. వారు పూర్తిగా పొర బడ్డారు. నెమ్మదిగా నేను ముందు చేసిన అజ్ఞాత పరిచర్యలోకి ప్రవేశించాను. నా కుటుంబం నాకెంతో చేదోడువాదోడుగా వుంది. రహస్యంగా దాగియున్న విశ్వాసులకు సాక్ష్యమిచ్చాను. నేను పొందిన దెబ్బల మచ్చలు కూడ సాక్ష్యమివ్వసాగాయ్.నా స్తికత్వం లోని దౌష్ట్యాన్ని గూర్చి చెప్పుతూ అందరూ ధైర్యంగా దేవునిలో విశ్వాసముంచాలని చెప్పుతూ వచ్చాను. మా ప్రదేశమంతా సువా ర్తకు లుండేలా ఏర్పాటుచేసి రహస్యంగా సేవ జరిపించడానికి నాయకత్వం వహించాను ఈ పని జరుగుతున్న సమయంలో దేవుడే కమ్యూనిస్టుల్ని అంధుల్ని చేశాడు.

చివరికి రహస్య పోలీసులు నిఘావేసి నా అజ్ఞాత సేవను గూర్చి ఆచూకి తీసి నన్ను మళ్ళీ పట్టుకొని జైల్లో వేసారు.మొదట 8½ సంవత్సరాలు జైల్లో నున్నాను. తరువాత 3½ సంవత్సరాలు స్వేచ్ఛగా వున్నాను. మళ్ళీ ఇప్పుడు మరో 5½ సంవత్సరాలు జైలు పాలైపోయాను.

ఈ రెండవ దఫా జైలు జీవితం పూర్వం కంటె భయం కరంగా వుంది. జైల్లో ప్రవేశించిన అనతి కాలంలోనే నా శరీరం చాల క్షీణించింది. అయినా మా రహస్య సేవను చెఱసాలలో కూడా మానలేదు.

మేం బోధించడం మానలేదు, వారు కొట్టడం మానలేదు.

తోడి ఖైదీలకు మేం బోధించకూడదని శాసించారు. ఎవ రైనా అలా బోధిస్తే నిర్దాక్షిణ్యంగా దెబ్బలు తినాల్సివుంటుందని

వారు తెలియ జేశారు. అయినా నేను, మరి కొందరం ఎదురునిల్చి అట్టి శిక్షను సువార్త నిమిత్తం పొందడానికే తీర్మానించుకొన్నాం మేము బోధించాం. వారు మమ్మల్ని కొడుతూ వచ్చారు. బోధించి నందుకు మేం, కొట్టినందుకు వారు ఆనందించేవాళ్ళం.

ఈ క్రింది సంఘటనలు పదేపదే జరిగేవి. ఒక సోదరుడు ఓనాడు ఇతర ఖైదీలకు సువార్త నందిస్తున్నాడు. ఆకస్మాత్తుగా కావలి పోలీసు వచ్చి అతన్ని పట్టుకొని వెళ్ళి ఒక గదిలో వేసాడు. వారు క్రూరంగా దెబ్బలు కొడుతుంటే అతని శరీరం చిట్లి రక్తం కారుతోంది. అట్టి దుస్థితిలో అతన్ని లాక్కొచ్చి తన యథాస్థానం లోకి త్రోసివేసారు. అప్పుడతడు ఎంతో కష్టంతో లేచి నిలిచి తన వస్త్రాల్ని సరిచేసుకొని "సోదరులారా, ఇంతాక నా ప్రసంగాన్ని ఎక్కడ ఆపాను?" అని అడిగి మళ్ళీ తన సువార్త ప్రసంగాన్ని కొనసాగించాడు!

నేను చాలా మంచి సంగతుల్ని చూచాను! కొన్ని పర్యాయాలు సాధారణ క్రైస్తవులే బోధకులుగా వ్యవహరించేవారు. ఇట్టి వారు పరిశుద్ధాత్మ ద్వార ప్రేరేపణనొంది బహు దివ్యంగా బోధించేవారు, హృదయ పూర్వకంగా బోధించేవారు. ఎందుకంటే అప్పటి పరిస్థితుల్లో సువార్తను బోధించడం సామాన్యమైన సంగతి కాదు అలా బోధిస్తున్న సమయంలో కావలివారు వచ్చి పట్టుకొని వెళ్ళి చావు దెబ్బలు కొట్టేవారు.

ఒక జైల్లో ఫ్రేక్ అనే క్రైస్తవున్ని దెబ్బలు కొట్టి చంపాలని అధికారుల ఆదేశం. ఇట్టి శిక్షను కొన్ని వారాలపాటు జరుగనిచ్చేవారు. మొదట ఒక గట్టి రబ్బర్ ముక్కతో ఆయన అరికాళ్ళను వారు మెల్లగా కొట్టనారంభించారు. కొట్టి విడిచారు. కొన్ని

నిమిషాలైన తర్వాత మరల కొట్టి విడిచారు. అలా మరి కొన్ని నిమిషాలైన తర్వాత కొట్టారు. అతని బీర్జముల మీద కూడ కొట్టారు తరువాత అతడు చనిపోతూ తుండగా డాక్టరు ఆయనకు ఒక ఇంజె క్షను ఇచ్చాడు. అతడు కొంత నిమ్మళించిన తర్వాత మంచి బల మైన ఆహారాన్ని యిచ్చారు కొంత బలం పొందగానే అతడు మరణించేవరకు మళ్ళీ గట్టిగా దెబ్బలు కొట్టారు. ఈ ఘోర కృత్యా న్నంతటికీ కారకుడు రెక్. అతడు కేంద్ర కమ్యూనిస్టు సభలో సభ్యుడు

కమ్యూనిస్టులు క్రైస్తవులతో చెబుతూ వచ్చిన విధంగానే రెక్ కూడా ఈలా చెప్పేవాడు— "నేను దేవుడనని మీరు తెలిసి కోవాలి మీ జీవన్మరణాల మీద నాకు అధికారం వుంది. పరలో కంలో నున్నవాడు నిన్ను బతికించలేడు. అంతా నామీదే ఆధార పడి వుంది నాకు ఇష్టమైతే నీవు బతుకుతావు లేకుంటే చనిపోతావు నేనే దేవుడను "ఈలా అతడు క్రైస్తవుల్ని ఎగతాళి చేసేవాడు.

సోదరుడు గేకు, ఇట్టి ఘోర సందర్భంలో ఈ రెక్ కి మంచి జవాబు నిచ్చాడు. "నీవు ఎంత భావగర్భితంగా మాట్లాడి నావో నీవు ఎరుగవు నిజంగా నీవు ఒక దేవుడవు. వాస్తవంగా చూస్తే ప్రతి గొంగళి పురుగులో ఒక సీతాకోక చిలుక ఉంది ఒక హింసకునిగా నువ్వు సృష్టింపబడలేదు. దేవుడంతటివాడవు కావాలని నీవు సృష్టింప బడ్డావు యూదులతో ఆయన ఇలా అన్నాడు.'మీరు దైవములై యున్నారు'. దేవుని జీవం నీ హృదయంలోకి వస్తుంది. సీలాంటి అనేక దూషకులు, అపొస్తలుడైన పౌలు వంటివారు, ఒకప్పుడు ఇతరుల్ని హింసించడం లజ్జాకరమైన సంగతిగా గుర్తించి, హింసించడం మాని మేలుచేయడం శ్రేయస్కరమని తెలిసికున్నారు ఆ విధంగా వారు దైవస్వభావంలో పాలి భాగస్తులై

నారు. రెక్‌గారూ, మీరు దేవునిలా వుండాలనే నియమితమైనారు గాని హింసకునిగా యుండడానికి కాదు."

స్తెఫను హింసిస్తున్న సమయంలో తార్సీయుడైన సౌలు దగ్గర లోనే వుండి లా లక్ష్యపెట్టలేదో అలాగే రెక్ కూడ ఆ సమయంలో లక్ష్యపెట్టలేదు. అయితే ఆ మాటలు అతని హృదయంలో పని చేసాయి క్రమేపీ రెక్ ఆన అసలు పిలుపును గుర్తించు కొన్నాడు

కమ్యూనిస్టులు కొట్టిన దెబ్బలు. పెట్టిన హింసలు. ఘోర కృత్యాల ద్వార ఒక పాఠం నేర్చుకోగల్గాం. అదేమంటే శరీరం కంటె ఆత్మ బలమైనదని గుర్తించాం. అనేక పర్యాయాలు మేం హింసించబడ్డప్పుడు బాధ ననుభవించాం. గాని క్రీస్తు మహిమా సన్నిధి మాతో నున్నందున ఆట్టి హింస మాకు దూరంగా నున్న అనుభూతి కల్గింది.

మాకు వారానికో రొట్టెముక్కు, రోజూ యింతో అంతో పులుసు యిచ్చేవారు. ఆ భోజనంలోనుండి క్రమంగా మా దశమ భాగాన్ని తీయాలని నిశ్చయించుకొన్నాం తొమ్మిది వారాలయ్యాక పదో వారాన రొట్టె ముక్కలు తీసికొని బాగా బలహీనంగావున్న సోదరులకు ప్రభువు నామాన్న ఇచ్చేవారం.

ఒక విశ్వాసికి మరణశిక్ష విధించబడింది. ఉరి తీసేముందు తన భార్యను చూడ్డానికి సెలవిచ్చారు. అతడు తన భార్యతో చెప్పిన చివరి మాటలు "నన్ను చంపుతున్నవారిని నేను ప్రేమిస్తున్నానని నీవు తెలిసికోవాలి వారేమి చేస్తున్నారో వారికితెలియదు కనుక నా చివరి కోరిక ఏమంటే నీవుకూడ వారిని ప్రేమించాలి. నీ పియుని చంపివేసారని వారిని ఏమాత్రం ద్వేషించకు. మనం మళ్ళీ పరలోకంలో కలిసికొంటాం."

వీరిద్దరి మధ్యలో జరిగిన ఈ సంభాషణ వినిన రహస్య పోలీసు ఆఫీసరు హృదయంలో ఎంతో నొచ్చుకున్నాడు. తద్వారా అతడు కూడా ప్రభువు నంగీకరించాడు. అందుకోసం ఆయన్ను కూడ జైల్లో వేసినప్పుడు ఆయన నాకీ సంగతి చెప్పాడు.

వేరొక జైల్లో మాచేవీచి అనే యువకున్ని వేసారు. అతడు తన 18వ ఏట జైల్లో పడ్డాడు. చిత్రహింసలవల్ల అతనికి క్షయ రోగం కూడా అంటుకొంది. ఏదో విధంగా అతని తల్లిదండ్రులు అతని దుస్థితిని తెలిసికొని, అతడు త్వరితంగా కోలుకోవాలని మంచి మందు వందబుడ్లు పంపించారు. ఆ మందు తీసుకొంటే అతనికి మరణం తప్పుతుంది. జైలు అధికారి అతన్ని పిలిచి, వచ్చిన మందు చూపించి యిలా అన్నాడు—"నీ ప్రాణాన్ని రక్షించడానికి ఇక్కడ మంచి మందు వుంది. అయితే నీకిలా నీ కుటుంబంనుండి పార్సల్‌ను రానివ్వకూడదు అయినా నీకు సాయం చేయాలని కోరుతున్నాను. నువ్వు యువకుడవు. నీవు యిలా జైల్లో చనిపోవడం నా కిష్టంలేదు. అందుకు చిన్న ఏర్పాటు చేసికొందాం. నువ్వు నాకు సహాయం చేస్తే నేను నీకు సహాయం చేస్తాను. నీతోడి ఖైదీలంతా చేసే పనులన్నీ ఎప్పటికప్పుడు నాకు తెలియ జేస్తూండాలి అప్పుడు నీకీ మందు ఇవ్వగలను."

ఆ యువకుడు వెంటనే యిలా ప్రత్యుత్తర మిచ్చాడు "నేను ద్రోహినై బ్రతికేకంటె చావే మేలని భావిస్తున్నాను. ఈ నీ షర తును అంగీకరించలేను."అప్పుడు ఆ ఆఫీసరు అతన్ని మెచ్చుకొని "సరే నీవీలాగే జవాబిస్తావని నాకు ముందే తెలుసు. గాని మరొ సంగతి ఈ ఖైదీల్లో కొందరు కమ్యూనిస్టులు కలిసారు. వారు నీపై ఎన్నో నేరాలు చెప్పుతున్నారు. వారు రెండు ముఖాలతో

వ్యవహరిస్తున్నారు. వారిని మేం నమ్మలేం. నీకు ద్రోహం చేస్తూ నీ విషయాలన్నీ మాకు చెప్పేస్తున్నారు. అందువల్ల నీవు వారిని ఒకకంట కనిపెడుతూ వారి సమాచారాన్నంతటినీ మాకు చెప్పితే నీ ప్రాణాన్ని దక్కించుకొంటావ్" అన్నాడు.

మాచేవీచి—"నేను క్రీస్తు శిష్యుడను. మా శత్రువుల్ని కూడ ప్రేమించాలనేది మా గురుబోధ. మాకు వారు ఎంతో కీడు చేస్తే చేయవచ్చు. గాని నేను మా తం కీడుకు ప్రతికీడు చేయలేను. వారిని ద్వేషించలేను. ఏదోషాన్ని వారిమీద మోపనుకూడ. వారిమీద జాలిపడుతున్నాను. వాళ్ళకోసం ప్రార్థిస్తున్నాను. కమ్యూనిస్టులతో నాకే సంబంధం లేదు" అని జవాబిచ్చాడు.

అతడు యిలా ధైర్యంగా జైలు అధికారితో మాట్లాడిన కొంత కాలానికే నేనున్న గదిలోనే చనిపోయాడు. అతడు దేవుని స్తుతిస్తూ చనిపోవడం నేను చూచాను.

నేను అనేక సంవత్సరాలు జైల్లో వున్నందుకు బాగా కృంగిపోయాను, గాని నేను యిలాంటి దివ్యమైన సంగతులను అనేకం చూచాను. జైల్లోవున్న అలు ల్లో నేనొకడిని. గాని, అక్కడ అనేక భక్తుల విశ్వాస వీరుల సావాస భాగ్యం నాకు లభించింది. వారు మొదటి శతాబ్దంలోని క్రైస్తవులకు ఏ విధంగానూతీసిపోరు. క్రీస్తుకోసం మరణించడానికి వారు సంతోషంగా ముందుకు సాగారు. అప్పుడు ఈ విశ్వాస వీరుల ముఖాల్లో తొణికిసలాడే పరలోక సౌందర్యం వర్ణనాతీతం మా అజ్ఞాత క్రైస్తవ సంఘానికి అస్వాభావికాలు స్వభావికాలై పోయాయి.

నేను ఖైదులోకి రాకముందు క్రీస్తును గాఢంగా ప్రేమించాను అక్కడ ఆయన ఆత్మదేహంలోని అవయవాలైన భక్తుల్ని చూచాక

క్రీస్తు నెలా ప్రేమిస్తున్నానో అలాగే రహస్య సంఘాన్ని కూడ ప్రేమించసాగాను.

## నా భార్య, నా కుమారుని దయనీయ గాధ

నేను నా భార్యా వేరై పోయాం. ఆమె యోగ క్షేమాలు నాకేమీ తెలియలేదు. కొన్ని సంవత్సరాలయ్యాక ఆమెను కూడా పట్టుకొని జైల్లో వేశారు. పురుషులకంటే క్రైస్తవ స్త్రీలు జైలసాల్లో ఘోరంగా హింస పొందేవారు.

కిరాతకులైన జైలు కాపలాదార్లు ఆడపిల్లలు కనబడితే చాలు చెరిపేసేవారు. హేళనలు, అసహ్య కార్యాలు వర్ణనాతీతాలు. కాలువ త్రవ్వే పనికి స్త్రీలను పంపేవారు. ఆ పని ఎంతో కష్టమైన దైనా పురుషుల్లాగే స్త్రీలు పని చేయాల్సి వచ్చేది విశ్వాసురాండ్రను బాధించడానికి. వారిని అజమాయిషీ చేయడానకు వేశ్యలు నియమితులయ్యారు. ప్రాణాల్ని నిలుపబెట్టుకోడానికి నా భార్య పశువులా గడ్డి తినాల్సివచ్చింది. ఆకలి బాధతో నున్న ఖైదీలు పాముల్ని, తిన్నారు ఆదివారాల్లో కావలివారు స్త్రీ ఖైదీలను నదిలో త్రోసివేస్తూ మళ్ళీ బయటికి లాగి త్రోసేస్తూ ఆనందంగా నవ్వుతూ గడిపేవారు. స్త్రీలు నదిలోనుండి తడిసిన వస్త్రాలతో బయటికి వస్తుంటే వారిని చూచి గేలిచేసేవారు వారు నా భార్యను కూడ ఇలా బాధ పెట్టారు.

తల్లిదండ్రులు లేని అనాధగా మా అబ్బాయి వీధుల్లో తిరుగుతున్నాడు. మిహాయి బాల్యంనుండీ దైవసంబంధమైన విషయాల్లో బహు ఆశ గలవాడు. తొమ్మిదవ యేటనే పెద్దలకుండాల్సిన బాధ్యత ఆయన మీద పడింది. ఎన్నో శ్రమలకు గురయ్యేపోయాడు. తన పోషణకు తానే బాధపడాల్సి వచ్చింది. ఈ ఒత్తిడివల్ల అతడు క్రైస్తవత్వాన్ని సందేహించే స్థితికి దిగిపోయాడు. మా

కుమారునికి సహాయం చేస్తూన్న ఇద్దరు సోదరీలను పోలీసులు పట్టుకొని బహిరంగంగా దెబ్బలు కొట్టారు. తత్ఫలితంగా యిప్పటికి 15 సంవత్సరాల నుండి వారు అవిటివారుగా జీవిస్తున్నారు. ఒక స్త్రీ మిహాయిని ఇంటిలో చేర్చుకొన్నందుకు ఆమెకు 8 సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. దెబ్బలకు ఆమె పండ్లు రాలిపోయాయి ఎముకలు విరిగిపోయాయి. ఇప్పుడు ఏ పనీ చేయలేక కుంటిదై పడివుంది.

## "మిహాయీ, యేసునందు విశ్వాసముంచు"

మిహాయి పదకొండవ ఏటనే తన పోషణకోసం శ్రమించి పనిచేయాల్సి వచ్చింది. శ్రమలవల్ల అతని విశ్వాసం బలహీనమైపోయింది. ఇప్పటికి నా భార్య రెండు సంవత్సరాలు జైలు జీవితాన్ని గడిపింది తన కుమారుని చూడ్డానికి ఆమెకు తరుణం దొరికింది. అతడు కమ్యూనిస్టు జైలుకు వెళ్ళి ఇనుప కడ్డీల చాటున బంధించబడి వున్న తల్లిని చూచాడు. ఆమె మురికిగాను బలహీనంగానూ వుంది. ఆమెను గుర్తు పట్టడం అతనికి కష్టమైంది. తన కుమారుని చూడగానే "మిహాయీ, యేసునందు విశ్వాసముంచు" అని అరచింది వెంటనే కావలి సిపాయిలు ఆమెను కోపంతో లాగి తీసుకువెళ్ళారు. తల్లిని ఆ ప్రకారం వారు లాక్కొనిపోవడం మిహాయి చూచి ఏడ్చాడు. ఆ నిమిషంలోనే అతడు రక్షింపబడ్డాడు అటువంటి పరిస్థితుల్లో కూడ క్రీస్తును ప్రేమించగలిగితే, నిజంగా ఆయన రక్షకుడై యుంటాడని అతడు నిశ్చయించుకొన్నాడు. తరువాత అతడు ఈలాగన్నాడు "క్రైస్తవ్యం శంకించడానికి, వాదోపవాదాలకు అతీతమైంది. నా తల్లి దానిలో

విశ్వాసముంచడం సహేతుకం నాకంతే చాలు." ఆ దినమే ఆయన క్రీస్తును సంపూర్ణంగా అంగీకరించాడు.

పాఠశాలలో కూడ అనేక బాధలకు గురియైనాడు. వాడు ఆదర్శ విద్యార్థి గనుక అతనికి పాఠశాల బహుమానంగా ఒక ఎఱ్ఱని "టై" ఇచ్చింది అది కమ్యూనిస్టు యువ సమాజంలోని సభ్యత్వానికి గుర్తు నా కుమారుడు "నా తల్లిదండ్రుల్ని జైల్లో వేసిన వారి గుర్తు నేను ఎన్నడు ధరించను" అన్నాడు అందుకు బడినుండి వెళ్ళగొట్టబడ్డాడు. ఒక సంవత్సరమైన తర్వాత తిరిగి బడిలో ప్రవేశించాడు. కాని తానొక ఖైదీ కుమారుగన్న సంగతిని ఎవరికీ చెప్పలేదు.

ఈలా వుండగా, ఒక పర్యాయం బైబిలుకు విరుద్ధంగా స్కూల్లో ఒక వ్యాసరచన చేయాల్సి వచ్చింది తన వ్యాసాన్ని యిలా వ్రాసి యిచ్చాడు. "బైబిలు వ్యతిరేక వాదాలు నిరాధారాలు, సిద్ధాంతాలు సరిగా చెప్పాలంటే మా టీచరు సరిగా చదవలేదు. బైబిలు విజ్ఞానానికి విరోధం ఎంతమాత్రం కాదు." అని వ్రాసాడు.

ఈసారి కూడ వాడిని స్కూలు నుండి వెళ్ళగొట్టారు. ఈ సారి రెండు సంవత్సరాలు నష్టమై పోయాయి. తుదకు వారు క్రైస్తవ వేదాంత పాఠశాలలో చదువటానికి ఒక తరుణమిచ్చారు. అక్కడివారు ఆయనకు "మార్క్స్" వేదాంతాన్ని నేర్పించారు. అక్కడ క్రైస్తవ్య, కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాలకు అనుగుణంగా అధ్యయనం చేస్తున్నారు. దీన్ని మిహాయ్ బహిరంగంగా ప్రతిఘటించాడు. తనతో చదువుతున్న ఇతర విద్యార్థులు కూడ సహాక

రించారు. దీని ఫలితంగా మళ్ళీ వాడిని స్కూలు నుండి వెళ్ళ గొట్టారు. అందువల్ల వేదాంత విద్యను ముగించలేక పోయాడు.

ఒక పర్యాయం ఒక ఉపాధ్యాయుడు నా శిక్షత్వాన్ని బోధి స్తుండగా, నా కుమారుడు లేచి అతన్ని ఖండించాడు. తన దుర్బో ధతో అనేక విద్యార్థుల్ని మోసగించడం ధర్మం కాదని ఎదిరిం చాడు. క్లాసులోని విద్యార్థులందరు మిహాయీతో ఏకీభవించారు. విద్యార్జనకుగాను తాను వుర్మబ్రాండ్ కుమారుడన్న సంగతిని ఎప్పుడూ దాచిపెట్టాల్సి వచ్చేది అయితే ప్రతీ సారి ఇది బయటికి రావడంవల్ల అతను పాఠశాల నుండి వెళ్ళగొట్టబడుతుండేవాడు.

మిహాయీ ఆకలి బాధ బహుగా ననుభవించినాడు. జైల్లోని ఖైదీల కుటుంబాలన్నీ కమ్యూనిస్టుదేశాల భయంకర ఆకలి బాధను ఎప్పుడూ అనుభవించాల్సిందే. ఎందుకంటే వీరికి సహాయం చేయడం ప్రజలు గొప్ప నేరంగా భావిస్తారు.

# 6
# విడుదల

నేను 14 సంవత్సరాలు జైలు జీవితం గడిపాను. ఈ దీర్ఘకాలంలో నేనెప్పుడూ ఒక బైబిలును గాని ఇతర పుస్తకాన్ని గాని చూడలేదు. వ్రాసే అలవాటే తప్పిపోయింది ఆకలి బాధవల్ల శ్రమలవల్ల పరిశుద్ధ లేఖనాల్ని చాలమట్టుకు మరచిపోయాను. అయితే పదునాలుగవ సంవత్సరాంతం నాడు ఒక విచిత్ర సంఘటన నాకు గుర్తు వచ్చింది. రాహేలు కోసం యాకోబు పదునాలుగు సంవత్సరాలు సేవ చేసాడు. అయినా ఆమె మీది ప్రేమచేత అది అతనికి కొద్ది సమయంగానే కన్పించింది.

కొద్ది కాలంలోనే నాకు విడుదల దొరికింది. నా భార్యను చూడ గలిగాను. ఆమె నా కోసం పదునాలుగు సంవత్సరాలు నమ్మకంగా ఎదురు చూస్తూ ఉంది. అతి పేదరికంలో మా సంసార జీవితాన్ని తిరిగి ప్రారంభించాము. ఎందుకంటె మేం పట్టబడిన తరువాత మాకున్నదంతా పోయింది.

విడుదల పొందిన మతగురువులకు పరిచర్య కొరకై చిన్న సంఘాలివ్వడం వాడుక. బర్సోవా పట్టణంలోని ఒక సంఘం నాకివ్వబడింది. ఆ సంఘంలో ముప్పది ఐదుగురు సభ్యులున్నట్లును. ఆ సంఖ్య ముప్పది ఆరుగురుకు ఎట్టి పరిస్థితుల్లోనూ పెరగకూడదని కమ్యూనిస్టు అధికారులు నన్ను హెచ్చరించారు అంతేగాక నేను పోలీసుల పక్షంగా నుంటూ ప్రతి సభ్యుని స్థితిగతుల్ని వారికి ఎప్పటికప్పుడు తెల్పుతూ వుండాలనీ, యౌవనస్థుల్ని

ఎప్పుడూ సంఘంలో చేరకూడదనీ వారు ఖండితంగా ఆజ్ఞాపించారు. ఈ విధంగా కమ్యూనిస్టులు సంఘాల్ని కట్టుబాటులో వుంచేవారు.

నేను బోధిస్తే అనేకులు గుమికూడుతారని నాకు తెలుసు. అందువల్ల బహిరంగ సంఘంలో నేను సేవ చేయక, రహస్య సంఘాల్లోనే తిరిగి సేవ చేయ మొదలు పెట్టాను. నేను ఖైదీగా నున్న కాలంలో రహస్య సంఘ పక్షంగా దేవుడు అద్భుతాలు జరిగించాడు. మా అజ్ఞాత సంఘాల్ని మరువక అనేక అమెరికను క్రైస్తవులు, ఇతర దేశాల విశ్వాసులు మా కోసం ప్రార్థించడం, సహాయం చేయడం ప్రారంభించారు.

ఒక మధ్యాహ్నం నేనొక సహోదరుని ఇంటిలో విశ్రాంతి తీసుకొంటుండగా ఆయన నన్ను లేపి "విదేశాలనుండి సహోదరులు వచ్చారు" అన్నాడు. పశ్చిమ దేశాల్లోని భక్తులు మమ్మను మరచి పోలేదు. శ్రమల్లోనున్న విశ్వాసులకు వారు చేయవలసిన సహాయమంతా బహు జాగ్రత్తగా జేసారు. ప్రక్క గదిలో ఆరుగురు విదేశీయులున్నారు. నాతో అనేక సంగతులు మాట్లాడారు. తర్వాత "ఇక్కడ పదునాలుగు సంవత్సరాలనుండి జైల్లోనున్న వ్యక్తిని చూడాల"న్నారు. అప్పుడు నేనే ఆ వ్యక్తినని చెప్పాను. "ఆ వ్యక్తి ఎంతో విచారంగా యుంటాడని మేమనుకొన్నాం. అయితే నీవు సంతోషంగా నుండడం చూచి నమ్మలేక పోతున్నామ"ని వారన్నారు. మరోసారి నేనే ఆ వ్యక్తినని ఒప్పించి వారి కలయిక ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పాను.

అప్పటి నుండి రహస్య సంఘానికి క్రమంగా సహాయం వస్తుండేది. రహస్య విధానాలద్వారా అనేక బైబిళ్ళు, కరపత్రాలు,

విశ్వాస వీరుల కుటుంబాల పోషణ సాధ్యమయ్యాయి. అట్టి సహాయంవల్ల రహస్య సంఘం మరి ఎక్కువ సేవచేయ గలిగింది. ఇతర దేశాల్లోని విశ్వాసులు దేవుని వాక్యాన్ని మాకు పంపించడం మాత్రమే కాక మమ్మును ఎంతో ప్రేమించేవారు. అది మాకు ఎంతో ఆదరణను కలిగించేది.

మమ్మును ప్రేమిస్తున్నవారు ఎవరునూ, ఎక్కడనూ లేరని, కమ్యూనిస్టులు మాకు చెప్పుతూ వచ్చారు. అయితే ఇప్పుడు బయటి దేశాలవారు అనేకులు మమల్ని ప్రేమిస్తూ మా కోసం తమ ప్రాణాల్ని సహా పెట్టాడానికి సిద్ధంగా మున్నారని గ్రహించాము

బయటి దేశాల క్రైస్తవుల నుండి ఆర్థికసహాయం రాకుంటే నేను నా కుటుంబం ఎప్పుడో చనిపోయివుందుము. మేమే కాదు అందరి పాస్టర్ల విశ్వాస వీరుల పరిస్థితి కూడా అంతే బయటివారు మాకు చేసిన ఉపకారము ఇంతా అంతోయని చెప్పలేం. మా కోసం దేవుడు పంపిన దూతలు వారు.

నేను రహస్య సంఘ సేవను పునః ప్రారంభం చేయడం వల్ల మళ్ళీ అపాయాల్లో చిక్కుకొంటిని ఇట్టి సమయాల్లో విదేశీ మిషనులు రెండు నా విడుదల కోసం రు. 45,000లు చెల్లించారు. ఈలా నేను రుమానియాను విడువ గలిగినాను.

## నేను కమ్యూనిస్టు రుమానియా విడిచిన కారణము

మా దేశ రహస్య సంఘ ప్రేరేపణనుబట్టి నేను రుమానియాను విడిచి స్వతంత్ర దేశాలలో మా అనుభవాల్ని చెప్పడానికి బయలు దేరాను. మా సంఘ నాయకులు నన్ను బలవంతం చేయకపోతే నేను రుమానియాను విడిచి వెళ్లేవాడనుకానూ. మా దేశంలోని

విశ్వాసుల శ్రమల్ని గూర్చి వారి అవసరాల్ని గూర్చి నేను చెప్పాలని వారు కోరారు. నేను ఇప్పుడు పశ్చిమ దేశాలలోనున్నా నా హృదయం నా దేశీయ విశ్వాసులతోనే వుంది.

నేను రూమేనియాను విడువక ముందు రహస్య పోలీసులు రెండు పర్యాయాలు నన్ను పిలిపించి నా కోసం డబ్బు వచ్చిందని చెప్పారు. రుమానియా తన పౌరుల్ని ద్రవ్యానికి అమ్మివేస్తోంది. కమ్యూనిజం తెచ్చిన ఆర్థిక సమస్యను ఎదుర్కొడానికి ఈలా చేయడం తప్పనిసరి అయ్యింది. వారు "నీవు పశ్చిమ దేశాలకు వెళ్ళు. క్రీస్తును గూర్చి నీ ఇష్టప్రకారం బోధించు గాని మా విష యాలు ఏ మాత్రం మాట్లాడ కూడదు. తెలుసా? ఒకవేళ ఇక్కడి విషయాల్ని నువ్వు అక్కడ చెప్పినట్లు మాకు తెలిస్తే చాలు, తొమ్మిది లేక పదివేల రూపాయలకైనా కర్చుచేసి గూండాలచేత నిన్ను చంపించివేస్తాం. లేదా, నిన్ను బలత్కారంగా ఎత్తుకొని తెచ్చి మాకు అప్పగిస్తారు. లేదా, నిన్నుగూర్చి అబద్ధాలు ప్రచారం చేసి పాడుచేయిస్తాం." అని చెప్పారు

ఈలా బెదిరించాక దేశాలకు వెళ్ళడానికి సెలవిచ్చారు. నిర్భయంగా కమ్యూనిస్టులవల్ల ఎంతో శ్రమ అనుభవించి పశ్చిమ దేశాల్లో తలదాచుకుంటున్న వారెందరో వున్నారు గాని వారు మౌనంగా ఉన్నారు. మరి కొందరు ఆ సిద్ధాంతమే మంచిదంటారు. నేను కూడా అలాగే యుంటానని పోలీసులు తలంచారు. ఆ విధంగా 1965వ సంవత్సరము డిశంబరు నెలలో నేను నా భార్య రుమానియాను విడువగల్గాము.

నేను నా దేశాన్ని విడువకముందు - నా చెరసాల జీవిత కాలంలో ఏ మిలిటరీ అఫీసరు నా బహువిధ శ్రమలకు కారకుడై

నాడో ఆ ఆఫీసరు సమాధి దగ్గరకు వెళ్ళి దానిమీద ఒక పూల దండను వేశాను. ఇలా చేయడం ద్వారా క్రీస్తులోని ఆనందాన్ని కమ్యూనిస్టులకు అందించడానికి నన్ను నేను క్రీస్తుకు పునః ప్రతిష్ఠించుకొన్నాను.

కమ్యూనిస్టు విధానాన్ని నేనసహ్యించుకొంటున్నా నేను ప్రజలను ప్రేమిస్తున్నాను. నేను పాపాన్ని అసహ్యించుకొంటు న్నాను, గాని పాపిని ప్రేమిస్తున్నాను. నేను కమ్యూనిస్టుల్ని నా హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను, కమ్యూనిస్టులు క్రైస్త వుల్ని చంపగలరు కాని వారి మీద విశ్వాసులకున్న ప్రేమను చంపలేరు. నా హింసకుల మీద గాని ఇతర కమ్యూనిస్టుల మీద గాని నాకే ద్వేషములేదు.

# 7

# కమ్యూనిస్టుల్ని కూడా ప్రేమించాలి

యూదులలో ఒక కల్పిత కథ వుంది. ఇశ్రాయేలీయుల పితరులు ఐగుప్తు విమోచనానంతరం ఐగుప్తీయులు ఎర్ర సముద్రంలో మునిగిపోయారు ఆ సమయంలో ఇశ్రాయేలీయులు చేసిన ఉత్సాహగానంతో దేవదూతలు కూడ ఏకీభవించారట. అప్పుడు దేవుడు దూతలతో యిలా అన్నాడు "వారు యూదులు గనుక తమ విమోచనను బట్టి ఆనందిస్తున్నారు. అయితే మీరు వారికంటె ఎక్కువ జ్ఞానం గలవారు కావాలి. ఐగుప్తీయులు నా చేతి సృష్టి కారా? నేను వారిని ప్రేమిస్తున్నాను గదా? వారి దుర్మరణము నాకు బాధ కలిగిస్తున్నదని గ్రహించలేకున్నారా?"

పూర్వము యెహోషువ యెరికో ప్రాంతంలోవున్నప్పుడు అతడు కన్నులెత్తి చూడగా దూసిన కత్తిచేత పట్టుకొని యున్న ఒక దేవదూత అతని యెదుట నిలిచివుంది. యెహోషువ ఆయనతో "నీవు మా పక్షంగా నున్నవాడివా లేక మా విరోధుల పక్షంగా నున్నవాడవా?" అని అడుగగా ఆయన "కాదు" అన్నాడు. (యెహోషువ 5:13-15). గ్రహించుటకు ఇది కష్టముగా నున్నది. మానవులు చెప్పరు. గాని ఈ దేవదూత పరలోకాన్నుండి వచ్చిన వాడు. పరలోకంలో ఉన్నవారు సమస్తాన్ని గ్రహిస్తున్నారు కాబట్టి పక్షపాతము లేకుండా అందరినీ కనికరిస్తున్నారు

ఈ లోకంలో వున్న మనం కమ్యూనిజాన్ని తప్పక ఎదిరించాలి. అది దౌర్జన్యాలకు, చిత్రహింసలకు ప్రతీతి. అయితే క్రైస్తవులు సామాన్యులు కారు. వారు దేవుని పిల్లలు. కావున కమ్యూనిస్టు జైళ్ళలో అనుభవించిన హింసలు కమ్యూనిస్టుల్ని ద్వేషించడానికి దారి చూపలేదు. వారు దేవుని సృష్టి. నేనెలా వారిని అసహ్యించుకోగలను? అలాగని నేను వారితో స్నేహమూ చేయలేను. స్నేహానికి హృదయాన బంధం కావాలి. కమ్యూనిస్టులతో నాకా ఐకమత్యం లేదు. కారణం దేవుడంటే వారు అసహ్యించుకొంటారు. అయితే నేను దేవుని ప్రేమిస్తున్నాను.

"నీవు కమ్యూనిస్టుల పక్షంగా నున్నవాడవా లేక వారికి విరోధంగా నున్నవాడవా?" యని ప్రశ్నిస్తే నా జవాబుకు కొంచెం తికమక పడాలి. అయితే నేను క్రీస్తులో నున్నవాడను. అంచేత కమ్యూనిస్టులు భయంకర దోషాలు చేసినవారైనా వారిని ప్రేమిస్తు వారు క్రీస్తు యొద్దకు వచ్చి రక్షింపబడాలని కోరుతున్నాన్ను. కమ్యూనిజం మానవజాతికి ప్రమాదాన్ని తెచ్చే భయంకర సిద్ధాంతం నేను దానికి ప్రతికూలం. అది అంతరించిపోయేదాకా నా పోరాటాన్ని వదలను.

నా క్రీస్తుప్రభువు కమ్యూనిస్టుల్ని ప్రేమిస్తున్నాడు. ప్రతి వ్యక్తిని ప్రేమిస్తున్నానని ఆయనే చెప్పాడు. తొంబది తొమ్మిది గొఱ్ఱెల్ని విడిచి తప్పిపోయిన ఒక దాన్ని వెదకడానికి వెళ్ళమని చెప్పాడు. ఆయన అపోస్తలులు, క్రైస్తవ బోధకులంతా ఇట్టి సార్వత్రిక ప్రేమనుగూర్చే బోధించారు. భక్తుడైన మెకారీ ఈలాగన్నాడు— "ఒక మనుష్యుడు మానవులందర్నీ ప్రేమించి ఒకన్ని మాత్రం ప్రేమించనంటే ఆ విషయంలో అతడు క్రైస్తవుడు కాడు." భక్తుడైన అగస్టీన్ ఇలా అన్నాడు— "ఒకవేళ మానవ

జాతి అంతా నీతిగలదై యుండీ ఒక్క మనుష్యుడు మాత్రమే పాపాత్ముడై యున్నా ఆ ఒక్కని కోసమైనా క్రీస్తు సిలువ శ్రమలు భరించియుండును." క్రైస్తవ బోధ తేటగా వుంది. కమ్యూనిస్టులు కూడ మానవులే. కనుక క్రీస్తు వారిని కూడా ప్రేమిస్తున్నాడు. అలాగే క్రీస్తు మనస్సు గల్గిన ప్రతి వారూ ప్రేమిస్తున్నారు. మనం పాపాన్ని ద్వేషించినప్పటికీ పాపిని ప్రేమిస్తున్నాం.

కమ్యూనిస్టుల పట్ల మనకున్న ప్రేమనుబట్టి క్రీస్తుకు వారి పట్ల యున్న ప్రేమను తెలిసికోగలుగుతున్నాం.

జైళ్ళలో నున్న క్రైస్తవులు కాళ్ళకు 50 పౌన్ల ఇనుప గొలుసులు వేసి, ఎర్రగా కాలిన ఇనుప కడ్డీలతో కమ్యూనిస్టులు వారిని గాల్చుతూ, గొంతులో ఉప్పు వేసి గుచ్చి నీళ్ళు పోయకుండా అలాగే వుంచడం నేను కళ్ళారా చూచాను. ఆకలి బాధ చేతను, కొరడా దెబ్బల చేతను, భయంకరమైన చలిచేతను బాధింపబడుతూ కూడ కమ్యూనిస్టుల కోసం ప్రార్థించడం కూడ నేను చూచాను. మానవమాత్రులకు అది అసాధ్యం. మన హృదయాల్లో క్రుమ్మరించబడింది క్రీస్తు ప్రేమ

కొంత కాలానికి మమ్మును హింసించినవారిలో కొందరు జైలు పాలయ్యారు. కమ్యూనిస్టు దేశాల్లో వారు తమ శత్రువుల్ని పట్టి ఎలా ఖైదులో వేస్తారో, అలాగే కమ్యూనిస్టుల్ని కమ్యూనిస్టు అధికారుల్ని కూడ జైల్లో వేసారు. ఇదివరకు హింసించినవారూ హింస నొందినవారూ అంతా ఇప్పుడు ఒకే గదిలో వున్నారు. క్రైస్తవేతరులు వారిని ద్వేషించి కొట్టారు. గాని క్రైస్తవులు వారిని ప్రేమించి కాపాడారు. విశ్వాసులు తమకు దొరికే కొంచెము

రొట్టెముక్క. మందులు సహితం వారు పుచ్చుకోక తమ్మును ఇది వరకు హింసించిన కమ్యూనిస్టులకు అందించడం నేను చూచాను.

క్రైస్తవ ప్రధాన మంత్రి యూలియు మానియు తాను కమ్యూనిస్టు జైల్లో మరణించక ముందు ఈలా పలికాడు– "ఒక వేళ మన దేశంలో కమ్యూనిస్టులు ఓడిపోయే పక్షంలో ప్రజలు అసంఖ్యాకంగా వారిపై పగ సాధించడానికి లేస్తే హింసకులైన కమ్యూనిస్టుల్ని రక్షించే బాధ్యత ప్రతి క్రైస్తవునిమీద వుంటుంది"

నేను నూతనంగా రక్షింపబడిన దినాల్లో ఎక్కువ కాలం బ్రతుకలేనని తలంచాను. నేను త్రోవలో నడుస్తుండగా ప్రజల్ని చూచి, వారి రక్షణను గూర్చి తలంచినప్పుడు నా దేహంలో బాధ కలుగుచుండేది. సంఘంలో ఎవరైనా ఒక్కరు పాపం చేస్తే నేను గంటలకొద్దీ ఏడ్చేవాడను. అందరు రక్షింపబడాలనే ఆశ నా హృదయంలో ఇదివరకే నిలిచియున్నది. కమ్యూనిస్టుల రక్షణ కొరకైన ఆశ కూడా అంతే

మేం ఏకాంతంగా బంధించబడినపుడు ఎక్కువ ప్రార్థించ లేక పోయాం. ఆకలి బాధచేత, నిద్రమందువల్ల మేం మూర్ఖుల్లా వున్నాం. మా శరీరాలు అస్థిపంజరాలై పోయాయి. ప్రభువు ప్రార్థన కూడ మా కెంతో దీర్ఘమైనదిగా కన్పించింది నా ప్రార్థన తరచుగా "యేసూ, నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని మాత్రమే చెప్పగలిగేవాడను.

ఒక దినాన యేసు ప్రభువువద్ద నుండి నాకు జవాబు వచ్చింది "నీవు నన్ను ప్రేమిస్తున్నావా? నిన్ను నేను ఎలా ప్రేమిస్తున్నానో చూపిస్తా" ఆ క్షణంలోనే నా హృదయం అగ్నితో దహించుకొని పోయినట్లయింది. ఎమ్మాయికి వెళ్ళిన

శిష్యులతో యేసు మాట్లాడినప్పుడు వారి హృదయాలు మండాయి. నాది కూడ అదే అనుభవం. మన ఆదర్శం కోసం సిలువలో తన ప్రాణాన్ని యిచ్చినవాని ప్రేమను నేను అనుభవించాను. కమ్యూనిస్టులు ఎంత చెడ్డవారైనా దేవుడు వారిని ప్రేమిస్తున్నాడు.

కమ్యూనిస్టులు బహు ఘోర కృత్యాలు చేసారు. ఇంకను చేస్తూనే ఉన్నారు. అయినా క్రీస్తు ప్రేమ జయిస్తూనే వుంది. ఆయన ప్రేమ మరణమంత బలమైంది. అగాధ సముద్ర జలం ఆ ప్రేమను ఆర్పజాలదు. నదీ ప్రవాహాలు దాన్ని ముంచివేయజాలవు.

ఒక దైవ సేవకుణ్ని నేనున్న గదిలోనే వేసారు. అతడు మరణావస్థలో వున్నాడు. అతని ముఖాన్నుండి, శరీరాన్నుండి రక్తం పారుచుంది. కమ్యూనిస్టులు అతన్ని బహు భయంకరంగా దెబ్బలు కొట్టారు. మేమతన్ని కడిగాము. కొందరు ఖైదీలు కమ్యూనిస్టుల్ని దూషించారు. గాని అతడు "దయచేసి వారిని దూషించవద్దు! మౌనంగా నుండండి. నేను వారికోసం ప్రార్థించాలని కోరుచున్నాను." అన్నాడు.

## జైల్లో కుడా మేము ఆనందంగా వున్నాము.

కడచిన నా పదునాలుగు సంవత్సరాల జైలు జీవితాన్ని గూర్చి నేను తలంచినపుడు అది కొన్ని పర్యాయాలు బహు ఆనందకరంగా వున్నట్లు అనిపిస్తుంది.

మా జత ఖైదీలు, కావలి వారు మా సంతోషాన్ని చూచి విస్మయ మొందేవారు. మేం పాటలు పాడినందుకు వారు దెబ్బలు కొట్టినా పాడుతూనే వుండేవాళ్ళం. వారు మమ్మునాపలేక పోయేవారు. జైల్లో విశ్వాసులు సంతోషంగా గంతులు వేసారు. ఇటు

వంటి ఘోర పరిస్థితుల్లో కూడా వారు సంతోషించడం ఎలా సాధ్యం?

బాధనొందిన యోబులా వారున్నారు. కాని తుదకు యోబు ఎలా రెండంతల దీవెనలు పొందాడో నేను తెలిసికొన్నాను. బీద లాజరులా నా చుట్టు ఆకలి బాధతోను, పుండ్ల బాధతోను అనేక విశ్వాసులుండేవారు. అయితే దేవదూతలు వారిని పరలోకానికి తీసుకుపోతారని గ్రహించాను. వారియెడల ప్రత్యక్ష పర్చబడబోవు మహిమ యెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్న తగినవి కావని గ్రహించి ఆనందించాను.

మేం సంతోషించడానికి మరో కారణముంది. భక్తుల్ని హింసించిన సౌలు ఎలా భక్తపౌలుగా మారిపోయాడో అలాగే మమ్మును హింసించిన కొందరు కూడా మార్పు జెందారు. మేము రహస్య పోలీసు ఉద్యోగులకు సాక్ష్యమిచ్చినందున వారిలో కొందరు ప్రభువును అంగీకరించారు. దాన్నిబట్టి వారు జైల్లోవున్నా శ్రమల్ని సంతోషంగా అనుభవించారు. జైల్లో మమ్మును కొరడాలతో కొట్టిన అధికారులు కూడా సువార్త విని ఫిలిప్పీ పట్టణ చెరసాలాధికారి అడిగిన ప్రశ్నలా "రక్షణ పొందడానికి నేనేం చేయాలి." అని అడుగుతారేమోనని కనిపెట్టాము.

చెరసాల్లోనే వారిపట్ల మాకున్న బాధ్యతను గ్రహించాము. వారి చేతే హింసింపబడడము ద్వారానే వారిని ప్రేమించడానికి నేర్చుకొన్నాం. నా బంధువుల్లో అనేకుల్ని చంపివేశారు. అయినా నా ఇంటిలోని వారివి చంపిన నరహంతకుడు రక్షింపబడ్డాడు. కమ్యూనిస్టులకు సువార్త నందించే ఏర్పాట్లు మా చెరసాలలోనే ప్రారంభమైనాయి.

చీమ చూపుకు మన చూపుకు ఎంత వ్యత్యాసం వుందో మన చూపుకు దేవుని చూపుకు అంత భేదం వుంది. మానవరీతిని మాట్లాడితే విశ్వాసుల్ని సిలువలకు కట్టి మనుష్య మలాన్ని వారి మీద చల్లడం బహు భయంకరమైన సంగతి. అయితే హతసాక్షులు పొందుతున్న మహా శ్రమల్ని బైబిలు "చులకని శ్రమలు" అంటోంది. పదునాలుగు సంవత్సరాల జైలు జీవితం మా కెంతో దీర్ఘ కాలంగా కనబడింది. అయితే బైబిలు "కొంచెం కాలం" అంటోంది. దీన్ని బట్టి మనం కమ్యూనిస్టుల ద్వారా పొందుతున్న మహాశ్రమలు దేవుని దృష్టిలో స్వల్పంగా వున్నాయి. వీరి దౌర్జన్యం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటికి అర్థ శతాబ్దము గడిచిపోయినా, వేయి సంవత్సరాలు ఒక దినంలా వున్నాయన్న ఈ కాలము దేవుని దృష్టిలో ఒక క్షణంలా వుంది. వారు రక్షింపబడడానికి ఇంకా వీలుంది.

పరలోక ద్వారాలు కమ్యూనిస్టుల కోసం యింకా తెరుచుకొనే వున్నాయి. వారికోసం దీపం యింకా వెలుగుతూనే వుంది. అందరిలా వారు కూడా పశ్చాత్తాపం పొందవచ్చు.

ప్రేమే కమ్యూనిస్టుల్ని మారుస్తుంది. ద్వేషం అంధత్వాన్ని కలిగిస్తుంది. హిట్లర్ కమ్యూనిస్టులకు విరోధంగా వుంటూ వారిని ద్వేషించాడు. అందువల్ల వారిని ఓడించడానికి బదులు లోకంలో మూడవ భాగాన్ని వారే స్వాధీనపర్చుకొనేలా చేసాడు. చెరసాల్లో మేము కమ్యూనిస్టులకు సువార్త నందించే ఏర్పాట్లను గురించి ప్రేమతో తల పోసాము. కమ్యూనిస్టు నాయకుల్ని గూర్చి కూడా తలంచినాం.

అనేక సంఘనాయకులు సంఘ చరిత్రను అంత బాగా చదివినట్లు లేదు. నార్వే దేశం క్రీస్తు కోసం ఎలా సంపాదించ బడింది? రాజైన ఒలఫ్‌ను ముందు సంపాదించడం వల్లే గదా! మొదట వ్లాదిమీర్ రాజును సంపాదించడం వల్ల రష్యా దేశానికి సువార్త అందింది. హంగరీ దేశపురాజు సైఫన్‌ను సంపాదించడం వల్ల హంగరీని క్రీస్తుకోసం సంపాదించడం జరిగింది. అట్లే కమ్యూనిస్టు నాయకుల్ని క్రీస్తుకోసం సంపాదిస్తే వారివల్ల కమ్యూనిస్టు దేశాలు మారిపోవచ్చు

# 8

# కమ్యూనిజాన్ని ఎదుర్కోవాల్సిన విధానం

కమ్యూనిస్టు పరిపాలన ఎవరికీ నెమ్మది నివ్వజాలదు. కమ్యూనిస్టు గొప్ప నాయకులు కూడ ఎప్పుడూ భయపడుతూ వున్నారు.

అనేక మంది కమ్యూనిస్టు నాయకుల్ని నేనెరుగుదును వారు గొప్ప భారంతో మూలుగుతున్నారు. యేసే వారికి విశ్రాంతి నివ్వగలడు.

కమ్యూనిస్టు పాలకుల్ని క్రీస్తుకోసం సంపాదిస్తే లోకాన్ని నాశనాన్నుండి తప్పించినట్లౌతుంది. యుద్ధ సామగ్రి కోసం మితి మీరి వారు డబ్బు ఖర్చుచేస్తున్నందున అనేకులు ఆకలి బాధతో అలమటిస్తున్నారు. కమ్యూనిస్టుల్ని క్రీస్తు కోసం సంపాదిస్తే అంత ర్జాతీయ ఆందోళన అణగి పోతుంది. కమూనిస్టులు క్రీస్తు వైపు తిరిగితే క్రీస్తుకూ పరలోకంలోని దూతలకూ ఎంతో సంతోషం కలుగుతుంది. క్రీస్తు సంఘానికి గొప్ప జయం కలుగుతుంది.

రక్షింపబడిన కమూనిస్టుల్ని నేను ఎరుగుదును నా యౌవన దశలో నేను కూడ గట్టి నాస్తికుడను. కమ్యూనిస్టులు, నాస్తికులు పశ్చాత్తాపపడి రక్షింపబడితే క్రీస్తును చాల ప్రేమిస్తారు. ఎందు కంటే వారు బహుగా పాపం చేసారు. సువార్త సేవా ఏర్పాట్ల విషయంలో మనకు జ్ఞానం కావాలి. ఒక విధంగా చూస్తే మనుష్య

లంతా సమానులే గాని మరో విధంగా చూస్తే సమానులు కారు. దైవసేవ పెద్ద పెద్ద నాయకుల మధ్య చేసి వారిని ప్రభువువైపు త్రిప్పితే వారు ఆతరువాత అనేకుల్ని త్రిప్పగలరు. అందుచేతనే ప్రభువు తన సేవాంతంలో ఏదో ఒక పల్లెటూరికి వెళ్ళలేదు గాని ప్రపంచానికే మతకేంద్రమైన యెరూషలేంకు వెళ్ళాడు. పౌలు కూడ పదేపదే రోమాకు వెళ్ళ ప్రయత్నించాడు.

మనం మామూలుగా చేస్తున్న పనిని ఆపివేయాలి. "యెహోవా కార్యాల్ని అశ్రద్ధగా చేసేవాడు శాపగ్రస్తుడు" అని వ్రాయబడి వుంది. దేవుని సంఘం కమ్యూనిజంతో ఆధ్యాత్మిక సమరం చేయాల్సివుంది. సంఘం సక్రమంగా పనిచేయనందున కమ్యూనిస్టులు ఎన్నో దేశాల్ని కబళించివేశారు.

సంఘం క్రమబద్ధంగా, దీక్షగా పనిచేయ నారంభించాలి. "దేవుడు ఇనుప గడియల్ని విరుగగొట్టియున్నాడు" అని కీర్తనల గ్రంథంలో వ్రాసివుంది. అలాంటప్పుడు కమ్యూనిస్టుల ఇనుప తెర ఆయన దృష్టిలో అల్పమైనదే.

ఆరంభంలో సంఘం రహస్యంగాను, చట్టానికి విరుద్ధంగాను పనిచేసి జయాన్ని సాధించింది. మనం కూడ ఈ విధానాన్ని ఒప్పుకొని ఆరంభ క్రైస్తవులు లాగానే చేస్తే అనేక కమ్యూనిస్టుల్ని క్రీస్తుకోసం సంపాదించగలం.

ఒకడు తన సిద్ధాంత సరళిలోవున్న అంశాన్ని విశ్వసించడు గాని అయితే దేనికోసం మరణించడానికైనా సిద్ధపడతాడో.దాన్నే నిజంగా నమ్ముకొంటాడు రహస్య సంఘంలో నున్న క్రైస్తవులు తమ విశ్వాసాన్ని ప్రాణాల్ని పణంగా ఒడ్డైనా కాపాడుకొంటారు. వారికి సహాయం చేయడానికి మీకు మనస్సుందా?

కమ్యూనిస్టు దేశాల్లో క్రైస్తవులెందరో క్రూరాతిక్రూరమైన హింసల్ని ఎలా పొందుతున్నారో వర్ణించలేం. రుమానియా దేశంలో కమ్యూనిజాన్ని విస్తరణగావించిన లుక్రిట్యు పాట్రస్కాను అనే వ్యక్తి నాతో జైల్లో వున్నాడు. అతని సహచరులు అతన్ని జైల్లో వేయడమే వారికివ్వజాపిన బహుమానం. అతడు బుద్ధి స్థిరతగల వాడైనా పిచ్చి అస్పత్రిలో ఉంచివందున అతడూ పిచ్చివాడై పోయాడు. ఉన్నతాధికారిణి అన్నా పాకర్ స్త్రీకి కూడ అదే చేసారు క్రైస్తవుల్ని అనేక రకాల బాధ పెట్టినవారు సహితం తుదకు నానావిధ అగచాట్లకు గురైనారు.

ఇలావుండగా చైనా వీధుల్లో జరుగుతున్న అమానుష కార్యాలు విన్నవారందరికి అసహ్యం కలిగింది. రెడ్‌గార్డ్స్ బహిరంగంగా బహు క్రూరంగా ప్రవర్తించసాగారు. ఈ పరిస్థితుల్లో ఎవరికీ కనబడకుండా జైల్లో వేస్తున్న విశ్వాసుల్ని వారు ఏం చేస్తున్నదీ అనూహ్యం ఇటీవల ఒక భయానక వార్త తెలిసింది. కొందరు నిజవిశ్వాసుల్ని, ఒక భక్తి గల రచయితను వారు బంధించి, వారు తమ విశ్వాసాన్ని విడువనందున చైనావారు ఈ విశ్వాసుల చెవులు నాలుకలు కాళ్ళు నరికివేశారట

కమ్యూనిస్టులు మానవుల్ని చిత్రహింసల పాలుచేసి అమానుషంగా చంపడం చాల ఘోరమైన విషయం. అయితే దానికంటె వారు చేస్తున ఘోరాతిఘోరమైన కార్యం లేనిపోని సంగతులు చెప్పి అనేక అమాయక ప్రజల్ని, పిల్లల్ని భ్రమింపజేయడం, దుర్బోధలు చేసి వారిమనసుల్ని చెరిపివేయడం. వారు కమ్యూనిస్టుల్ని క్రైస్తవ సంఘాలకు నాయకులుగా నియమించి సంఘాన్ని నాశనం చేస్తున్నారు. యౌవనస్థులు దేవునియందు, క్రీస్తునందు విశ్వసించకుండా చేస్తూ అట్టి విశ్వాసుల్ని వారు ద్వేషించేలా చేసే

వారు క్రైస్తవ యోధులు జైలు శిక్ష ననుభవించి విడుదలైన తర్వాత వారు భరింపజాలని బాధ ఏమంటే తమ పిల్లలు సంపూర్ణంగా నాస్తికులై తల్లిదండ్రుల్ని దూషించడమే.

ఈ పుస్తకం సిరాతో నేను వ్రాయడంలేదు. హృదయంలో నుండి స్రవిస్తున్న రక్తంతో వ్రాస్తున్నాను.

దానియేలు జీవించిన దినాల్లో అగ్ని గుండంలో నుండి బయటికి వచ్చిన ముగ్గురు యువకులు ఏ విధంగా కాలకుండా వున్నారో అలాగే జైలునుండి విడుదలై బయటికి వచ్చిన క్రైస్తవులు కూడా కమ్యూనిస్టులపై ఏ విధమైన ద్వేషభావం లేకుండా రావడం విశేషం.

ఒక పుష్పాన్ని నీవు కాళ్ళతో తొక్కితే అది నీకు పరిమళవాసన నిస్తుంది. అలాగే హింసల పాలైన క్రైస్తవులు హింసకులైన కమ్యూనిస్టులకు తమ ప్రేమానుగంధాల్ని వెదజల్లుతున్నారు. మేము అనేక జైలు అధికారుల్ని క్రీస్తునొద్దకు నడిపించాం. మమ్మును బాగా హింసించిన వారికి ప్రేమతో క్రీస్తు సువార్తనందించడం మా గురి. నా సహోదరులైన అనేకులు జైళ్ళలో హతసాక్షులై పోయారు. అట్టి భాగ్యం నాకు దొరకలేదు. నేను విడుదలనొంది రుమానియాను విడిచి బయటికి రాగలిగాను.

అయితే పశ్చిమ దేశాల్లోని అనేక సంఘనాయకులకు కమ్యూనిస్టులు రక్షింపబడాలనే భారం ఏమీలేనట్లు నేను చూచాను. క్రైస్తవులకు మొత్తం మీద కమ్యూనిస్టులంటే ప్రేమలేదు. అందుకు ఋజువు వారు కమ్యూనిస్టు దేశాల్లో నున్న ప్రజల రక్షణకోసం ఏమీ చేయడంలేదు. యూదులకోసం, మహమ్మదీయులకోసం బౌద్ధులకోసం వారు మిషన్లు స్థాపించారు. గాని కమ్యూనిస్టులకోసం ఏ విధమైన మిషన్లులేవు. నిజంగా వారికి కమ్యూనిస్టులపై

ప్రేమేలేదు. ఒకవేళ ప్రేమవుంటే హిందూ దేశీయుల్ని ప్రేమించిన కేరి, చీనావారిని ప్రేమించిన హడ్సన్ టెయిలర్ ఎలా మిషన్లు స్థాపించారో అలాగే వీరూ చేసియుండేవారు.

## చరిత్ర నేర్పిన పాఠాలు

ఆరంభ శతాబ్దాల్లో ఉత్తర ఆఫ్రికా ప్రాంతాలన్నిటిలో క్రైస్తవ్యం బహుగా వ్యాపించింది. కాని రానురాను క్రైస్తవులు ఒక విషయాన్ని బాగా నిర్లక్ష్యం చేసారు అదేమంటె వారు మహమ్మదీయుల్ని క్రీస్తు కొసం సంపాదించకపోటం. దాని ఫలితంగా మహమ్మదీయులు ఉత్తర ఆఫ్రికాపై దండెత్తి వచ్చి, క్రైస్తవ్యాన్ని పెరికివేసారు. ఇప్పటివరకు కూడ ఉత్తర ఆఫ్రికా మహమ్మదీయుల చేతిలో వుంది.

చరిత్ర నేర్పుతున్న ఈ పాఠాన్ని మనం అవగాహన చేసికోవాలి. కమ్యూనిజాన్ని పడగొట్టగలిగిన రాజ్యాంగ శక్తి ఏదీ లేదు. అనేక మంది పాశ్చాత్య నాయకులకు సహితం ఈ దుష్ట శక్తిని పడగొట్టడం ఇష్టంలేదు. ఆయా ఆపదలు, రోగాల నుండి మనుష్యుల్ని రక్షించడానికి వారు ఏర్పాట్లు చేస్తున్నారు గాని వీటన్నిటికంటె బాధ పెడుతున్న కమ్యూనిజాన్ని రూపుమాపే ప్రయత్నాలు చేయడంలేదు.

ప్రఖ్యాతి చెందిన రష్యను రచయిత ఇల్యా ఏరన్‌బర్గ్ ఈలాగన్నాడు—"ఒకవేళ స్టాలిన్ ఏ పని చేయకుండా తాను చంపిన వారి పేర్లు వ్రాస్తూ కూర్చుంటే ఆ జాబితాను ముగించడాకిని అతనికి తన జీవిత కాలమే సరిపోయివుండేదికాదు."రష్యా కమ్యూనిస్టుల 20వ మహాసభలో కృశ్చేవ్ ఈలాగన్నాడు—"స్టాలిన్ వేలకొలది అమాయకులైన కమ్యూనిస్టుల్ని చంపివేసాడు." పద

హేడవ మహాసభ సమయాన నాయకత్వం వహించడానికి నియమితులైన 189 మందిలో 98 మందిని తరువాత పట్టుకొని చంపివేశారు.

దీన్నిబట్టి స్టాలిన్ క్రైస్తవులకు ఏమి చేసాడో సులభంగా ఊహించగలం. రష్యాలో స్టాలిన్ కాలంలో జరిగిన దుష్ట సంఘటనల కంటె మరి దౌర్జన్య క్రియలు ఇప్పుడు చైనాలో కూడా జరుగుతున్నాయి. బహిరంగంగా క్రైస్తవులు ఆరాధించలేరు. ఈ రెండు దేశాల్లో క్రైస్తవ్యాన్ని ద్వేషించడానికి దాదాపు నూరుకోట్ల మంది ప్రజలకు శిక్షణనిస్తున్నారు. రష్యా దేశంలో సర్కారు ఉద్యోగస్థులు క్రైస్తవ దేవాలయాల కెదురుగా నిలచి అక్కడ ఆరాధింప వస్తున్న యౌవనస్థుల్ని చెంపదెబ్బలు కొట్టి వెళ్ళగొట్టుతారు. రాబోయే దినాల్లో క్రైస్తవుల్ని అణగగొట్టడానికి, సరైన యోధుల్ని సిద్ధపరస్తున్నారు.

కమ్యూనిజాన్ని పడగొట్టగలిగిన శక్తి ఒకటే. అదే దేవుని వాక్యమనే శక్తి. ఈ శక్తి ద్వారానే అనేక కమ్యూనిస్టు దేశాల్లో రహస్య సంఘం పనిచేస్తోంది. రహస్య సంఘం ఇదివరకె కమ్యూనిస్టు ఉన్నతాధికారుల్లో కొందరిని క్రీస్తు కోసం సంపాదించింది.

రుమానియా దేశ ప్రధానమంత్రి గేయొర్గియు యుదేజ్ మరణించకముందు తన పాపాలకోసం పశ్చాత్తాపపడి రక్షించబడ్డాడు. కమ్యూనిస్టు దేశాల్లో రాజకీయ వ్యక్తులు కొందరు రహస్య క్రైస్తవులు. అనేకులు వీరిలా విశ్వాసులైతే ఆ దేశాల్లో గొప్ప మార్పు కలిగి స్వాతంత్ర్యాన్ని క్రైస్తవ్యాన్ని ఆహ్వానిస్తాయి. అట్టి అవకాశాలు ఇప్పుడె విరివిగా కనిపిస్తున్నాయి.

నేడు అమాయకులైన అనేక కమ్యూనిస్టులు గొప్ప ఆందోళనలో నున్నారు. వాస్తవంగా కమ్యూనిస్టు దేశాలమధ్య సహోదర భావం పెంపొందుతుందని కమ్యూనిస్టులు నమ్ముతున్నారు. అయితే కమ్యూనిస్టు దేశాలే కుక్కల్లా కాట్లాడుకోడం చూస్తున్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు ఈ లోకాన్నే స్వర్గంగా మార్చగలవని నమ్ముతున్నారు. అయితే యిప్పుడు వారి ప్రజలు అకలికి మాడిపోతున్నారు. వారికి ధనిక రాజ్యాలనుండి గోధుమలు తెప్పించుకొంటేనే గాని గడవదు.

కమ్యూనిస్టులు తమ నాయకుల పట్ల ప్రగాఢ విశ్వాసం వుంచుతారు. అయితే స్టాలిన్ గొప్ప నరహంతకుడనీ, కృశ్చేవ్ తెలివి విహీనుడనీ ఇప్పుడు తమ సొంత వార్తాపత్రికల్లో చదువుతున్నాం. ఆ విధంగా ఇప్పుడు వారి నాయకుల్నే వారు నమ్మలేకపోతున్నారు. వారు పోపు లేని రోమన్ కథోలిక్కుల్లా ఉన్నారు.

కమ్యూనిస్టుల హృదయాల్లో శూన్యతవుంది. వాటిని నింపగలవాడు క్రీస్తు ఒక్కడే. క్రీస్తు ఒకని హృదయంలో చేరువరకు అతడు ఖాళీ హృదయుడుగానే వుంటాడు. సువార్తలో వారిని ఆకర్షించు ప్రేమవుంది.

క్రైస్తవుల్ని వారి కుటుంబాల్ని కమ్యూనిస్టులు దూషించి హింసించినా, వారు దానినంతటిని మర్చిపోయి కమ్యూనిస్టుల్ని ప్రేమిస్తున్నారు క్రైస్తవ ప్రేమ సార్వత్రికమైంది క్రైస్తవులకు పక్షపాతమనేది ఉండకూడదు. మంచివారి మీదా, చెడ్డవారి మీదా సూర్యుడు ప్రకాశించునని యేసు చెప్పినాడు. క్రైస్తవ ప్రేమ కూడ అలాగే యుంది.

ఆరంభదశలో క్రైస్తవులు, సంఘం యూదుల కొరకేనా లేక అన్యులకొరకు కూడానా? అని తమ్మును తాము అడుగుకొన్నారు. అప్పుడు సరియైన జవాబు దొరికింది. ఆదే ప్రశ్న ఇప్పుడు కూడ యుంది. క్రైస్తవ్యం, పశ్చిమ దేశాల కొరకేనా లేక కమ్యూనిస్టు దేశాలకొరకు కూడానా? యేసుక్రీస్తు సిలువ వేయబడినప్పుడు ఆయన తన రెండు చేతుల్ని ఒకటి తూర్పుకును రెండవది పడమటికిని చాపినాడు. ఆయన యూదులకు మాత్రం రాజు కాడుగాని అన్యులకును, పశ్చిమదేశస్థులకును, కమ్యూనిస్టులకు కూడా రాజై యున్నాడు. "మీరు సర్వలోకానికి వెళ్ళి సర్వ సృష్టికి సువార్త ప్రకటించుడ"ని యేసు చెప్పాడు.

ఆయన తన రక్తాన్ని అందరి కోసం ధారపోసాడు గనుక అందరు సువార్త విని విశ్వసించాలి. రక్షింపబడిన తర్వాత కమ్యూనిస్టులు మిక్కిలి ప్రేమగలవారును ఆసక్తి గలవారవుతారు. గనుక వారికి సువార్త నందించుటలో ఎంతో ప్రోత్సాహం కలుగుతుంది. ఒక్క నలివచ్చని రష్యను విశ్వాసిని నేనెప్పుడూ కలిసికోలేదు. క్రీస్తు ప్రజలందర్ని ప్రేమించి వారికి తమ పాపం నుండి విడుదల కలిగించాలని కోరుతున్నట్లే కమ్యూనిస్టుల్ని కూడ ప్రేమించి కమ్యూనిజం నుండి వారిని విడిపింప గోరుతున్నాడు.

# 9

# నా విడుదల, నా అన్వేషణ

చెఱసాలనుండి విడుదల పొందాక నా భార్య మా భావి ఏర్పాట్లేమిటని అడిగింది. ఏకాగ్రతతోను, నెమ్మదిగాను దైవ ధ్యానంతో జీవించడం నా ఉద్దేశమని చెప్పగా ఆమె కూడ అదే అభిప్రాయాన్ని వ్యక్తపరచింది.

నా యౌవన దశలో నేను చాల చురుకుగా నుండేవాడను. కాని అనేక సంవత్సరాలు జైలు జీవిత అనుభవించుటను బట్టి ధ్యాన పరుడనై ఏకాంత జీవితానికి అలవాటుపడినాను. నా హృదయంలో కలిగిన తీవ్రత అణిగిపోయింది. కమ్యూనిజం అంటే నాకు చింత లేదు. పరలోకపు పెండ్లి కుమారుని ఆలింగనంలో నిమగ్నుడనై యుండిపోయాను. నన్ను హింసించిన వారికోసం ప్రార్థిస్తూ అట్టి వారిని హృదయపూర్వకంగా ప్రేమించగలిగాను.

కఠిన బాధలతో ఖైదు జీవితాన్ని అనుభవిస్తుండగా ప్రభు వైన యేసు మా మధ్యకు వస్తూ ఆదరించేవాడు. ఆయన సన్నిధిలో చెరసాల గోడలు వజ్రాల్లా మెరుస్తుండగా, గదంతా వెలుగుమయమై పోయేది. మా శరీరాల్ని బాధించే హింసకులు మాదృష్టిలోనే వుండేవారు కారు. మేం ఆత్మతో పరవశులమైపోయేవాళ్ళం మా శ్రమల్లో కలిగిన ఆనందాన్ని రాజభవనంలో కూడ పొందలేము.

ఎవరితోనూ దేని కోసమూ పోరాడ్డం నాకు యిష్టంలేదు. చెరసాల విడిచాక నెమ్మదిగా దైవధ్యానం చేయడమే నా ఉద్దేశం అయితే ఖైదులో నుండి బయటికి వచ్చాక కమ్యూనిజంవల్ల కలిగిన

భయంకరమైన ఫలితాల్ని చూడ గలిగాను. మేము జైలులో నను భవించిన హింసలకంటే కూడా ఇవి అసహ్యంగా వున్నాయ్ తమ నాయకులు. సంఘ కాపరులు, బిషపులు కూడ కమ్యూనిస్టు రహస్య పోలీసులకు సహాయం చేయడంలో తమ సొంత సంఘస్థులకే విరోధంగా పని చేసినట్లు దుఃఖంతో ఒప్పుకొన్నారు. కమ్యూనిస్టులు వారిని బలవంతం చేసారు "ఒకవేళ జైలుకు వెళ్ళడానికైనా సిద్ధ పడి ఇంకెప్పుడూ అలాంటి పనిచేయకుండా వుంటారా!" అని అడి గాను. అ దరుకు "అది వీలుకాద"ని చెప్పి, తమ్మును గూర్చి భయపడడంలేదుగాని రహస్య పోలీసులకు సహాయం చేయకపోతే వారు ఒకవేళ దేవాలయాల్ని మూసివేస్తారేమోనన్న భయాల్ని వారు వ్యక్తంచేసారు.

క్రైస్తవ మతైక విషయాల్ని కట్టుబాటులో నుంచడానికి ప్రతి పట్టణంలో ఈ రహస్య పోలీసుల్లో నొకడు తన ఇష్టం వచ్చి నప్పుడెల్ల ఒక సంఘకాపరిని పిలిచి "ఎవరు ఆరాధనకు వస్తున్నారు? తరుచుగా. ప్రభు రాత్రిభోజనాన్ని ఎవరు తీసికొంటున్నారు? ఎక్కువ సేవాసక్తి గల వారెవరు? ఆత్మల సంపాదకుడెవరు?" అని అడుగడం వాడుక. ఇటువంటి ప్రశ్నలు వేయడానికి రహస్య పోలీసులకు అధికారం వుంది. ఈ ప్రశ్నలకు సరైన జవాబులు సంఘకాపరి ఇవ్వకపోతే వెంటనే అతనిని తొలగించి అతనికంటె ఎక్కువ సహాయం చేయగల మరియొక కాపరిని వారే ఏర్పాటు చేస్తారు. ఒకవేళ ఎక్కడైనా అట్టికాపరి దొరక్కపోతే అక్కడ దేవాలయాన్ని మూసివేస్తారు.

చాలమంది సంఘ కాపరులు రహస్య పోలీసులకు ఇలా సహాయ పడ్డారు. కొందరు అయిష్టంతో తోడ్పడినారు. కొందరు విధిలేక తమ సంఘసేవను గూర్చిన విషయాల్ని వారికి తెలియ

జేసారు. మరికొందరైతే కమ్యూనిస్టువారి వలలో చిక్కి అడిగిన వాటికంటె ఎక్కువే చెప్పేవారు.

క్రైస్తవ యోధుల పిల్లలు ఎవరి సంరక్షణలో నుంటున్నారో తెలిసికొని ఆ కుటుంబాల ఆచూకీ చెప్పమని పిల్లల్ని బలవంతం చేసే వారు ఒకవేళ వారు చెప్పకపోతే పాఠశాలలో స్థలం దొరకడం దుర్లభమై పోయేది.

నేనొక బాప్టిస్టు సభకు వెళ్ళాను. అది కమ్యూనిస్టువారి ఎర్ర జండా క్రింద జరుగుతోంది. ఈ క్రైస్తవ సభకు ప్రతినిధుల్ని ఎంపిక చేసే అధికారం కమ్యూనిస్టులదే. మూతపడని దేవాలయాల్లో పనిచేసే సంఘ కాపరులంతా కమ్యూనిస్టులచేత ఏర్పరచబడినవారని నేను గ్రహించాను. క్రైస్తవ సంఘాన్ని నడిపించడానికి విశ్వాసుల్ని నాస్తికులే నియమించడం ఎంత హేయం! క్రైస్తవ్యాన్ని వేళ్ళతో పెరికి పారవేయడమే కమ్యూనిజం యొక్క ముఖ్యోద్దేశం.

"మతాన్ని గూర్చిన ప్రతి ఆలోచన, దేవుని గూర్చిన ప్రతి తలంపు ఈ విధంగా బహు హేయమైన భయంకరమైన అంటు వ్యాధిలా అయిపోతోంది. లక్షలాది పాపకార్యాలు, దౌర్జన్య కార్యాలు, దేవుని గూర్చిన బోధకంటె ఎంతో మేలు" అని లెనిన్ చెప్పాడు. లెనిన్‌ను అనుసరిస్తున్న కమ్యూనిస్టు పార్టీలన్నీ ఆ సిద్ధాంతానికే కట్టుబడిపోయాయ్. వారి ఉద్దేశంలో మతం ఒక కొరుకుడు పుండు, క్షయవ్యాధి లాంటిది, అన్ని అంటు రోగాలకంటే కూడా భయానకమైంది.

వారు నాస్తికత్వం అనే విషాన్ని పిల్లలకు, యువకులకు ఇచ్చి వారిని పాడుచేస్తుంటే బహిరంగ సంఘాలు ఆ విషానికి

విరుగుడు కాలేక పోయాయ్. మా రాజధానీ నగరం బుకారెస్టులో ఏ సంఘంలోనైనా ఒక సండేస్కూలుగాని, యువజనుల కూటాన్నిగాని మనం చూడలేం. క్రైస్తవ పిల్లలు అక్రమ జీవితంలో పెంచబడుతున్నారు.

ఇదంతా చూచాక జైల్లో కమ్యూనిస్టుల చిత్రహింసల్లో కూడా వారిపై నాకు కలగని ద్వేషభావం ఇప్పుడు ఎన్నో విధాలుగా నాలో నుండి ఉబుకుతోంది. కమ్యూనిజం నాకు చేసిన కీడునుగూర్చి నేను దాన్ని అసహ్యించుకోడం లేదు గాని దానివల్ల దేవుని మహిమకూ, క్రీస్తు నామానికీ, కమ్యూనిస్టు దేశాల్లోని నూరు కోట్ల ప్రజలకూ కలుగుతున్న కీడును బట్టి అసహ్యించుకోడం తప్పనిసరి అయ్యింది.

బీద రైతులు దేశం నలుమూలల్నుండి నన్ను చూడ్డానికి వచ్చిసమిష్టి రైతు విధానాన్ని గూర్చి చెప్పారు ఇదివరకు తమ స్వంతపొలాలల్లోనే, త్రాక్షాతోటల్లోనే ఇప్పుడు ఆకలిగొన్న బానిసలై పోయినట్లు చెప్పిబాధపడ్డారు. వారికిప్పుడు ఆహారంలేదు. వారి బిడ్డలకు పాలులేవు, పండ్లులేవు. కమ్యూనిస్టు పరిపాలన వారిని దొంగలుగాను, అబద్ధీకులుగాను మార్చివేసిందని వారు ఒప్పుకొన్నారు. ఆకలి బాధకు తాళలేక పొలాల్లోనిది దొంగిలించి తింటు దాన్ని కప్పిపుచ్చడానికి అబద్ధాలాడాల్సి వచ్చింది. కార్ఖానాల్లో పనిచేసే కార్మికులు వారిపట్ల జరుగుతున్న అన్యాయాల్ని గూర్చి నాతో చెప్పారు. ఉపాధ్యాయులుతమ మనస్సాక్షికి విరుద్ధంగా దేవుడు లేడని నేర్పించడం నిర్బంధ విద్య అయ్యింది.

లోకంలోని జనభాలో మూడు వంతులు ప్రజల జీవితం, ఆలోచనా విధానం ఈ సిద్ధాంతం వల్ల పాడైపోతోంది. ఇదో కపట

నాటకమై పోయింది. అంతాగందరగోళంగాను, అసత్యంగాను, వికారంగాను తయారయ్యింది.

రహస్య సంఘంలోని విశ్వాస వీరుల్ని తిరిగి కలిసి కొన్నాను. వారిలో కొందరు పట్టబడనివారు, కొందరు ఖైదునుండి విడుదల నొందిన వారు, కొందరు. నేను వారితో కలిసి తిరిగి సత్యంకోసం పోరాటం సాగించాలని విన్నవించాను. వారు నడి పిస్తున్న రహస్య కూటాలకు నేనూ వెళ్ళేవాడను. అక్కడ వారు అచ్చుపుస్తకాలు లేక చేతితో వ్రాసుకున్న పాటలు పాడేవారు.

క్రైస్తవులంతా చేయాల్సింది చేయడానికి నేనుతీర్మానించు కొన్నాను. అనగా క్రీస్తు చూపిన మాదిరి, అపోస్తలుడైన పౌలు ఇతర పరిశుద్ధులు చూపిన మాదిరిని అవలంబించి ఆత్మ యుద్ధంలో నిర్విరామంగా నిలిచిపోరాడ్డమే. అది ఎటువంటి యుద్ధము? క్రైస్తవులు చెరసాల్లో నుంటూ కూడ తమ శత్రువుల కోసం ప్రార్థించి ఘనమైన సాక్ష్యం యిచ్చారు. మా శత్రువులు కూడా రక్షింపబడా లన్నదే మా ప్రగాఢ వాంఛ. వారెవరైనా కానివ్వండి వారు రక్షింప బడినపుడు మేం ఎంతో ఆనందించేవాళ్ళం.

అయితే ఈ దుష్ట కమ్యూనిస్టు విధానాన్ని నేను అసహ్యించుకొని రహస్య సంఘానికి మేలు చేయగోరాను. సువార్తను బట్టి ఈ క్రూర ప్రభుత్వాన్ని పడగొట్ట గలిగింది ఈ రహస్య సంఘమే అని గ్రహించాను. నేను రుమానియా విషయమే తలంచుటలేదు గాని సమస్త కమ్యూనిస్టు ప్రపంచం విషయం ఆలోచన చేస్తున్నాను. అయితే పాశ్చాత్యులు దీని విషయం చాల నిర్లక్ష్యంగా నున్నట్లు గమనించియున్నాను.

కొందరు పశ్చిమదేశ సంఘ నాయకులు ఇట్టి విషయాలను లెక్క చేయరు. విశ్వాస వీరులపేర్లు వారి ప్రార్థన పట్టీల్లో

ఉండవు. వీరు కమ్యూనిస్టుల చేతుల్లో పడరాని హింసలు అనుభవించు సమయంలో వారికి ద్రోహం చేసిన రష్యా బాప్టిస్టు నాయకులూ, అర్థోడాక్స్ సంఘ నాయకులూ న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచ క్రైస్తవ మహాసభ (World Council of Churches Conference)లో గొప్ప గొప్ప సన్మానాలు పొందారు. రష్యా దేశంలో సంపూర్ణ మత స్వాతంత్ర్యం వుందని వారు అందరికీ బోధించారు. కమ్యూనిస్టు దేశాల్లోని కైదుల్లో క్రైస్తవ భక్తులు సత్యముకోసం పస్తులు పడుతుంటే వీరు ఘనంగా విందులు ఆరగించారు.

ఈ సంగతులు ఏమాత్రం సహింపరానివి. నేను బయటికి వచ్చి అక్కడి పరిస్థితుల్ని మీకు తెలియజేయాలని రహస్య సంఘ సభ్యులు నన్ను కోరారు. కమ్యూనిస్టుల్ని నేను ప్రేమిస్తున్నాను కాని కమ్యూనిజాన్ని బహిరంగంగా నిందించ నిశ్చయించుకొన్నాను. కమ్యూనిజాన్ని ఖండించక, సువార్తే చెప్పుకుపోవడం సరియైన పద్ధతని నేను అనుకోను. మిశ్రితముకాని సువార్తను ప్రకటించుము" అని నాతో కొందరు చెప్పుతున్నారు. ఇలా కమ్యూనిస్టు రహస్య పోలీసులు కూడ "క్రీస్తునే ప్రకటించు గాని కమ్యూనిజం జోలికి పోకు" అన్నారు.

ఈ "మిశ్రితము" కాని సువార్త అంటే ఏమో నాకు అర్థం కావడంలేదు. బాప్తిస్మమిచ్చు యోహాను బోధించిన సువార్త "మిశ్రితము" కానిదా? "దేవుని రాజ్యం సమీపించి యుంది, మారు మనస్సు పొందుడి" యని మాత్రమే ఆయన చెప్పలేదు గాని "హేరోదూ! నీవు దుర్మార్గుడవు" అని కూడ చెప్పాడు గనుక ఆయన తల నరికి వేయబడింది. యేసు "మిశ్రితము" కాని కొండ మీది ప్రసంగాన్ని మాత్రమే చేయలేదు గాని "అయ్యో శాస్త్రులారా,

పరిసయ్యులారా, వేషధారులారా, సర్ప సంతానమా" అని కూడ చెప్పాడు. ఇట్టి "మిశ్రితమైన" బోధ చేసినందుకే వారు ఆయన్ను సిలువ వేసారు. కొండమీది ప్రసంగాన్ని గూర్చి పరిసయ్యులకు ఏ అభ్యంతరమూ లేదు.

పాపాన్ని పాపమనే చెప్పాలి. నేను ప్రపంచంలో అన్ని పాపాల్ని మించిన పాపం కమ్యూనిజమే. ఏ సువార్త కమ్యూనిజాన్ని ఖండించలేదో అది సరియైన సువార్త కానేకాదు.

పశ్చిమ దేశాల్లో నేనెందుకు బాధపడాలి?

కమ్యూనిస్టు దేశాల్లో పడిన బాధకంటె నేను పశ్చిమదేశాల్లో ఎక్కువ బాధ పడుతున్నాను. మొదటి కారణం నేను రహస్య సంఘంతో నుండగోరుతున్నాను. అది నాకు అమితానందాన్ని చేకూర్చుతుంది. కమ్యూనిస్టు దేశాల్లో మనుష్య కుమారునికీ ఆయన అనుచరులకూ తల వాల్చుకోడానికైనా స్థలం లేదు. అక్కడ క్రైస్తవులు తమకోసం బంగ్లాలు కట్టుకోరు. కట్టినా ప్రయోజన మేంటి? వారు పోలీసులచేత పట్టబడగానే వారి ఆస్తులన్ని జప్తి చేయబడతాయ్ బైబిల్లోవున్నట్టు అక్కడ నీ తండిని ముందు నీవు పాతిపెట్టలేవు. క్రీస్తును వెంబడించక ముందు నీ యింటివారి సెలవు తీసికోలేవు. నీ తల్లి నీ సహోదరు లెవరు? ఈ విషయంలో నీవు యేసును పోలియుండాలి. దేవుని చిత్తాన్ని నెరవేర్చు వారే నీ తల్లీ. నీ సహోదరులు. శరీర సంబంధమైన బంధుత్వం కంటె ఆత్మ సంబంధమైన బంధుత్వమే దృఢమైంది

రహస్య సంఘం పేదరికంలో నున్న సంఘం, శ్రమ లనుభవించు సంఘం. గాని యిందులో నులివెచ్చని క్రైస్తవులు లేరు. నేను ఈ సంఘంలో జరుగు ఆరాధన 1900 సంవత్సరాల క్రిందటి ఆది సంఘంలో జరిగిన ఆరాధనలాగానే వుంటుంది. అక్కడ

బోధకులకు పెద్ద వేదాంతమేమీ రాదు. పేతురులా ప్రసంగక్రమం తెలియనివారు. బైబిళ్ళ కొరత ఎంతోవుంది. అందువల్ల అనేకులు బైబిలు వచనాలే రావు. అనేకమంది బోధకులు బైబిళ్ళు లేకుండానే జైలు జీవితాన్ని గడపాల్సి వస్తుంది అయినా వారంతా దేవున్ని తమ ప్రేమగల తండ్రిగా భావిస్తారు. "నన్ను ఆయన చంపినా నేను ఆయనయందే విశ్వాసముంచుతాను" అనిన యోబులాగానే వారున్నారు సిలువలో విడువబడినప్పటికీ దేవున్ని "తండ్రీ"యని పిలిచిన యేసులా వారున్నారు.

రహస్య సంఘంలోని ఆధ్యాత్మిక సౌందర్యాన్ని ఆసక్తిని చూచిన తరువాత జీవములేని కొన్ని పశ్చిమదేశ సంఘాల్ని చూచిన వారెవరైనా బాధపడక తప్పదు. పశ్చిమ దేశాల్లో నవ నాగరికత క్షీణదశలో నుండుటం నేను చూస్తుంటే కమ్యూనిస్టు జైళ్ళలో పొందిన బాధకంటె ఎక్కువ బాధ పొందుతున్నాను. ఈ శతాబ్దంలో ప్రజారాజ్యం, నాగరికతా యూరపు ఖండంలో సగం నశించింది. మిగతా పశ్చిమ దేశాలు నిద్రలో నున్నాయ్.

నిద్ర, విశ్రాంతి ఎరుగని అపూర్వశక్తి యొకటి వుంది. అదే కమ్యూనిస్టు శక్తి. వారు తమ సిద్ధాంతాల్ని అన్నిచోట్ల బోధిస్తున్నారు. ధనికులు నివసించే విశ్రాంతి భవనాల్లో కళా శాలల్లో, పేదలుండే వీధుల్లో, సంఘాల్లో బహు ఆసక్తిగా వారి విశ్వాసాన్ని ప్రచారం చేస్తున్నారు. సత్యం కోసం క్రైస్తవులమైన మనం అర్థ హృదయంతో పనిచేస్తుంటే, అసత్యం కోసం వారు పూర్ణ హృదయంతో పని చేస్తున్నారు.

ఇలావుండగా పశ్చిమ వేదాంతులు స్వల్పమైన విషయాలను గూర్చి చర్చిస్తున్నారు నేటి క్రైస్తవ పత్రికలను గమనిస్తే యిట్టి స్వల్ప విషయాలే చూడగలం. కమ్యూనిజంలోని భయంకరత్వాన్ని

గూర్చి, రహస్య సంఘం పొందుతున్న అతిఘోరమైన హింసల్ని గూర్చి బహు కొద్దిగా మాత్రమే వాటిలో కనబడుతుంది. వేదాంత విషయాలు, ఆచారాలు, మొదలగు చిన్నవిషయాలపై దీర్ఘ వాదాలు వారు చేస్తున్నారు. ఇది బహు దుఃఖకరమైన సంగతి! సల్ప విష యాలపై వాదాలు చేయక కమ్యూనిజాన్ని అరికట్టడానికి అందరూ ఏకీభవించాలి.

పశ్చిమ దేశాల్లో నేను బాధపడ్డానకు మరో కారణం వుంది. కమ్యూనిస్టు దేశాల్లోని రహస్య సంఘ శ్రమలు హెచ్చవుతుండే నేను అక్కడ లేకపోయినా కూడా వారితో పాటూ నేను శ్రమ పడుతూనే వున్నాను. కమ్యూనిస్టు దేశాల్లో విశ్వాసులు అనుభ విస్తున్న క్రూర హింసల్ని గూర్చి తలంచునప్పుడు నేను గడగడ వణకుతున్నాను. ఇంత ఘోర హింసల్ని భరిస్తున్న తోడి విశ్వా సులకు, సహోదరులకు ఏమీ సహాయం చేయక మౌనంగా వున్న పాశ్చాత్యుల్ని చూచి కూడా వణకుతున్నాను. ఇట్టి భక్తుల్ని హింసి స్తున్న వారికి రానున్న నిత్యదండనను గూర్చి కూడా నేను తలంచి వణకుతున్నాను.

ఇంత పెద్ద పోరాటంలో వంతు పుచ్చుకోక నా స్వంత విషయా లను చూచుకోవాలని నా కోరిక. ఏకాంతంలోవుంటూ విశ్రాంతి తీసికోవాలని ఆశవుంది. కాని అది అసాధ్యం. కమ్యూనిజం ప్రాకి పోతోంది. కమ్యూనిస్టులు టిబెట్టును స్వాధీనం చేసికొన్నప్పుడు ఆధ్యాత్మివాదుల నందరినీ అంతమొందించారు. మా దేశంలోకూడా అట్లే చేయ ప్రయత్నిస్తున్నారు. క్రైస్తవ దేవాలయాలు మూసి వేసారు. విదేశీయుల్ని మోసగించడానకు మచ్చుకు ఏవో కొన్ని మాత్రం వారు ఉండనిచ్చారు. ఇట్టి పరిస్థితుల్లో నేను మౌనంగా నుండుటం ఎలా సాధ్యపడుతుంది?

ఈ పోరాటం నాకు ప్రాణాంతకమైనదైనా నేను దీనికి నాయకత్వం వహించక తప్పదు. ఒకవేళ నేను ఎప్పుడైన అకస్మాత్తుగా కనబడకుండాపోతే నన్ను కమ్యూనిస్టులు బలవంతంగా ఎత్తుకుపోయారని మీరు గ్రహించాలి. 1948వ సంవత్సరంలో వారు నన్ను అలాగే ఎత్తుకు పోయి,నా పేరు మార్చి జైల్లో వేసారు ఇదే మళ్ళీమళ్ళీ జరగవచ్చు. ఒక వేళ నేను చనిపోతే దానికి కూడా కమ్యూనిస్టులు ఎత్తుగడలే కారణం అని నమ్మండి. ఇతరులు నన్ను చంపవలసిన కారణం ఏమీలేదు. నేను దొంగనని, పురుష సంయోగినని, వ్యభిచారినని, అబద్ధాల కోరునని ఎప్పుడైనా కమ్యూనిస్టులు వదంతి పుట్టించినా ఆశ్చర్యపడిపోనక్కర్లేదు. ఎందుకంటే వారు "మేం నీ పేరు చెడగొట్టుతాం" అని యిదివరకే బెదరించారు.

నేను అమెరికను సెనెటు యెదుట సాక్ష్యమిచ్చిన సంగతి రుమానియా దేశ కమ్యూనిస్టులు విని నన్ను చంపడానకు తీర్మానించు కొన్నట్లు నాకు తెలిసింది. నా మూలాన్ని రుమానియాలో నున్న నా స్నేహితులు శ్రమల పాలవుతున్నారు.

అయినా నేను మౌనంగా నుండలేను. నేను చెప్పుతున్న విషయాల్ని జాగ్రత్తగా పరిశోధించడం మీ బాధ్యత. నాకు కలిగిన శ్రమలు, హింసల విషయం మీరు వింటున్నప్పుడు కమ్యూనిజం ఎంత భయంకరమైందో మీరు వూహించవచ్చు. నిద్రాలోకం మేల్కొవాలి.

నాకు మరోబాధ వుంది. నా సన్నిహిత స్నేహితులు కొందరు నన్ను తప్పుగా అర్థం చేసికొంటున్నారు. కమ్యూనిస్టుల్ని నేను ద్వేషిస్తున్నట్లు వారు అనుకొంటున్నారు. అది ఏ మాత్రం నిజం కాదు. "మీ శత్రువుల్ని ప్రేమించుడి, మిమ్మును శపించు

వారిని దీవించుడి"అని చెప్పిన యేసే ఒక పర్యాయం శాస్త్రిల్ని పరిసయ్యుల్ని నిందించాడు కూడా. ఇది ఒకదాని కొకటి ప్రతి కూలంగా వున్నాయవి ఒక యూద రచయితే వ్రాశాడు. ఇది కేవలం తప్పు.

పరిసయ్యుల్ని బహిరంగంగా గద్దించినా యేసు లోలోన వారిని ప్రేమించాడు. అలాగే నేను కమ్యూనిస్టుల్ని, సంఘాల్లోని వారి ప్రతినిధుల్ని ప్రేమిస్తున్నాను. కాని వారి విధానాల్ని ఖండి స్తున్నాను. "కమ్యూనిస్టుల్ని ఆడిపోసికోడం మాని అధ్యాత్మిక విషయాల్నే బోధించు" అని తరచుగా నన్ను హెచ్చరిస్తున్నారు.

జర్మను వారి శ్రమలు అనుభవించిన యొక క్రైస్తవుని నేను కలసికొన్నాను. నేను క్రీస్తును బోధిస్తున్నంతకాలం అతడు నాతో సహకరించగలన్నాడు. అయితే ఎప్పుడైతే కమ్యూనిజానికి వ్యతిరేకంగా ఒక మాట నేను చెప్పానో తక్షణం అతడు నన్ను వదిలేస్తానని హెచ్చరించాడు. అప్పుడు నేను "మీ దేశంలో హిట్లరు కాలంలో అతన్ని ఎదిరించినవారు పొరబాటు చేసా రంటావా? వారు బైబిలును గూర్చి మాత్రమే మాట్లాడి హిట్లరును ఏమాత్రం ఖండించకుండ యుండవలసిందంటావా?" అన్నాను. అప్పుడతడు "హిట్లరు అయితే 60 లక్షలమంది యూదుల్ని చంపి వేసాడు గనుక అతన్ని అంతా ద్వేషించడంలో తప్పులేదు." అన్నాడు. దానికి నేను "అయితే కమ్యూనిజం 3 కోట్లమంది రష్యనుల్ని ఇంకా కోట్లాది చైనా దేశస్థుల్ని మరి యితరులు అనే కుల్ని చంపించింది. యూదుల్ని కూడ వారు చంపారు. యూదుల్ని చంపినప్పుడే మనం వార్ని ఎదిరించాలి గాని ఇతరుల్ని చంపి నప్పుడు వద్దా?" అన్నాను "అది వేరే విషయం" అని తప్పించు కున్నాడు. చెప్పడానకు అతలివద్ద సమాధానం ఏమీలేదు.

హిట్లరు కాలంలోను, కమ్యూనిస్టుల కాలంలోను నేను దెబ్బలు తిన్నాను. అంతా ఒకటే భేదమేమీలేదు. రెండూ బహు బాధాకరమే. కమ్యూనిజంతో మాత్రమే గాక అనేక విధాలైన పాపాలతో క్రైస్తవులు పోరాడాల్సివుంది. కమ్యూనిజం ఒకటే మన సమస్య కాదు అయితే క్రైస్తవ్యానికి వున్న మహా భయంకర శత్రువుల్లో కమ్యూనిజం ఒకటి. దీనికి విరోధంగా మనం ఐక్యపడాలి. క్రీస్తులా వుండాలనుకోడమే మానవలక్ష్యం కావాలి. దీన్ని ఏలాగో నిరోధించడమే కమ్యూనిజం యొక్క ఏకైక లక్ష్యం. వారు మత విరోధులు మరణం తరువాత మానవుడు కేవలం మన్నైపోతాడనీ వాడు ఆత్మ లేనివాడనీ వారి నమ్మకం. పదార్థమే ప్రాముఖ్యమన్న విధానాన్ని వారు విశ్వసిస్తారు. వారు తమ వార్తా పత్రికలో ఇలా వ్రాసారు. "మతమనేది కమ్యూనిజానికి విరుద్ధం. మతాన్ని రూపు మాపడమే కమ్యూనిజం యొక్క ప్రథమ కర్తవ్యం మా కార్యక్రమం ప్రకారం మతాన్ని చావుదెబ్బ కొట్టి ఒక నాస్తిక సంఘాన్ని ఆవిర్భవింప జెస్తాం. అప్పుడు ప్రజలు మతబంధకాల నుండి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని శాశ్వతంగా పొందుతారు."

క్రైస్తవ్యం, కమ్యూనిజం కలసి సహజీవనం చేస్తాయా? అన్న ప్రశ్నకు కమ్యూనిస్టులు ఇలా జవాబిస్తున్నారు. "మతాన్ని చావుదెబ్బ కొట్టాలి. అప్పుడు కమ్యూనిజం బతుకుతుంది."

# 10
# రహస్య సంఘం

ఇప్పుడు నేను మళ్ళీ రహస్య సంఘం విషయం మాట్లాడాలని కోరుతున్నాను.

బహు కష్టమైన పరిస్థితుల్లో ఈ సంఘం పని చేస్తోంది. కమ్యూనిస్టు దేశాల్లో నాస్తికత్వం రాష్ట్రమంతటా నుంది. వృద్ధులు మతాన్ని అవలంబించడానికి కొంతలో కొంత వీలుంది గాని పిల్లలు, యౌవనులు మతాన్ని ఏమాత్రం అవలంబించకూడదు. ఈ దేశాల్లో రేడియో, టెలివిజన్, సినిమా, వార్తాపత్రికలు, వంటి ప్రచార సాధనాల ద్వారా కమ్యూనిస్టులు ప్రచారం చేస్తూ, ప్రజలకు దేవుని యందున్న విశ్వాసాన్ని నాశనం చేయ ప్రయత్నిస్తున్నారు.

శక్తివంతమైన ఈ ప్రభుత్వాన్ని ఎదిరించడం రహస్య సంఘానికి కష్టమే. రహస్య సంఘ పరిచారకులకు వేదాంత విద్య ఏమాత్రం తెలీదు. బైబిలు పూర్తిగా ఒక సారైనా ముగించని కాపరులు కొందరున్నారు. ఇది మొదటి శతాబ్దంలోని సంఘంలా వుంది. అప్పుడు క్రీస్తు కోసం భూలోకాన్ని తల్లక్రిందులు చేసిన వారికి ఏ వేదాంత పాఠశాలలున్నాయ్? వారంతా చదువుకున్న వాళ్ళేనా? వారికి బైబిళ్ళు ఎక్కడవి? అయినా దేవుడు వారితో మాట్లాడాడు.

మా రహస్య సంఘాలకు గొప్ప దేవాలయాలు లేవు. అడవుల్లో రహస్యంగా కూడుకొని ఆకాశమనే దేవాలయం క్రిందనే ఆరాధనలు జరుపుకొంటున్నాం. పక్షుల అరపులే మాకు సంగీత

వాయిద్యాలు, పుష్పాల సువాసనలే మాకు సాంబ్రాణి, ఖైదుల్లోనుండి విడుదలనొందిన భక్తులు వేసికొన్న చినిగిన గుడ్డలే యాజకుని గంభీరస్త్రాలకంటె శ్రేష్ఠం. ఆకాశంలోని చంద్ర నక్షత్రాలే మాకు మైనపువత్తులు. మా కోసం వాటిని వెలిగించేవారు దేవదూతలు. ఈ సంఘ సౌందర్యాన్ని నేను వర్ణించలేను.

రహస్య ఆరాధన అనంతరం కొన్ని పర్యాయాలు క్రైస్తవులు పట్టుబడిపోతారు. జైలు పాలౌతుంటారు. తన ప్రియుడిచ్చిన నగల్ని ఒక పెండ్లిపడుచు ఎలా ఉబలాటపడుతూ వేసికొంటుందో అట్లే వారు సంకెళ్ళను తగిలించుకొంటారు. జయోత్సాహంతో కూడిన ఆనందంగల క్రైస్తవుల్ని నేను బైబిల్లోను రహస్య సంఘాల్లోను, చెరసాల్లోను మాత్రమే చూచాను.

రహస్య సంఘాన్ని చాల పీడించారు. అయినా దానికి చాల మంది స్నేహితులున్నారు రహస్య పోలీసువారిలో కూడా కొందరు. ఉన్నారు. సర్కారు ఉద్యోగుల్లో కూడా ఉన్నారు. ఇటువంటివారి వల్లే దేవుని సంఘం కాపాడబడుతోంది.

ఇటువంటివారి సంఖ్య రోజురోజా పెరుగుతోందని ఆమధ్య రష్యా వార్తా పత్రికల్లో ప్రచురించబడింది సర్కారు ఉద్యోగస్థులు కొందరూ. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని వ్యాపింపజేయు శాఖలో పని జేయువారు కొందరూ, వీరంతాబాహ్యంగా కమ్యూనిస్టుల్లా కనబడినా అంతర్యంలో క్రైస్తవ విశ్వాసుల్లాగా రహస్య సంఘ సభ్యులుగా దేవుని సేవ చేస్తున్నారు.

కమ్యూనిస్టు ప్రచారసంస్థకు చెందిన ఒక స్త్రీ విషయం కమ్యూనిస్టు పత్రికలో యిలా వుంది ఆమె తన పనినుండి ఇంటికి

వచ్చాక భర్త సహకారంతో ఇరుగు పొరుగుల్ని ఒక గదిలో చేర్చి రహస్యంగా బైబిలు పఠన, ప్రార్థనకూటము జరిగించేది. ఇలా కమ్యూనిస్టు దేశాలన్నింటిలో జరుగుతోంది. ఈ విధంగా వేనకు వేలు బాహ్యాని కమ్యూనిస్టులును, ఆంతర్యంలో క్రైస్తవులునైన వారు ప్రతీ దేశంలోనూ వున్నారు. బహిరంగంగా నడుస్తున్న క్రైస్తవ దేవాలయాలకు వెళ్ళడానికి వారి ఇష్టపడరు. ఎందుకంటే అక్కడ రహస్య పోలీసులు కాపలో ఉంటారు. అంత మాత్రమే గాక ఆ సంఘాల్లో వాక్య పరిచర్య పవిత్రంగా జరుగదు. అందు వల్ల వీరు తమ ఉద్యోగాల్లోనే వుంటూ రహస్యంగా క్రీస్తుకు సాక్షులుగా వుంటున్నారు.

ఈ విశ్వాసులకు బైబిలు సిద్ధాంతాలు ఎక్కువ తెలీకపోయినా వారు ఎలా నాస్తికుల్ని, ఆస్తికుల్ని చేస్తున్నారో అనేది ఆశ్చర్యమే నాస్తికులతో వారు చక్కగా తర్కిస్తారు. "ఎవరో మిమ్మును ఒక విందుకు విలుస్తారనుకోండి, వారు మీ ముందు శ్రేష్ఠమైన భోజన పదార్థాల్ని వుంచారనుకోండి. వాటిని ఎవరూ సిద్ధం చేయలేదు, వాటంతటవే తయారైనాయి అనుకొంటారా? సృష్టి ఒక విందులా వుంది. తేనె, పాలు, రుచిగల కూరగాయలు, పండ్లు ఇంకా ఇతర అనేక భోజన పదార్థాలు మనచుట్టూ వున్నాయ్ వీటన్నింటినీ సిద్ధంచేసింది ఎవరు? సృష్టి గ్రుడ్డిది. మీరు దేవుణ్ని విశ్వసించక మన నిత్యావసర వస్తువుల్ని సృష్టే తయారు చేసిందని మీరు వాదించడం అర్థరహితం కాదా?"

నిత్యజీవం వుందని వారికి ఋజువు చేయడానికి ఒక విశ్వాసి ఒక కమ్యూనిస్టుకు యిలా సాక్షమివ్వడం నేను విన్నాను. "మీరు తల్లి గర్భంలోని పిండంతో మాట్లాడారనుకోండి దాని

బ్రతుకు గర్భంలో కొన్ని దినాలు మాత్రమే అని ఆ తరువాత ఒక పెద్ద ప్రపంచంలో ప్రవేశించి అక్కడ దీర్ఘకాలం జీవించాల్సి వుంటుందని చెప్పితే ఆ పిండం ఏమని జవాబిస్తుంది? ఇప్పుడు నాస్తికులైన మీకు మోక్ష నరకాల విషయం చెప్పుతుంటే ఎలా జవాబిస్తున్నారో అలాగే ఆ పిండం కూడా జవాబిస్తుంది. తల్లి గర్భంలో నున్న జీవితమే వాస్తవమనీ, మిగిలిన దంతా మతపిచ్చి యని చెప్పుతుంది. అయితే ఆ పిండం స్వంతంగా ఆలోచించగలిగితే ఒకవేళ ఈలాగనుకొంటుందేమో, 'నాకు చేతులు, కాళ్ళు, కండ్లు పెరుగుతున్నాయ్ గాని ఏం ప్రయోజనం? నేను వాటిని ఇప్పుడు వాడుకోలేను. ఒకవేళ నేను నా తల్లి గర్భాన్ని విడిచి వేరు లోకంలో ప్రవేశిస్తే బహుషా వీటిని వాడుకోగలనేమో అని గర్భంలో నుండగానే రాబోయే జీవితం కోసం సిద్ధపడుతుంది. మన విషయం కూడా అంతే. మనం ఈ లోకంలో అనేక సంగతుల్లో పెరుగుతున్నాం. విజ్ఞానం, తెలివితేటలు, అనుభవాలు అధికమౌతున్నాయ్ ఎందుకు? అవి అధికమయ్యాక ఆ పిదప చనిపోయి వాటిని యింకెప్పుడూ వినియోగించుకో లేక పోడానా? కాదు. మనం రాబోయే లోకంకోసం సిద్ధపరచబడుతున్నాం."

కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రకారం యేసు ఎప్పుడూ ఈ లోకంలో జీవించలేదు. అందుకు రహస్య సంఘం వారికిచ్చు సరియైన జవాబు: "నీ చేతిలో వార్తా పత్రిక వుందికదా? నన్ను ఒకసారి చూడనీయ్ ఓహో! నేడు 14 జనవరి 1964. ఈ 1964 సం॥ ఎప్పటినుండి ఆరంభమైంది? ఎన్నడూ జీవించని వానినుండి ఆరంభమైందా? ఆయన లేనేలేడు అంటూ ఆయన జన్మాన్నుండి లెక్కలు ఎనా వేస్తున్నారు? యేసు జన్మించిన నాటినుండే కాలపరి

మితి ఆరంభమైంది. యేసు జీవించాడని మీ కమ్యూనిస్టు వార్తా పత్రికే ఋజువు చేస్తోంది."

ఇక్కడ సంఘకాపరులు అనేకులు తమ సంఘస్థులు క్రైస్తవ మూల సిద్ధాంతాలను అంగీకరించారని కొంటారు. అయితే వాస్తవానికి వారిలో చాలమంది ఆ సత్యాన్ని ఎరిగి వారుకారు. అయితే కమ్యూనిస్టు దేశాల్లోని రహస్య సంఘ పరులు తమ సంఘస్థులకు మాత్ర ఆధ్యాత్మికంగా గట్టి పునాది వేస్తున్నారు

కమ్యూనిస్టు అజమాయిషీలోనన్న బాహ్య సంఘాన్ని గూర్చి నేను ఒక మాట చెప్పగోరుతున్నాను. యిది కమ్యూనిస్టులకే బాగా తోడ్పడుతున్న సంఘం, దీని చరిత్ర పెద్దది.

రష్యా మహా విప్లవం తర్వాత కొందరు క్రైస్తవ నాయకులు విశ్వాస ఘాతకులై కమ్యూనిస్టులతో సంపూర్ణంగా ఏకీభవించి సంఘాల్ని నాశనానికి నడిపించారు. ఇతర కమ్యూనిస్టు దేశాల్లో కూడ అలాగే జరిగింది. రష్యాలో నికొదేము అను ప్రస్తుతపు ఆర్చ బిషప్ కమ్యూనిస్టులతో పని చేస్తున్నాడు. నికొదేము కమ్యూనిస్టుల ప్రతినిధియని రహస్య పోలీసుల్లోనన్న ఒకడు ఒప్పుకొన్నాడు. ప్రతి క్రైస్తవ శాఖ కూడా అలాగేవుంది. రుమానియాలోని బాప్టిస్టు నాయకులు కమ్యూనిస్టులచే నియమించబడి నిజ క్రైస్తవులను ఎదిరిస్తున్నారు. రష్యాలోని బాప్టిస్టుల సంగతి అలాగేవుంది

కమ్యూనిస్టులు అనేక క్రైస్తవ దేవాలయాల్ని మూసివేసి నప్పటికీ అక్కడక్కడ కొన్నింటిని మాత్రం మూసివేయలేదు. ఈ కొన్ని దేవాలయాల్లో నామకార్థపు ఆరాధన జరిగించ నివ్వడం ద్వారా క్రైస్తవుల్ని తమ ఆధీనంలో నుంచుకొంటున్నారు. దీన్ని

బట్టి బయటి ప్రపంచానికి వారిస్తున్న మత స్వాతంత్ర్యాన్ని గొప్పగా ప్రదర్శించి మోసగించ వీలౌతోంది. నాకూ వాటిట్టి సంఘాన్నొక దాన్ని యివ్వజూపారు.

ఈ సంఘాల్లోని సంఘకాపరులు మొత్తంమీద మహాద్రోహులైనా వారి సంఘస్తులకు ఆధ్యాత్మిక జీవం కొంతమట్టుకు లేక పోలేదు.

కమ్యూనిస్టుల ఆధీనంలో సాగిపోతున్న సంఘాల్లో ఎంత సేపూ కమ్యూనిస్టుల్ని గూర్చిన పొగడ్తలేగాక వాక్యపఠనం కూడ జరుగుతుంది. పాత కాలపు పాటలే పాడుతారు. అయినా వీటిద్వారా కొంతరు ప్రభువు నందు విశ్వసిస్తున్నారు. ఇట్లు దేవుడు వారి మధ్యలో కూడ తన అద్భుత క్రియను జరిగిస్తున్నాడు.

కాని బాహ్యసంఘాల సంఖ్య దినదినం పడిపోతోంది. సోవియట్ యూనియన్ అంతటిలో నాల్గు లేక ఐదువేల సంఘాలు మాత్రం ఉండ వచ్చు. అయితే ఇదే జనసంఖ్య గల అమెరికా దేశంలో మూడు లక్షల సంఘాలు వున్నాయ్. ఈ దేవాలయాలు పెద్ద ఆకారము గలవి కావు గాని సామాన్యమైన ప్రార్థనా గదులు. విదేశీయులు మాస్కో నగరంలోని జనసమర్థమైన దేవాలయాన్ని చూచి, అక్కడ బోలెడు స్వాతంత్ర్యం వుందని మోసపోతున్నారు. "అక్కడ దేవాలయాలు ప్రజలతో క్రిక్కిరిసి పోతున్నాయని చెప్పుతున్నారు. అయితే డెబ్బది లక్షల క్రైస్తవుల కోసం వున్నది ఒకే ఒక ప్రొటస్టంటు దేవాలయం మాత్రమేనని వారికి తెలీదు."

ఇట్టి చిన్న చిన్న ప్రార్థనా గదులు కూడా విశ్వాసులకు అందు బాటులో లేనందున వారెంతో ఇబ్బంది పడుతున్నారు.

రహస్యంగా వీరిని దర్శించి సువార్త నందించడంకంటే గత్యంతరం వేరేదీ లేదు.

ఏ దేశంలోనైనా కమ్యూనిజం అభివృద్ధి పొందినకొద్దీ క్రైస్తవ సంఘం రహస్యంగానే ఉండిపోవాల్సి వస్తుంది

## రహస్య సంఘానికి
## నాస్తిక గ్రంథాల్లోని ఆధ్యాత్మిక సహాయం

ఏ విధంగా ఏలీయా కాకులచేత పోషింపబడ్డాడో అలాగే విశ్వాసులు నాస్తిక బోధలచేత కూడా కొంతవరకు పోషింపబడుతున్నారు. ఎట్లంటే నాస్తికులు చాల ఆసక్తితో బైబిలు వచనాల్ని అపహసిస్తూ, విమర్శిస్తూ తమ ఇష్టము వచ్చినట్లు చెడ్డ వాతలన్నీ వ్రాస్తారు. బైబిలు వచనాలు అర్థరహితాలని చూపించడానకు చేసే ప్రయత్నంగా అనేక బైబిలు వచనాలనెత్తి వ్రాస్తారు. ఇట్టి పుస్తకాల్ని లక్షల సంఖ్యలో అచ్చువేసి పంచుతున్నారు. వారు వ్రాసిన ఖండన చదివితే వారి తెలివిహీనవిమర్శలకు నవ్వొస్తుంది. వారి పుస్తకాలు బైబిలు వచనాలతో నిండివున్నాయ్. ఇలా బైబిలు లేని వారు దేవుని వాక్యాలున్న పుస్తకాల్ని చూచినప్పుడు ఎంతో సంతోషిస్తారు. వారు ఎంత దూషణకరంగా వ్రాసినా అక్కడ అనేక బైబిలు వచనాల్ని వుదహరించినందున అవి మాత్రం విశ్వాసులకు ఎంతో సహాయకరంగా వుంటున్నాయ్.

ఒకోసారి నాస్తిక కూటాల్ని కూడా విశ్వాసులు తమ మేలుకొరకే వాడుకొంటున్నారు. ఒక ఉపన్యాసకుడు ఒక సమావేశంలో, యేసు ఒక మంత్రగాడని వుపన్యసిస్తూ తన ముందున్న

ఒక పాత్రలో నీళ్ళుపోశాడు. దానిలో ఏదో పొడి వేసాడు. అప్పుడు నీరు ఎర్రని రంగుగా మారి పోయింది. అప్పుడతడు "యేసు కూడా యిలాగే తన అంగీ లోపల దాచిన పొడిని నీళ్ళలో వేసినప్పుడు రంగు మారిపోయింది. అప్పుడు ఆయన నీళ్ళను ద్రాక్షారసంగా మార్చినట్లు నటించినాడు. అయితే నేను యేసుకంటె ఎక్కువ చేయగలను. నేను ద్రాక్షారసాన్ని తిరిగి నీళ్ళుగా మార్చగలను" అని చెప్పి తిరిగి మరొక విధమైన పొడిని నీళ్ళలో వేసాడు. ఆ నీళ్ళ రంగు తెల్లగా మారిపోయింది

అప్పుడొక క్రైస్తవుడు లేచి నిలిచి, "గురూజీ: నీ అద్భుత శక్తికి మేమంతా ముగ్ధులమయ్యాం. ఇప్పుడు ఒకటి మాత్రం అడుగుతాను. నీవు చేసిన ద్రాక్షారసాన్ని ఒక్కసారి త్రాగి చూడు" అన్నాడు. అప్పుడతడు "అది నేను చేయలేను, నేను వేసిన ఆ పొడి విషమే." అన్నాడు. అప్పుడా క్రైస్తవుడు, "ఇదే నీకూ యేసుకూ వున్న భేదం ఆయన తన ద్రాక్షారసంచేత గత రెండు వేల సంవత్సరాల నుండి, మమ్మునానందింప జేస్తున్నాడు. అయితే నువ్వు నీ ద్రాక్షారసంతోటి మనుష్యుల్ని చంపజూస్తున్నావు" అని చెప్పాడు. దీన్ని బట్టి ఆ విశ్వాసిని జైల్లో వేసారు. ఈ వార్త అంతటా వ్యాపించినందున అనేకులు విశ్వాసంలో స్థిరపర్చబడ్డారు.

మనం చిన్నవాడైన దావీదులా బలహీనులం. అయితే దేవుడు మన పక్షాన వున్నందున నాస్తికత్వం అనే గొల్యాతుకంటె బలాఢ్యులం. సత్యం మనదే.

ఒక పర్యాయం ఒక కమ్యూనిస్టు వక్త నాస్తి కత్వాన్ని గూర్చి ప్రసంగించిన సభకు కార్మికులనేకులు హాజరయ్యారు.

అందులో అనేకులు క్రైస్తవులు. దేవునికిని క్రీస్తుకును విరోధంగా అతడు చెప్పినవన్నీ విన్నారు. వక్త తన ఉపన్యాసంలో దేవుడు లేడనీ, క్రీస్తు సంగతి బూటకమనీ. మోక్ష నరకాలు లేవనీ, మానవుకు ఆత్మలేని ఒక పదార్థమనీ ఋజువుచేయ ప్రయత్నించాడు. మానవుడు ఒక స్థూలద్రవ్యం మాత్రమే నని అన్నాడు.

అప డొక క్రైస్తవుడు లేచి మాట్లాడ్డానకు సేలవు కోరగా వారు సెలవిచ్చారు. ఆ క్రైస్తవుడు తాను కూర్చుని వున్న కుర్చీని ఎత్తి నేలకు పెట్టి కొట్టాడు. అట్లే నిలిచి దానిని కొంత సేపు గమనించాడు. ఆ తరువాత కమ్యూనిస్టు వక్తను సమీపించి చెంపపై ఒక దెబ్బకొట్టాడు. అందుకు ఆ ఉపన్యాసకుడు మండిపడ్డాకు కఠిన స్వరంతో ఆ క్రైస్తవున్ని పట్టివేయాల్సిందని ఆదేశించాడు. "నీవు నన్నెందుకు కొట్టావు? కారణ మేమిటో?" చెప్పు అని నిలదీశాడు.

అప్పుడు క్రైస్తవుడిలా అన్నాడు. "ఇంతవరకూ మీరు చెప్పిందంతా మట్టిదేనని రుజువు పర్చుకున్నారు. అంతా పదార్థమే గాని వేరేమీ లేదన్నారు గదా? నేను కూర్చీని తీసి పడవేసాను. అది వాస్తవంగా పదార్థమే. కుర్చీ నాపై కోపగించలేదు. మిమ్మల్ని చెంపమీద కొట్టాను కాని మీరు కుర్చీలా మౌనం వహించలేదు. మీ ప్రవర్తనే వేరై పోయింది. పదార్థానికి కోసం రాదు అయితే మీకు వచ్చింది. కనుక సోదరా! నీవు తప్పు మార్గంలోవున్నావు. మానవుడు పదార్థాన్ని మించినవాడు. మనం ఆధ్యాత్మిక జీవులం."

ఇలా అనేక రీతులుగా రహస్య సంఘ సభ్యులు నాస్తిక వాదాల్ని ఎదుర్కొని బుద్ధిచెబుతున్నారు. చెరసాలలో నేనున్నప్పుడు ఒక కమ్యూనిస్టు ఆఫీసరు, "ఎంతకాలం నువ్వు అర్థంలేని మతాన్ని పట్టుకొని వేళాడ్తావు?" అని అడిగాడు. అప్పుడు నేను "నాస్తికులు అనేకులు తమ మరణ శయ్యలమీద సహితం తమ తప్పు కోసం పశ్చాత్తాపపడి క్రీస్తును ప్రార్థించారు. ఏ క్రైస్తవుడూ ఇలా తన విశ్వాసం కోసం పశ్చాత్తాపపడి, మరణ సమయంలో మార్క్సుకు గాని లెనిన్‌కు గాని ప్రార్థించనే ప్రార్థించడు "అన్నాను. అప్పుడతడు చిరునవ్వుతో, "తెలివైన ఉత్తరమిచ్చావు" అన్నాడు. తిరిగి నేను "ఒక వంతెనను క్రొత్తగా కట్టినప్పుడు దాని బలాన్ని పరీక్షించడానకు దానిపై ఒక పిల్లిని నడిపిస్తే ఏం తెలుస్తుంది? యితే దానిమీధ ఒకరైలును నడిపిస్తే దాని బలం తేటపడుతుంది. అంతా సవ్యంగా వున్నప్పుడు నాస్తికుడుగా ఉండడం ఏమీ గొప్ప సంగతి కాదు, గాని పరిస్థితులు తారుమారైనప్పుడు ఆలాగుండడం ఏమంత సాధ్యంకాదు"అని చెప్పి లెనిన్ వ్రాసిన గ్రంథాన్నెత్తి, ఆయన తన క్లిష్టసమయాల్లో ప్రార్థించడం ఎలా తప్పని సరైందో చెప్పిన ఆ వుదాంతాన్ని ఎత్తి చూపించాను. తాను సోవియట్ యూనియన్‌కు ప్రధాన మంత్రిగానున్న కాలంలో అలా ప్రార్థించాల్సిన పరిస్థితి ఏర్పండి.

కమ్యూనిస్టులకు సరైన శాంతి సమాధానాలు దొరకనందున పలువిధాలుగా కలవరిస్తున్నారు. భక్త ఆగస్టీన్ చెప్పినట్లు వారున్నారు. "మన హృదయాలు దేవునిలోని విశ్రాంతిని కనుగొనేవరకు వాటికేమాత్రం విశ్రాంతి వుండుదు."

## కమ్యూనిస్టులు కూడా రక్షింపబడతారు

స్వతంత్రులైన క్రైస్తవులు కమ్యూనిస్టు దేశాల్లోని రహస్య సంఘాలకు సహాయం చేస్తే వారు కమ్యూనిస్టుల్ని రక్షణలోనికి నడిపించడం మాత్రమేగాక లోకస్థితిగతుల్ని మార్చివేసినవారౌతారు. కమ్యూనిజం అస్వాభావికమైంది. కుక్క కూడా తనకో స్వంత ఎముక కావాలని కోరుతుంది. కమ్యూనిస్టులు చేస్తున్నదానికి సంబంధం వుండదు. కాబట్టి వారిని క్రీస్తునొద్దకు నడిపించడం సులభ సాధ్యమే.

కమ్యూనిస్టుల్లో కొందరు లోకంలోని సమస్తం పదార్థమేయనీ మనుష్యులు కూడా ఒక ప్రత్యేక రూపాన్ని సంతరించుకొనేలా చేయబడ్డ, పిడికెడు చైతన్యహీన పదార్థ సమ్మేళనమనీ, మరణమైన తరువాత మనిషి మళ్ళీ లవణాలుగాను పదార్థాలుగాను మారిపోతున్నాడనీ గట్టిగా వాదిస్తున్నప్పుడు, వారిని ఈ ప్రశ్నలు అడగాల్సి వస్తుంది– "అలాగైతే అనేక దేశాల్లో కమ్యూనిస్టులు తాము నమ్మిన సిద్ధాంతాల కోసం ప్రాణత్యాగం ఎందుకు చేశారు? పిడికెడు ఆత్మలేని పదార్థాలు కూడ ప్రాణాల త్యాగం చేస్తాయా? యితరుల సంక్షేమం కోసం పదార్థాలు తమ ప్రాణాలు అర్పిస్తాయా?" ఈ ప్రశ్నలకు వారు ఉత్తర మియ్యలేకపోతున్నారు.

వారి అమానుషత్వాన్ని ఏమని చెప్పగలం? మానవుడు పశురూపాన సృష్టింపబడలేదు. అందువల్ల పశుప్రవృత్తితో ఎంతో కాలం ప్రవర్తింపలేడు.

కమ్యూనిస్టు దేశాల్లో విరివిగా వ్యాపించియున్న త్రాగుడు ఒక సత్యాన్ని సూచన ప్రాయంగా చూపుతోంది. అదేమంటే మనుష్యులకు కమ్యూనిజం ఇవ్వజాలని ఒక విశాల జీవితం కోసం

వారిలో గొప్ప ఆశ కన్పడుతుంది. సాధారణంగా రష్యా దేశీయుడు గంభీరమైన ఉదార స్వభావుడు. కమ్యూనిజం అంతా లోతులేని పై పై బూటకమే రష్యా మనిషి గంభీర జీవాన్ని అన్వేషించి అది ఎక్కడను దొరకనందున, మత్తు పదార్థాలతో తన్ను తాను తృప్తి పరచుకొన ప్రయత్నిస్తున్నాడు తాను పశువులా జీవిస్తూ తన జీవితం పట్ల కలిగే అసహ్యతను మరచిపోడానకు బాగు తాగు తున్నాడు.

ఒక పర్యాయం నేనూ నా భార్యా ఒక హోటల్‌కి వెళ్ళాం. అక్కడ ఒక రష్యన్. మిలటరీ ఆఫీసర్ మద్యం సేవించి గందర గోళం చేస్తున్నాడు అతడు మైకంలో తన చేతిలోని తుపాకీతో అందరిని బెదరిస్తూ యింకా యింకా తాగుతున్నాడు. అప్పుడు నేను అతనితో కలసి నెమ్మదిగా మాట్లాడాక మేమిద్దరం స్థిమితంగా కూర్చున్నాం. అంత తాగినా అతని ఆలోచనాశక్తి తగ్గిపోలేదు. క్రీస్తును గూర్చి నే నతనితో మాట్లాడాను. నే నూహించని విధంగా అతడు శ్రద్ధగా విన్నాడు. తుదకు అతడు "నీవెవరంవో ఇప్పుడు నాకు తెలిసింది. అంతే నేనెవర్నో నీకు తెలియజేస్తాను. ఆర్థో డాక్స్ సంఘంలో నేనొక మతగురువును. స్టాలిన్ కాలంలో మహా హింస ఆరంభమైనప్పుడు నేను విశ్వాస ఘాతకుడనై పోయాను. అప్పటినుండి గ్రామ గ్రామాలు తిరిగి నాస్తికత్వాన్ని బోధిస్తూ, నేను మత గురువుగా యున్నప్పుడు వేషధారిగా జీవించానని చెప్తూ వచ్చాను. అంతేకాదు, నావలే దైవ సేవకులంతా మోసగాళ్ళేనని చెప్పాను. నా మంచి పనినిబట్టి రహస్య పోలీసుల్లో మంచి పదవి దొరికింది. ఈ చేతులతో అనేక క్రైస్తవుల్ని హింసించి వారిని చంపి యున్నాను. నేను చేసిన ఇట్టి ఘోర కృత్యములను మరచి

పోడానకు బాగా త్రాగుతున్నాను. గాని ఏమీ లాభం కల్గటం లేదు"
అని నాకు చెప్పాడు.

కమ్యూనిస్టులు ఎందరో ఆత్మహత్యలు చెసికొంటారు. వారి గొప్ప కవీశ్వరుల్లో కొందరు కూడ అలాగే ఆత్మహత్య చేసి కొన్నారు. "ఆనందం" అనే నవల గ్రంథకర్తకే ఆనందం కరువై ఆత్మహత్య చేసి కొన్నాడు. కమ్యూనిస్టు నాయకుల్లో కొందరు కూడా యిలా ఆత్మహత్యచేసికొన్నారు.

వాస్తవంగా చెప్పాలంటే కమ్యూనిస్టులకు ఆనందం లేదు. అలాగే వారిని పరిపాలిస్తున్న అధికారులకు కూడా ఆనందంగా ఉండటం అంటే ఏమిటో తెలీదు. స్టాలిన్ ఎప్పుడూ మనోవ్యాకుల తతో బాధపడేవాడు! దాదాపు తన తోటివారి నందరినీ హత్య గావించాక యిక ఎప్పుడో ఒకప్పుడు తనను కూడా ఎవరో హత్య చేస్తారేమోనన్న భయంతో అతడు జీవించాడు. అతడు పండుకో డానికి ఎనిమిది పడక గదులుండేవి. అవి డబ్బు దాచుకొనే యిన పెట్టెల్లా ఎంతో భద్రత గలవి. అతడు ఏ రాత్రి ఏ గదిలో పండు కొంటాడో ఎవరికీ తెలిసేదికాదు. వంటవాడు తాను వండిన భోజన పదార్థాలన్నీ మళ్ళీ ఆయన సమక్షంలో కొద్దికొద్దిగా తిన్నాక స్టాలిన్ తినేవాడు. కమ్యూనిజం ఎవరికీ ఆనందాన్ని ప్రసాదించదు. వారికి కావలసింది క్రీస్తే.

కమ్యూనిజాన్ని పతనంగానించడంవల్ల దాని పుక్కుహ స్తాల్లో బానిస బతుకులు బతుకుతున్నవారికి మాత్రమేగాక కమ్యూ నిస్టులకు కూడ స్వాతంత్ర్యాన్ని అందివ్వవచ్చు.

ఇట్టి దాస్యశృంఖలాల్లో క్రుగ్గిపోతున వారికి విడుదల కల్గించడమే రహస్య సంఘలక్ష్యం. ఈ సంఘం విశ్వాసంలో వున్నత స్థాయిలో వుంది.

ఒక పర్యాయం ఒక యువ రష్యన్ మిలిటరి ఆఫీసరు హంగరీ దేశంలోని ఒక దైవ సేవకుని ఏకాంతంగా కలిసికో గోరాడు. ఒక ప్రత్యేక గదిలోకి ఇద్దరూ చేరారు. ఎదురుగా గోడ మీద క్రీస్తు సిలువను చూచి ఇట్లన్నాడు:

"ఆ సిలువ శుద్ధ మోసం అని నీకు బాగా తెలుసుగదా? అయినా బోధకులైన మీరు మీ అబద్ధాలతో బీదప్రజల్ని మోసగిస్తూ, సంపన్నులు బీదలను అలా అజ్ఞానంలోనే వుంచేలా వారికి సహాయ పడుతున్నారు. ఇప్పుడు మనల్ని ఎవరూ చూడ్డంలేదు. యేసు దేవుని కుమారుడు కాదన్న సత్యాన్ని రహస్యంగానైనా నావద్ద ఒప్పుకో."

దైవదాసుడు చిరునవ్వుతో, "నవయువకా! అదేమికాదు. యేసు నిజంగా దేవుని కుమారుడు. నేను నమ్మేది కేవలం సత్యం" అన్నాడు.

"ఇట్టి యుక్తులు నాదగ్గర చెల్లవు! నేను ఖచ్చితంగా అడుగు తున్నాను, నవ్వకు" అని చెప్పి తన చిన్న తుపాకి తీసి దైవ దాసుని గుండెలకు ఆన్చి "ఇదంతా కేవలం బూటకమని నువ్వు ఒప్పుకోలేక పోతే నిన్ను చంపేస్తాను" అన్నాడు.

"నే నెన్నటికీ అలా ఒప్పుకోను. మా ప్రభువు నిజంగా దైవ కుమారుడు" అన్నాడు దైవ సేవకుడు.

ఈ మాటలు విన్న వెంటనే అతడు తన చేతిలోని తుపాకీని ఆవతల పారేసి. ఆ దైవ సేవకుని కౌగలించుకొన్నాడు. అతడు కన్నీళ్ళతో "అది సత్యం. ముమ్మాటికీ నా నమ్మకం కూడా అదే. అయితే ఈ సత్యంకోసం మనుష్యులు తమ ప్రాణాల్ని సహా యివ్వగరలని నేను అనుకోలేదు. ఇప్పుడే అది తెలిసికొన్నాను. నీ విశ్వాసంద్వారా నేనెంతో బలపడ్డాను. నేను కూడా క్రీస్తుకోసం ప్రాణాలర్పించడానకు సిద్ధంగా వున్నాను. ఆ దివ్యపథాన్ని నాకు చూపించావు" అన్నాడు.

మరో సందర్భంలో కూడా అలాగే జరిగింది. రష్యనులు రుమేనియాను ఆక్రమించాక ఇద్దరు రష్యా సైనికులు చేతులో తుపాకులతో ఒక క్రైస్తవ దేవాలయంలో ప్రవేశించారు. వారు "మేము మీ విశ్వాసంతో ఏకీభవించలేం ఎవరైతే తమ విశ్వాసాన్ని వదలుకోరో వారిని ఇప్పుడే కాల్చివేస్తాం. తమ విశ్వాసాన్ని వదలు కోడానకు యిష్టపడేవారు కుడి ప్రక్కకు తొలగండి" అన్నారు. అలా మళ్ళినవారిని ఇండ్లకు వెళ్ళాల్సిందని సైనికులు ఆజ్ఞ ఇచ్చారు. వారు తమ ప్రాణాల్ని దక్కించుకోడానికి పారిపోయారు. అప్పుడు ఆ రష్యనులు మిగిలినవారిని కౌగలించుకొని, "మేం కూడా క్రైస్తవులమే, సత్యంకోసం ప్రాణాలర్పించగల విశ్వాస వీరులతోనే మేం సహవాసం చేయకోరుతున్నాం" అన్నారు.

ఈ విధంగా మా దేశంలో మనుష్యులు సువార్తకోసం, స్వాతంత్ర్యం కోసం ఎడతెగక పోరాడుతున్నారు.

ఈ మాటలు వ్రాస్తున్న నేను ఒక మామూలు వ్యక్తిని. నోర్లు మూతబడి మూగవోయిన వారి పక్షాన నేను మాట్లాడు

తున్నాను. వారు తమ సంగతుల్ని పశ్చిమ దేశస్థులకు తెలియజే యలేకున్నారు వారు. వారి పక్షాన మధ్య వర్తిగా మీకీ విషయాలు విన్నవిస్తూ వారెదుర్కొంటున్న సమస్యల్ని గూర్చి మాట్లాడు తున్నాను. వారి కోసం మీరు భారంతో ప్రార్థించాలని మనవి.

మేం కమ్యూనిస్టుల్ని క్రీస్తుకోసం సంపాదించ గలం. అందుకు మొదటి కారణం దేవుడు మా పక్షాన వున్నాడు. రెండు-మేం అందిస్తున్న వర్తమానం మానవుని హృదయాంతరాల్లోని ఆశను తృప్తిపర్చగలదు. మూడు-మా దేశ సంస్కృతి, సంప్రదా యాలు మాకు అనుకూలంగానే వున్నాయ్.

నేనొక కమ్యూనిస్టుతో క్రీస్తును గూర్చి మాట్లాడుతున్న ప్పుడు అతని హృదయాంతరంగలోని నిగూఢమైన అధ్యాత్మికావ సరతలు నాకు చాల సహాయకరంగా వుంటాయి. నా వాదాల్ని అతను సులువుగా ప్రతిఘటించవచ్చు. గాని నా వాదాన్ని బలపరు స్తున్న అతని మనసాక్షిని తాను చంపుకోడం ఏమంత సులువైన సంగతి కాదు.

నాకు తెలిసిన కొందరు నాస్తిక పండితులు తమ ఉపన్యా సాలను సిద్ధపర్చుకోకముందు, సహాయ-కోసం దేవుని ప్రార్థించి సిద్ధపర్చుకొన్న సంఘటనలు కూడా వున్నాయ్! కొందరు కమ్యూ నిస్టులు దూరప్రదేశాలకు వెళ్ళినప్పుడు అక్కడ రహస్య అరాధనల్లో పాల్గొన్నారు వారు పట్టబడ్డప్పుడు అబద్ధాలు చెప్పి తప్పించు కొన్నారు. ఆ తర్వాత చేసిన తప్పుకు పశ్చాత్తాప పడ్డారు.

క్రీస్తు కమ్యూనిస్టుల్ని ప్రేమిస్తున్నాడు మనం తప్పక వారిని క్రీస్తుకోసం సంపాదించాలి. కమ్యూనిస్టు దేశాల్లోని రహస్య

సంఘమే అట్టి పని పటిష్ఠంగా చేయగలదు. వారికి సహాయం చేయడం అందరి సమిష్టి కర్తవ్యం.

## రహస్య సంఘంలోని త్రివిధ వర్గాలు

మొదటిది- కమ్యూనిస్టులు తొలగించిన వేలాది సంఘ కాపరులు. ఇతర పరిచారకులు. వారు కమ్యూనిస్టులతో ఏకీభవించనందున వారు పదవులనుండి తొలగించబడ్డారు. వీరిలో అనేకుల్ని జైల్లో వేసి హింసించారు. విడుదల పొందాక వీరు రహస్య సంఘంలో పనిచేస్తున్నారు. వీరు అనేక అపాయల్లో నున్నా సువార్త ప్రకటించడానకు ముందుకు వురుకుతున్నారు.

రహస్య సంఘంలోని రెండవ గుంపు ఆయా ఉద్యోగాలు చేసికొంటూ గొప్ప సమర్పణతో జీవిస్తున్నా విశ్వాసుల సైన్యం. రష్యాలోను, చైనాలోను నామకార్థపు, నులివెచ్చని, చంచల హృదయులైన విశ్వాసులుండరు. ఎప్పుడూ హింస ద్వారానే క్రైస్తవులు సత్క్రైస్తవులవుతారు. అప్పుడే సాక్షమిచ్చు క్రైస్తవులుగాను, ఆత్మసంపాదకులుగాను వుండగలుగుతారు కమ్యూనిస్టులద్వారా చాలమంది బలమైన విశ్వాసులుగా మారిపోయారు. వారిలాంటి క్రైస్తవుల్ని స్వతంత్ర దేశాల్లో చూడ్డం అరుదే. ఇతరులకు సాక్షమివ్వకుండా ఒక క్రైస్తవుడు ఎలా జీవించగలడని వారడుగుతారు.

క్రైస్తవులు తాము నివసించే గ్రామాల్లో ఇరుగు పొరుగులకు ఎంతో పిరికరమైన జీవిత విధానాన్ని ప్రదర్శిస్తారు పొరుగింటిలో ఎవరైనా ఒక తల్లి జబ్బుపడితే విశ్వాసులు వారి దగ్గరకు వెళ్ళి పరిచర్య చేసి పిల్లల్ని సంరక్షిస్తారు. ఒక పొరుగువాడు జబ్బుపడి కలపకోసం అడవికి వెళ్ళలేకపోతే విశ్వాసులు వెళ్ళి సహాయ

పడుతారు. వారు తమ మాదిరికరమైన జీవితాన్ని ప్రదర్శించి అనే కుల్ని క్రీస్తుకోసం సంపాదించ గలుగుతున్నారు. వీరు ఎక్కడికి వెళ్ళినా సాక్ష్యమిస్తూ ఉంటారు. బజారులో సిళ్ళ పంపుదగ్గర, ప్రతి చోటా సాక్ష్యమిస్తున్నారు. మాంసము అమ్మే క్రైస్తవుడు ప్రతి పొట్లంలో ఒక సువార్తపత్రిక పెట్టి కడతాడు. క్రైస్తవ విద్యార్థులు ఎదో ఒక విధంగా క్రైస్తవ సువార్తల్ని సంపాదించుకొని, తమ ఉపాధ్యాయుల కోటుజెబుల్లో పెడతారు. ఈ విధంగ ప్రతి కమ్యూనిస్టు దేశంలో అనేక రీతుల విశ్వాసులు సువార్త సేవచేసే మిషనరీలుగా వుంటున్నారు.

ఏ హింసచేత కమ్యూనిస్టులు క్రైస్తవ్యాన్ని అణచివేయ జూస్తున్నారో ఆ హింసె అనేక క్రైస్తవ వీరుల్ని ఉద్భవింపజేసి వారు గొప్ప సేవ జేయడానికి కారణమై పోయింది.

## రహస్య సంఘంలోని మూడవ వర్గం

కమ్యూనిస్టుల అధికారం క్రిందనున్న బాహ్య సంఘాల్లోని కొందరు కాపరులు, పరిచారకులు దినిలో వున్నారు. వీరు బాహ్య సంఘంలో నుంటూ రహస్య సంఘంలొ కూడ సేవ చెస్తూన్నారు. ఈ సంఘ కాపరులు తమ చిన్న ప్రార్థనాగదుల లోపలనేగాని బయట క్రీస్తును గూర్చి బోధించడానకు సెలవులేదు. బాలల కోసం యువజనుల కోసం ప్రత్యేక కూటాలు పెట్టడానికి వీల్లేదు. విశ్వాసుల దగ్గరకు వచ్చుటకు క్రైస్తవేతరులు భయపడతారు. గృహాల్లో జబ్బుపడిన తమ సంఘ సభ్యుల్ని దర్శించి వారికోసం ప్రార్థించడానికి సెలవులెదు. అనెక నిర్బంధాలతో సంఘానికి సంకెళ్ళు వేసినందున దానికి స్వాతంత్ర్యం లెదు.

కమ్యూనిస్టులు ఇన్ని విధాలైన కట్టుదిట్టాలు పెట్టినా కూడ రహస్య సంఘం ఎన్నో శ్రమలలుభవిస్తూ ముందుకు సాగి పోతోంది. ఈ కాపరులు రహస్యంగా బాలల మధ్యను, యువ జనుల మధ్య సేవ చేస్తున్నారు. రహస్యంగా వీరు క్రైస్తవ గృహాల్లోకి ప్రవేశించి సువార్త నందిస్తున్నారు. రహస్యంగా కర పత్రాన్ని దేవునికోసం ఆకలిగొన్న ప్రజలకు అందిస్తున్నారు. పైకి వారు సర్కారు వారికి విధేయులైనట్లు కనబడినా ఎంతటి అపాయా నైనా ఎదుర్కోడానికి సహా సిద్ధపడి రహస్యంగా వాక్య పరి చర్య చేస్తున్నారు. ఇటువంటి వారిని అనేకుల్ని నిఘావేసి రష్యా అధికారులు పట్టుకొని బంధించారు.

కమ్యూనిజం ఓడిపోయే పర్యంతం రహస్య సంఘం జీవి స్తూనే వుంటుంది. కొన్ని దేశాల్లో ఒక వర్గాన్నిమించి మరోవర్గం గొప్పగా పనిచేస్తోంది. ఎలాగైనా అవిఅన్నీ గొప్ప అపాయంలో నుంటూనే క్రీస్తు కోసం పనిచేస్తున్నాయ్.

కమ్యూనిస్టు దేశాల్లో రహస్యంగా సేవ చేయాల్సివున్న సంఘానికి "రహస్య సంఘమ"ని కమ్యూనిస్టులే నామకరణం చేశారు. రహస్య సంఘ సభ్యులు ఆ పేరుతో పిలిపించుకోడానికి యిష్టపడరు. వారు తాము క్రైస్తవులమనీ, విశ్వాసులమనీ, దేవుని పిల్లలమనీ చెప్పుతారు ఏ పేరైనా పర్వాలేదు. వారు గొప్ప సేవ చేస్తున్నారు.

# 11
# రష్యాదేశ విశ్వాసులు

రష్యాను పటాలంలోను, కమ్యూనిస్టు రుమానియాలోను ఎలా మేం రహస్యంగా క్రీస్తు సువార్తను అందించామో నేను చెప్పియున్నాను. ఇప్పుడు రష్యాలో సేవ చేస్తున్న రహస్య సంఘాన్ని గూర్చి కొంత చెప్పగోరుతున్నాను. కమ్యూనిస్టులు సుమారు 50 సంవత్సరాలు ప్రభుత్వం చేసారు. అయితే వారి జయం అపజయమే. గెలిచింది క్రైస్తవ సత్యమే గాని కమ్యూనిజం కాదు. రష్యా వార్తా పత్రికల్లో రహస్య సంఘాన్ని గూర్చి తరుచుగా వ్రాస్తున్నారు. ఈ సంఘం ఇప్పుడు బలపడి కొంత మట్టుకు బాహ్యంగా కూడ పనిచేస్తూ కమ్యూనిస్టుల్ని వణికిస్తుంది.

1966 సం॥ నవంబర్ 7వ తేదీన, సుహుమి అను పట్టణంలో రహస్య సంఘం ఒక గొప్ప బహిరంగ కూటాన్ని జరిగించింది. ఇతర పట్టణాలనుండి అనేక విశ్వాసులు ఈ సభకు హాజరైయ్యారు. బోధకుడు రక్షణ కొఱకైన ఆహ్వాన మివ్వగా 47 మంది యౌవనస్థులు ముందుకు వచ్చి క్రీస్తును అంగీకరించి, సముద్రంలో బాప్తిస్మ సాక్ష్యమిచ్చారు. ఇది ఆది సంఘ ఆరంభ కాలంలో జరిగినట్లే జరిగింది.

1966సం॥ ఆగస్టు 28 తారీఖున రాస్టావ్ అను పట్టణంలో బాప్టిస్టు సంఘస్థులు, కమ్యూనిస్టులచే నియమితులైన సంఘ నాయకులకు లోబడక వీధిలో బహిరంగ ఊరేగింపు చేసారా. పదిహేను వందలమంది విశ్వాసులు వీధులోకి వచ్చారు. వారికి వచ్చే కష్టాల్ని

కూడా లెక్కచేయక వారు వచ్చారు. ఇందువల్ల జైల్లో ఆకలిబాధ, చిత్రహింసల్ని అనుభవించాల్సి వుంటుందని తెలిసికొని కూడా వచ్చారు. క్రీస్తు ప్రేమే వారిని అలా బలవంత చేసింది. ఒక చిన్న ఇంటిముందు పెద్ద గుంపు చేరింది ఆ స్థలమంతా జనసమర్ధంగా క్రిక్కిరసి వుంది కొందరు ఇంటి కప్పుమీదా మరికొందరు జక్కయ్యలా చెట్లమీదా ఎక్కి కూర్చున్నారు. ఆ దినం ఎనభై మంది రక్షింపబడ్డారు ఇందులో ఇరవై ముగ్గురు కమ్యూనిస్టు యువజన సంఘంలోని సభ్యులు.

విశ్వాసులంతా పట్టణ వీధుల్లో నడుస్తూ నదివరకూ వెళ్ళారు. తర్వాత అక్కడ బాప్తిస్మపు కార్యక్రమం జరిగింది ఇలా జరుగుతుండగా కమ్యూనిస్టు పోలీసులు నదీ తీరానికి వచ్చి విశ్వాసుల చుట్టూ నిలిచారు అక్కడ వున్న 1500 మందిని పట్టుకోలేక విశ్వాసుల్లో నాయకుల్ని పట్టాలని ప్రయత్నం జరుగుతుండగా అందరూ మోకాళ్ళమీద పడి దేవుని ప్రార్థించారు ఆ నాయకులు సురక్షితంగా ఆ ప్రమాదం నుండి తప్పించుకోగలిగారు. ఆ పట్టణంలో రహస్య సంఘానికి ఒక ముద్రాక్షరశాల వుందని అక్కడ అనేక పుస్తకాల సిద్ధమవుతున్నాయని తెలిసింది.

మాస్కో నగరంలో కూడ విశ్వాసులు నిర్వహించిన బహిరంగ సభను గూర్చి నేను చదివాను. 501 మంది సౌవార్తిక బాప్టిస్టు విశ్వాసులు, మాస్కోలోని కమ్యూనిస్టు పార్టీ అధికారుల్ని కలసి వారికి తమ వినతి పత్రాన్ని అందజేయడానికు 16తేది, మే నెల, 1966వ సం॥లో బయలదేరి వెళ్ళారు. వారు పార్టీ జనరల్ సెక్రటరీ బ్రెజ్‌వాన్‌కు వినతి పత్రాన్ని అందించారు. అక్కడకు వెళ్ళిన 500 మంది దినమంతా పార్టీ కార్యాలయం బయట నిల

బడే వుండిపోయారు. మాస్కో పట్టణంలో కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి బహిరంగ సమావేశం యిదే. ఇది రహస్య సంఘ నాయకులు జరిపించారు. సాయంత్రం వరకూ కని పెట్టి మరో వినతిపత్రాన్ని బ్రెజ్‌నావ్‌కు వ్రాసి ఒక మధ్యవర్తితో పంపించారు అధికారుల అనుమతికోసం నిరీక్షిస్తూ ఈ 500 మంది ప్రతినిధులు ఆ రాత్రి అంతా వీధుల్లోనే గడిపారు. ఆ మార్గాన మోటారుకార్లలో వెళ్ళేవారు ఆగి ఈ విశ్వాసుల్ని సమీపించి, దుమ్ము, బురద వారిమీదికి విసరి అవమానపర్చారు. వారికింత బాధవున్నా రాత్రి అంతావర్షంలో ఆఫీసుముందు గడిపారు. మరు సటి దినాన 28 పోలీసు బస్సులో వచ్చాయి. వెంటనే విశ్వాసు లంతా ఒకరి చెతులు ఒకరు పట్టుకొని పాటలు పాడారు. అప్పుడు పోలీసులు పెద్దా చిన్నా విచక్షణ లేకుండా వారినందరినీ నిర్దాక్షి ణ్యంగా కొట్టనారంభించారు. కొందర్ని జుట్టుపట్టుకొని బస్సుల్లోకి యీడ్చుకెళ్ళారు. మరికొందర్ని ముఖాల మీద వీపులమీద కొట్టి వీధిలో పడివేసారు. ఇలా హింసించాక వారి నందర్నీ బస్సుల్లోకి ఎక్కించి ఎక్కడికో తీసుకుపోయారు. వీధుల్లోనుంచి బస్సులు వెళ్తుంటే విశ్వాసులు వాటిలోనించి పాటలు పాడ్డం మొదలెట్టారు అనేకులు చూస్తుండగా ఈ దుస్సంఘటన జరిగింది.

దీనికంటె మరీ దివ్యమైన సంగతి ఒకటి జరిగింది.ఆ 500 మంది విశ్వాసుల్ని హింసించి నిర్బంధంలోకి తీసికున్నాక ఇద్దరు సహోదరులు ధైర్యంగా కమ్యూనిస్టు పార్టీ కార్యాలయానికి వెళ్ళి 500 మంది విశ్వాసుల ఆచూకీ చెప్పమన్నారు. వారిని తక్షణం విడుదల చేయాలని పట్టుబట్టారు. ధైర్యశాలులైన ఆ సహోదరులు అప్పటినుండి ఏమైపోయారో ఎవరికీ తెలీలేదు. కొంత కాలానికి వారు జైల్లో వున్నట్లు తెలిసింది.

రహస్య సంఘంలోని ఈ క్రైస్తవులకు ఏమైనా భయ ముందా? లేదు. నిర్బంధంలో లేని కొందరు కలసి ఒక కూటం జరిగించారు. అందులో బైబిల్లోని బంగారు వచనాల్ని వుదహరిస్తూ ఉపన్యసించారు. క్రింది వచనాలు వారిని ఎంతో ఆదరించాయి: "క్రీస్తును నమ్ముకోడం మాత్రమేగాక క్రీస్తుపక్షాన బాధ అనుభ వించడం కూడా దేవుడు క్రీస్తుకోసం మీకు ప్రసాదించాడు" (ఫిలిప్పి 1:30). "మీలో ఎవరూ ఈ కష్టాలవల్ల కలవరపడకుండా దేవుని మీదవున్న విశ్వాసం విషయంలో మీకు బలం కలగాలి కష్టాలు అనుభవించడం మన విధి అని మీకు తెలుసు. (1 థెస్స 3:3). మనలో నమ్మకాన్ని పుట్టించేవాడు. దాన్ని కార్యసాధకం చేసేవాడూ ఆయనే. కావున యేసునైపు చూస్తూ మన ముందున్న పందెం సహనంతో పరుగెత్తుదాం." (హెబ్రీ 12:2). వారీ సత్యాల మేరకు జీవించ నిశ్చయించుకొని విశ్వాసులంతా అలాగే జీవించా లని ప్రోత్సహించారు.

కమ్యూనిస్టులు నాస్తికత్వమనే విషంచేత యువజనుల హృదయాల్ని పాడుచేయడం విశ్వాసులు చూచి రాస్టావ్‌లోను, మాస్కోలోనూ, ఇంక అనేక స్థలాల్లోను బహిరంగంగా దీన్ని ఖండించారు. వీరు రష్యా నాస్తికుల్ని, నామకార్థ క్రైస్తవ నాయ కుల్నీ ఖండిస్తూనే వున్నారు. అనేక విధాలుగా విశ్వాసులు పని చేస్తున్నారు. రేడియోద్వారా ప్రసారం అవుతున్న సువార్త సందే శాల్ని వినడానికి తమ ఇరుగు పొరుగుల్ని ఒక చోటికి సమావేశ పరుస్తారు. ఈ సందేశాల్ని టేప్ చేసి దాన్ని యింకా అనేకులకు అందజేస్తారు. ఆది సంఘ కాలంలో విశ్వాసులు ఎలా గుహల్లో సమావేశమై ఆరాధించేవారో అలాగే రహస్య సంఘం కూడ నేటి ఆధునిక యుగంలో చేయాల్సివస్తోంది.

రహస్య సంఘస్థులు సువార్త పత్రికల ప్రతులు ముద్రించి ఆయా స్థలాల్లో తిరిగి పంచిపెడతారు. విశ్వాసులు వీధుల్లో, రైల్వే స్టేషన్లలో, రైళ్ళలో, బస్సుల్లో సర్కారు సంస్థల్లో సహా సువార్త బోధింప తెగిస్తున్నారు.

ఓసారి ఒక రైల్లో ఏడుగురు యువకులు కలిసి ఒక క్రైస్తవ పాట పాడారు. వారు అలా పాడినందుకు, వారిని న్యాయ స్థానానికి పిలిపించి శిక్షాపాత్రులుగా ఎంచారు. అప్పుడు ఆ న్యాయ స్థానంలోనే వారు మోకాళ్ళని ఈలా ప్రార్థించారు. "మమ్మును మేము దేవునికి అప్పగించు కొంటున్నాం, మేం నమ్మినదాని కోసం శ్రమ అనుభవించే భాగ్యం మాకు అనుగ్రహించినందుకు, ప్రభువా, నీకు స్తోత్రాలు."

ఏ జైలుగాని ఏ హింసగాని రహస్య సంఘాన్ని బెదరించ లేవు. ఆది సంఘ కాలంలో లాగానే హింస లోతైన అనుభవానికి, సంపూర్ణ సమర్పణకు దోహదం చేస్తోంది. రహస్య సంఘంలోని ఒక నాయకుణ్ణి మూడుసార్లు జైల్లో వేసినా విడుదల పొందగానే యథావిధిగా రహస్య ఆదివార బడల్ని నడిపిస్తూ వచ్చాడు. "మానవ చట్టానికి అనగా కమ్యూనిస్టు నిర్బంధాలకు తలొగ్గి బాహ్య సంఘం దేవుని దీవెనల్ని కోల్పోయింది" అని ఈ సోదరుడు వ్రాశాడు.

రష్యా జైళ్ళు పశ్చిమ దేశాల్లోని జైళ్ళలా వుండవు. రష్యా జైళ్ళు పస్తులు పెట్టడం, శరీరక, మానసిక హింసలు పెట్టడంలో పేరు ప్రఖ్యాతులు గడించాయి.

శాస్త్రులు పరిసయ్యులు ఎలా ద్రోహం చేసి యేసును పిలాతుకు అప్పగించారో, అలాగే "బాప్టిస్టు" మతాధికారులు క్రీస్తు

సంఘాన్ని భంగపర్చి అనేక స్థలాల్లో విశ్వాసుల్ని నామరూపాలు లేకుండా చేసినట్లు కులందా పట్టణంలోని విశ్వాసులు ప్రచురించారు. అయినా రహస్య సంఘం మాత్రం దీక్షగా దేవుని సేవ చేస్తూ ముందుకు సాగిపోతున్నది.

క్రీస్తుకోసం కమ్యూనిస్టుల్ని సంపాదించ గలమని నేను చెప్పిన సంగతి సత్యమేనని వారే ఒప్పుకోవాల్సి వచ్చింది. వారిని తప్పక సంపాదించగలం. అనేక కమ్యూనిస్టు యువకుల్ని ప్రభువు వైపు త్రిప్పిన ఒక సహోదరుడు ఖైదులో వేయబడ్డాడు. ఆయన తన ప్రసంగ వ్యాసంలో ఇలా వ్రాసాడు— "ఆది క్రైస్తవుల్లాగానే మనం కూడ మన రక్షకునిలో విశ్వాస ముంచాలి. మనల్ని నడిపించు చట్టం బైబిలే. దానికి విరుద్ధమైన వేరేదాన్ని మేం ఒప్పుకోం. పాపుల్ని, ముఖ్యంగా యౌవనుల్ని క్రీస్తుకోసం రక్షించ డానకు మనం త్వరపడాలి."

ఒక కమ్యూనిస్టు పత్రికలో ఇలా వ్రాశారు. "యువజనులు, బాలబాలికలు- వారు కమ్యూనిస్టు యువజన సంఘంలో సభ్యులై యుండీ స చ్చమైన క్రైస్తవులుగా మారిపోతున్నారు. కమ్యూనిస్టు విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అసమర్థత వల్ల క్రైస్తవ పాస్టర్లు అనేక మంది శిష్యుల్ని నిర్బంధంగా తీసికొని పోతున్నారు.

క్రైస్తవ తల్లుల కోసం ప్రచురించబడిన ఒక పత్రికను గూర్చి ఒక వార్తాపత్రికలో యిలా వుంది. మన పసిబిడ్డలు ఉయ్యాల్లో ఉన్నప్పుడే వారి జీవితాల్ని దేవునికి అర్పిద్దాం. లోక వుచ్చుల్లో వారు చిక్కి పోకముందే వారిని రక్షించుదాం."

ఈ ప్రయత్నాలు ఫలించాయ్! దీన్ని కమ్యూనిస్టు పత్రికలే ఋజువు పరుస్తున్నాయ్. క్రైస్తవ్యం యువజనుల్ని విశే

షంగా ఆకర్షిస్తోంది. యువకులు అనేకులు కమ్యూనిజాన్ని విడిచి జీవితాంతం క్రీస్తును సేవించ తీర్మానించుకొన్నారు.

రహస్య సంఘ క్రైస్తవులు కమ్యూనిస్టు కోర్టుల్లోకి కొని పోబడినపుడు వారు జవాబులు యిచ్చిన తీరు అమోఘం. ఒక న్యాయాధిపతి ఇట్లన్నాడు— "నిషేధించబడ్డ మీ సమాజాల్లోకి మీ రెందుకు ఇతరుల్ని ఆకర్షిస్తున్నారు?" అందుకు ఒక క్రైస్తవ సోదరి "లోకమంతా క్రీస్తుకోసం సంపాదించడమే మా లక్ష్యం" అని ప్రత్యుత్తర మిచ్చింది. మరో న్యాయాధిపతి నిర్బంధంలో వున్న విద్యార్థితో ఇట్లన్నాడు. "మీ మతం పూర్తిగా శాస్త్ర విరుద్ధం." దానికి ఆ విద్యార్థి "శాస్త్రజ్ఞులు ఐన్‌స్టయిన్, న్యూటన్‌ల కంటే నీకు శాస్త్రము ఎక్కువ తెలుసా? దేవుడున్నాడని వారు నమ్మారు మన ప్రపంచం ఐన్‌స్టయిన్ పేరుతో పిలువ బడుతోంది. ఇది నేను ఉన్నత పాఠశాల్లో చదివినప్పుడు నేర్చుకొన్నాను. సాంఘిక జీవనాన్ని సవరించడానకు యూద ప్రవక్తలు బోధించిన సత్యము, ఆ వెనుక యేసు బోధించిన క్రైస్తవ్యమే శరణ్యం ఈ పవిత మతలక్ష్యసిద్ధికి ప్రతి వ్యక్తి తన శక్తి కొద్దీ శ్రమించాలి అని ఐన్‌స్టయిన్ వ్రాసాడు. మన ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు పావ్‌లోవ్ మాటేమిటి? మన గ్రంథాల ప్రకారం ఆయన క్రైస్తవుడే గదా? "డాస్ కాపిటల్" అనే గ్రంథానికి పీఠిక వ్రాస్తూ మార్క్స్ సహా ఈలాగన్నాడు— "క్రైస్తవ్యం ముఖ్యంగా ప్రొటెస్టాంట్ క్రైస్తవ్యం, పాపంచేత పతనమైన మానవ స్వభావాన్ని సముద్ధరించడానకు శక్తి గలది." పాపంచేత పతనమైన స్వభావం నాకుంది. దాన్ని చక్క చేసుకోడానకు నేను క్రీస్తు నంగీకరించాలని మార్క్స్ ద్వారా నేర్చుకున్నాను. నేను అలా చేసినందుకు మార్క్స్ అనుచరులైన మీరు ఎలా నాకు తీర్పు చెప్తారు?

ఆ న్యాయధిపతి మౌన ముద్రాంకితుడయ్యాడు. మౌనం అర్ధాంగీకారం అని మనం గ్రహించవచ్చు.

మరోసారి క్రైస్తవ్యం శాస్త్ర విరుద్ధమని ఒక న్యాయాధిపతి ఒక విశ్వాసితో కమ్యూనిస్టు కోర్టులో అన్నాడు. అందుకా విశ్వాసి "క్లోరో ఫార్మ్‌ను ఇంకా అనేక ఇతర మందుల్ని కనిపెట్టిన శాస్త్రజ్ఞుడు సింసన్ కంటె మీరు గొప్ప శాస్త్రులు కారని నా నమ్మకం. తాను కనుగొన్న వాటన్నిటిలో గొప్పదేదని ఆయన్ని అడిగితే 'అది క్లోరోఫార్మ్ కాదు. గాని నేనొక పాపిననీ దేవుని కృపవల్ల మాత్రమే రక్షణ నొందగలననీ నేను కనుగొన్నాను." అని జవాబిచ్చాడు.

రహస్య సంఘాలు తమ విశ్వాసం నిమిత్తం ప్రాణత్యాగానికి సిద్ధమైనాయి. క్రైస్తవ పరిచర్యలన్నింటిలొకెల్లా ఇదే ఉత్కృష్టం ఈ సంఘం తన రక్షకుని ప్రేమాపాశాలతో బందీ అయిపోయింది. ఈ ప్రేమచేత యికవరూ బందీలై పోయారు. ప్రపంచంలో ఎవరూకూడా వీరిని జయించలేరు.

రహస్య సంఘం వెలువరించిన ఒక ఉత్తరంలో యిలా వుంది. సత్ క్రైస్తవుల మవ్వాలని మేం ప్రార్థించడంలేదు. కాని మేం ఎలాంటి క్రైస్తవులం కావాలని దేవుడు కోరుతున్నాడో అలాంటి క్రైస్తవులం కావాలని ప్రార్థన చేస్తున్నాం. అందే దేవుని మహిమకోసం సంతోషంతో సిలువ మోసే క్రైస్తవులం కావాలని కోరుకొంటున్నాం."

## రహస్య సంఘానికి అధిక హింసలు

రష్యాలో అన్ని మతాలవారూ హింసలకు గురౌతున్నారు. గాని అందరికంటె ఎక్కువ హింస రహస్య సంఘ క్రైస్తవులే

పొందుతున్నారు. వారు అనుభవించాల్సిన హింసలన్నిటికంటె బాధా కరమైంది. ఏమంటే- ఎవరైనా తమ పిల్లలకు క్రీస్తును గూర్చి నేర్పిస్తున్నట్లు కనబడితే చాలు వెంటనే ఆ బిడ్డల్ని కమ్యూనిస్టులు లాక్కొని వెళ్ళిపోతారు. ఇక మరెప్పుడూ ఆ తల్లిదండ్రులకు ఆ పిల్లలు కనబడరు. 4 జూన్ 1963 రష్యా వార్తాపత్రిక ప్రకారం కమ్యూనిస్టులు ఒక బాప్టిస్టు స్త్రీయొక్క ఆరుగురు పిల్లల్ని లాక్కొని వెళ్ళిపోయారు. కారణం ఆమె వారికి క్రైస్తవ విశ్వాసాన్ని నేర్పిస్తోంది. మరో దినపత్రికలోని వార్త ప్రకారం ఒక విశ్వాసి, అతని భార్య ఒక న్యాయాధిపతి యెదుట నిలబెట్టబడ్డారు. వారు తమ విశ్వాసాన్ని వదులుకోవాలని అతడు వారికి ఆజ్ఞాపించాడు వారు వినలేదు. అప్పుడతడు "మీకు దేవుడు కావాలో మీ కుమార్తె కావాలో కోరుకోండి. మీ కేంకావాలో మీరే చెప్పండి. దేవుడే కావాలా?" అన్నాడు. అందుకు వారు "ఔను. మేం క్రీస్తును విడిచి పెట్టం" అన్నారు. అందువల్ల కమ్యూనిస్టులు వారి కుమార్తెను లాక్కొన్నారు.

అధికారులు విశ్వాసులైన తల్లిదండ్రుల పిల్లల్ని తీసికొని కమ్యూనిస్టు పాఠశాలల్లో వుంచి వారికి నిర్బంధంగా నాస్తికత్వాన్ని బోధిస్తారు. అయితే పౌలు వ్రాసినట్లు "దేవుని ప్రేమించువారికి మేలు కలిగేలా సమస్తం సమకూడి జరుగుతోంది." ఈ బిడ్డలు నాస్తిక విద్యా కేంద్రాల్లో సహా తమ మంచి సాక్ష్యంద్వారా, ఇంటివద్ద గతంలో నేర్చుకొన్న విషయాలు తమతోటి విద్యార్థులకు చెప్పుతున్నారని నేను విన్నాను. నాస్తికత్వం వారిని మార్చలేక పోయింది.

ఒకడు తన పిల్లలకంటె ఎక్కువగా క్రీస్తును ప్రేమించక పోతే క్రీస్తు శిష్యుడుకాడన్న మాటల భావాన్ని కమ్యూనిస్టు

దేశాల్లోని విశ్వాసులు బాగా గ్రహిస్తున్నారు. ఇట్టి హింసలు ప్రొటె స్టాంట్ క్రైస్తవులకే కాదు గాని రష్యను అర్థొడాక్స్ క్రైస్తవులకు కూడ సంభవిస్తున్నాయ్. వీరిలో నుండి కూడా లక్షలాది క్రైస్త వులు జైళ్ళకు పంపబడ్డారు. అక్కడ వారికి జపమాలలులేవు. సిలువలులేవు, పటాలు, విగ్రహాలు వారికిలేవు. సాంబ్రాణి లేదు. మైనపు వత్తులు లేవు. మతగురువు కూడ లేడు. గురువులున్నా వారికి నిలువు టంగీలులేవు, గోధుమరొట్టె లేదు. ప్రతిష్ఠించడానకు ద్రాక్షారసంలేదు, పవిత్ర తైలంలేదు, సంఘారాధన, ప్రార్థన పుస్తకాలు లేవు. ఇవన్నీ లేకుండానే నేరుగా దేవుని దగ్గరకు వెళ్ళ గలమన్న గొప్ప సంగతిని వారు యిప్పుడు జైల్లో నేర్చుకొన్నారు. వారు ప్రార్థింప మొదలు పెట్టినప్పుడు దేవుడు తన ఆత్మను క్రుమ్మ రించ నారంభించాడు. వారిలో అనేకులు ఆత్మ సంబంధంగా మేల్కొని ఉజ్జీవంతో ముందుకు సాగిపోతున్నారు.

వీరిలోనుండి కూడ రహస్య సంఘ మేర్పడింది.అర్థొడాక్స్ సంఘంలో చాలామంది విశ్వాస వీరులు హతసాక్షులైనారు.కమ్యూ నిజం రష్యా దేశంలో 60 సంవత్సరాలుగా అధికారంలో వున్నా జయం రహస్య సంఘానిదే. చెప్పనశక్యంగాని శ్రమల్లోవున్నా ఈ సంఘం దినదిన ప్రవర్ధ మానమౌతోంది.

కమ్యూనిస్టు ప్రపంచాన్ని క్రీస్తుకోసం సంపాదింప వీలుంది. వారంతా క్రైస్తవులౌతారు. ఈ రహస్య సంఘం రష్యాలోను, చైనాలోను అనేక కమ్యూనిస్టు రాజ్యాల్లోను వర్ధిల్లుతోంది.

భయంకర పరిస్థితుల్లో నుంటూ తమ ఆధ్యాత్మిక సౌంద ర్యాన్ని నిరూపిస్తూ మనతోటి విశ్వాసులు వ్రాసిన లేఖలు క్రింద ఉదహరిస్తున్నాను. ఇవి రష్యా దేశంలో వ్రాసినవి. అఖరు రెండూ జైలునుండి వచ్చాయి.

వారియ అను కమ్యూనిస్టు యువతి క్రీస్తును కనుగొని ఆయన కోసం సాక్ష్యమిచ్చినందుకు బానిస పిల్లగా మారిపోయిన విధం:

ఈ క్రింది ఉత్తరాల్లో మొదటి మూడూ వారియను క్రీస్తు నొద్దకు నడిపించిన మరియ అనే క్రైస్తవ యువతి వ్రాసినవి.

## మొదటి ఉత్తరం

"నే నిక్కడె వుంటున్నాను. కమ్యూనిస్టు యువజన సమాజంలో ఉన్న ఒక యువతి నాకు మంచి స్నేహితురాలై పోయింది. ఆమె నాతో ఏం చెప్పిందంటే- నీవెంత గొప్ప వ్యక్తివో నేను గ్రహింపలేకున్నాను. ఇక్కడ అందరూ నిన్ను దూషిస్తున్నా,నీకు కీడు తలపెడుతున్నా నీవు మాత్రం అందర్నీ ప్రేమిస్తున్నావు." "స్నేహితుల్ని మాత్రమేగాక శత్రువుల్ని కూడ మేం ప్రేమించాలని దేవుడు మాకు నేర్పాడు." అని నేను ఉత్తర మిచ్చాను. ఈ అమ్మాయి పూర్వం నాకెంతో కీడుచేసింది. అయితే నేను ఆమె కోసం అధిక అసక్తితో ప్రార్థించాను. తనను కూడా నేను ప్రేమింపగలనో లెనో అని ఆమె నన్నడిగింది. నేనామెను కౌగలించుకొన్నాను. అప్పుడు మేమిద్దరం ఎంతో ఏడ్చాం. అప్పటి నుండి మేమిద్దరం కలిసి ప్రార్థించడం మొదలు పెట్టాం.

"ఆమెకోసం మీరు ప్రార్థించండి. ఆమె పేరు వారియ.

"దేవుడులేడని గట్టిగా చెప్పేవారి మాటలు వింటుంటే వారు నిజంగా అదే సిద్ధాంతాన్ని నమ్ముతున్నట్లు అనిపిస్తుంది. అయితే వారి జీవితాల్ని గమనిస్తే వారు తమ పెదవులతో దేవుని దూషిస్తున్నా, వారి హృదయాల్లో దేవుని కోసం ప్రగాఢవాంఛ ఏదో

వున్నట్లు వారి హృదయ మూల్గులే నిదర్శనం. వారు దేన్నో వెదకు తున్నారు. కాని తమ హృదయాల్లోని శూన్యతను దౌష్టంతో నింపుకోజూస్తున్నారు.

క్రీస్తునందు నీ సోదరి.
మరియ.

వరెండ ఉత్తరం

నా మొదటి ఉత్తరంలో నాస్తిక యువతి వారియను గూర్చి వ్రాసాను. నాకు కలిగిన మహా ఆనందాన్ని గూర్చి నా ప్రియ స్నేహితులైన మీకు వ్రాయాలని వేగిరి పడుతున్నాను. వారియ క్రీస్తును తన స్వంత రక్షకునిగా అంగీకరించి ఇప్పుడు ఆయన్ని గూర్చి అందరికి సాక్ష్యమిస్తోంది.

క్రీస్తును విశ్వసించి, రక్షణానందంలో సాగిపోతున్న సమయంలో ఆమెకు ఎంతో విచారం కూడ కలిగేది. ఎందుకంటే అంత వరకూ దేవుడు లేడని ఆమె అందరికి ప్రచారం చేస్తూ వుండేది. అప్పుడు ఆమె చేసిన దోషానికి నిష్కృతిగా ఇప్పుడు నాస్తిక వ్యతిరేక ప్రచారం చేయడానికి తీర్మానించుకొన్నది.

నిర్దేవుల సమాజ కుటానికి నేను వారియతో వెళ్ళాను. ఎవ్వరితోను విస్తరించి మాట్లాడవద్దని ఆమెను నేనెంత హెచ్చరించినా లాభం లేకపోయింది. వారియ ఆ కూటానికి వెళ్ళింది. ఏమి జరుగుతుందో చూడ్డానకు ఆమెతోకూడ నేను వెళ్ళాను. కమ్యూనిస్టులంతా కలిసి ఒకపాట పాడారు. వారియ ఆ పాట పాడలేదు. అంతట ఆమె మాట్లాడ్డానికి సెలవడిగింది. తన వంతు వచ్చినప్పుడు ఆమె ముందుకువచ్చి అందరి యెదుట నిలబడింది. ఎంతో ధైర్యంతోను, ఉద్రేకంతోను క్రీస్తు తన్ను రక్షించాడని అందరికి సాక్ష్యమిచ్చింది. అంతకు మునుపు తనను నోనేత్రాలు

మూతబడిపోయినందున తాను నాశన మార్గాన పయనించడం మాత్రమే గాక అనేకుల్ని ఆ మార్గానికి మళ్ళించినందుకు తన పూర్వస్నేహితు లందరికి క్షమార్పణ చెప్పుకొంది. వారంతా పాప మార్గాన్ని విడిచి క్రీస్తు దగ్గరకు రావలసిందని బ్రతిమాలింది.

అంతా నిశ్శబ్దంగా విన్నారు. ఎవ్వరు ఆమెను ఆటంక పరచలేదు. ఆమె మాట్లాడాక "చనిపోయిన క్రీస్తును ప్రకటించ డానకూ, ఆయన ఆజ్ఞల్ని ఆయన సిలువ శక్తినీ ప్రచురించడానకూ నేను సిగ్గుపడను" అనే కీర్తన మధురాతి మధురంగా పాడింది.

తరువాత వారు వారియను కూడా తీసికొని వెళ్ళిపోయారు. ఈ వేళ మే నెల 8వ తారీఖు నేటికీ ఆమెను గూర్చిన సమా చారం మాకేమీ తెలీదు. ఆమెను కాపాడ్డానికి దేవుడు సమర్థుడు. ప్రార్థించండి.

మీ సోదరి, మరియ.

## మూడవ ఉత్తరం

నిన్నటి దినం అనగా ఆగస్టు రెండో తారీఖున ఖైదులో నున్న మన ప్రియ వారియతో మాటలాడ గలిగాను. ఆమెను గూర్చి ఆలోచిస్తుంటే నా హృదయం బ్రద్దలైపోతోంది. ఆమె యింకా చిన్నవయస్కురాలే. ఆమె వయస్సు 19 సంవత్సరాలు. ప్రభువునందలి విశ్వాసంలో కూడా ఆమె యింకా పసిబిడ్డే అయితే ఆమె ప్రభువును తన పూర్ణ హృదయంతో ప్రేమిస్తూ ఆరంభం నుండీ కఠినమైన ఇరుకు మార్గాన నడుస్తోంది. నిర్భాగ్యురాలు ఎప్పుడూ ఆకలితో ఉండేది. ఆమె ఖైదులో వుందని విన్నాక ఆమెకు కొన్ని వస్తువులు బంగీలలో పంపాం. కాని ఆమెకు పంపిన వస్తువులో కొన్ని మాత్రమే ఆమెకు అందాయి.

నిన్నటి దినాన నేను ఆమెను చూచినప్పుడు ఆమె చిక్కి పోయి, ముఖం పాలిపోయివుంది. ఒళ్ళంతా దెబ్బలు. ఆమె కన్నులు మాత్రం దేవుని సమాధానంతో పరసంబంధమైన సంతోషంతో ప్రకాశిస్తున్నాయి.

స్నేహితులారా, క్రీస్తు ఇచ్చే అద్భుత సమాధానాన్ని అనుభవించనివారు అది ఎలావుంటుందో గ్రహించలేరు. ఆ సమాధానాన్ని అనుభవించేవారు ఎంత ధన్యులు! క్రీస్తులోవున్న వారిని ఎలాంటి శ్రమలైనా, ఆటంకాలైనా అడ్డగించబోవు.

ఖైదు ఇనుప కడ్డీలనించి "వారియా! నీవు చెసినపనికి విచార పడుతున్నావా?" అని నేను అడిగాను. ఆమె "లేదు. వారు నన్ను విడుదల చెస్తే మళ్ళీ నేను వారి దగ్గరకే వెళ్ళి క్రీస్తుఅద్భుత ప్రేమను గూర్చి ప్రకటిస్తాను. నేను బాధపడుతున్నానని తలంచకు. ప్రభువు నన్ను ఎక్కువగా ప్రేమించి తన నామ మహిమార్థం శ్రమల్ని సహించడానకు అవకాశ మిస్తున్నాడని సంతోషిస్తున్నాను." అని ప్రత్యుత్తర మిచ్చింది.

ఆమెకోసం హృదయ పూర్వకంగా మీరు ప్రార్థించాలని నేను వేడుకొంటున్నాను. ఒకవేళ ఆమెను సైబీరియాకు పంపి వేస్తారేమో. అధికారులు ఆమె ఒంటిమీది బట్టలు తప్ప తక్కిన బట్టలు, ఇతర సామగ్రి అంతా తీసికొన్నారు. ఆమెకు బంధువులెవ్వరు లేరు. ఆమె కనీస అవసరాలకు కావలసిన వస్తువుల్ని మేం పోగుచేయాలి. మీరు గతంలో పంపిన డబ్బు ఆమెకోసం భద్రపరచి వుంచాను.వారు వారియను సైబిరియాకు పంపేపక్షంలో ఆ డబ్బు ఆమెకిస్తాను. దేవుడామెను బలపర్చి భవిష్యత్తులో కూడ

శ్రమల్ని సహించడానికి శక్తి ఇస్తాడని నేను నమ్ముతున్నాను, దేవుడామెను సంరక్షించు గాక.

మీ సోదరి, మరియ.

## నాల్గవ ఉత్తరం (వారియ వ్రాసింది)

ప్రియమైన మరియకు,

నీకు ఎలాగో ఉత్తరం వ్రాయగలుగుతున్నాను. ఇక్కడికి మేం సురక్షితంగా చేరాం. మా చెరసాల శిబిరం పట్టణానికి పది మైళ్ళ దూరంలో వుంది. ఇక్కడ మేం గడుపుతున్న జీవితాన్ని వర్ణించడం సాధ్యంకాదు. అది ఎలావుంటుందో నీకు బాగా తెలుసు. నన్ను గురించి విస్తరించి వ్రాసికోడం యిష్టంలేదు. పని కష్టమైన దైనా చేయడానికి దేవుడు నాకు ఆరోగ్య మిస్తున్నందుకు ఆయ నకు వందనాలు చెల్లిస్తున్నాను. నేనూ, ఇంకో సోదరీ కార్ఖానాలో పనిచేయడానికి నియమితమైనాం. అక్కడ మేం యంత్రాల దగ్గర పని చేయాలి. పని చాల కష్టం. నా సోదరి ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. ఆమెపనీ నాపనీ నేనే చేస్తున్నాను. మొదట నా పని ముగించుకొని తరువాత నా సోదరి పని చేస్తాను. మేము దినానికి 12 లేక 18 గంటలుపని చేయాలి. మా ఆహారం మీ ఆహారం లాగానే చాల స్వల్పం. అయితే నేను ఇప్పుడు నీకు వ్రాయదలచు కొన్నది ఆహారాన్ని గూర్చి కాదు.

నీ ద్వారా దేవుడు నాకు రక్షణ మార్గాన్ని చూపించి నందుకు నేనాయన్ను స్తుతిస్తున్నాను. నేను ఈ మార్గంలో వున్న మూలాన్న ఇప్పుడు నా జీవితానికి ఒక లక్ష్యం వుందని నాకు తెలుసు. నేను ఎక్కడికి వెళ్ళాల్సిందీ, ఎవరికోసం శ్రమపడా ల్సింది నాకు తెలుసు. నా హృదయంలో నిండివున్న రక్షణా

నందాన్ని గూర్చి ప్రతి ఒక్కరికి తెలియజేసి సాక్ష్యమివ్వాలనే కోరిక నాలో అంతకంతకూ ఎక్కువై పోతోంది. క్రీస్తులో మనకు ప్రత్యక్షమైన దేవుని ప్రేమ నుండి మనల్ని ఎవరు ఎడబాటు చేస్తారు? ఎవరూ, ఏదీ ఎడబాపజాలదు. చెరసాల గాని, శ్రమగాని ఎడబాపుచేయలేవు. దేవుడు పంపే శ్రమలన్నీ ఆయనలో మన కున్న విశ్వాసాన్ని బలపరచడానికి తోడ్పడతాయ్. దేవుని కృప నా హృదయాన్ని నింపి పొర్లిపార జేస్తోంది. నేను కర్మాగారంలో పనిచేస్తున్నప్పుడు కూడా నోరు మూసికొని నిశబ్దంగా వుండలేక దేవుడు నాకు చేసిన మహత్కార్యాల్ని నాతోటి కార్మికులకు తెలియజేస్తున్నాను. అందువల్ల అధికారులు నన్ను దూషించి, శిక్షించి నాకు ఎక్కువ పని విధిస్తున్నారు నాశనమార్గాన పోతున్న నన్ను దేవుడు రక్షించి ఒక నూతన వ్యక్తిగాను, నూతన సృష్టి గాను చేసాడు. ఇలాంటి పరివర్తన కలిగాక నేను నిశ్శబ్దంగా వుండగలనా? ఏ మాత్రం వూరుకోలేను నా పెదవులు మాటా లాడ గలిగినంత వరకు ప్రతి మనుష్యునికీ ఆయన గొప్పప్రేమను గూర్చి నేను సాక్ష్యమిస్తూనే వుంటాను.

చెరసాల శిబిరానికి వెళ్తున్నప్పుడు మార్గంలో క్రీస్తులో వున్న అనేక సహోదర, సహోదరీల్ని కలిసికొన్నాను. సహోదరుల్ని సహోదరీల్ని ప్రథమంగా కలసికొన్నా వారిని అంతకు ముందు చూడకపోయినా ఆత్మ ద్వారా వారు దేవుని బిడ్డలని తెలిసికోగలగడం ఎంత ఆశ్చర్యం! ఎలా తెలిసికొంటామో చెప్పలేం కాని తొలిచూపులోనే వారెవరైందీ తెలిసికోగలుగుతాం.

ఇక్కడికి వచ్చేమార్గంలో ఒక రైలు స్టేషన్‌లో ఒక స్త్రీ మా దగ్గరకు వచ్చి మాకు అన్నం పెట్టి "దేవుడు సజీవుడు" అని రెండు మాటలు మాత్రం పలికింది.

మే మిక్కడికి వచ్చిన రోజున బాగా ప్రొద్దుపోయి చేరాం. భూగర్భంలో ఉన్న పొడుగాటి శాలలకు, కొట్టాలకు మమ్మలి తీసి కొని వెళ్ళారు. అక్కడ ఉన్నవారితో మేం "మీకు సమాధానం కలుగుగాక" అని అనగానే అన్నిమూలం నుండి "మిమ్మల్ని సమాధానంతో చేర్చుకొంటున్నాం" అనే జవాబు మాకు విన బడింది. మే మాశ్చర్య చకితులమైనాం. ఆ మొదటి సాయంకాలం నుండీ కూడా మేం ఒక మంచి కుటుంబంలో సభ్యులమైపోయాం. నిజంగా అలాగేవుంది. ఇక్కడున్నవారిలో చాలమంది క్రీస్తును తమ స్వంత రక్షకునిగా విశ్వసించినవారు. ఖైదీలలో సగానికి పైగా విశ్వాసులున్నారు. మాలో చాలామంది బాగా పాడగలిగిన వారు, మంచి ప్రసంగికులున్నారు. మా భారమైన పనులు సాయంకాలానికి ముగించుకొని, ఆ తరువాత మేమంతా కలిసి రక్షకుని పాదాలవద్ద కొంత కాలం ప్రార్థనలో గడపడం ఎంత భాగ్యం! క్రీస్తుతో వుంటే ఎక్కడికి వెళ్ళినా స్వాతంత్ర్యమే. నేను ఇక్కడ అనేక క్రైస్తవ గీతాలు నేర్చుకొన్నాను. అంతేగాక ప్రతిదినం దేవుడు తన వాక్యమనే ఆహారంతో ఎక్కువగా పోషిస్తున్నాడు. నా పందొమ్మిదవ ఏట క్రీస్తు జన్మదినోత్సవాన్ని ప్రథమంగా నా జీవితంలో ఆచరించాను. అత్యద్భుతమైన ఆ దినాన్ని నే నెన్నడూ మరువలేను. ఆ రోజున కూడా దినమంతా మేం పనిచేయాల్సిందే. అయినా సహోదరుల్లో కొందరు దగ్గర ఉన్న ఏటికి వెళ్ళి నిదప్ర గడ్డ కట్టిన మంచునంతా త్రవ్వివేసి బాప్తిస్మమివ్వడానికి ఏర్పా టులు చేసారు. ఆ రాత్రిలో నేనూ మరి ఏడుగురు సహోదరులూ

ఆ నదిలో దేవుని వాక్యానికి విధేయులమై నీటిలోమునిగి బాప్తిస్మం తీసికొన్నాం. ఈ అద్భుత ఘడియలు నాకెంతో ఆనందాన్ని కలిగించాయ్. కడచిన కాలంలో నీకు నేను చేసిన కీడుకు పరిహారంగా మరియా, నీవా సమయాన నా దగ్గర ఉండియుంటే ఎంత బావుండేది! అయినా పరవాలేదు దేవుడు అందర్నీ వారివారి స్థలాల్లో ఉంచుతున్నాడు. దేవుడు ఏ స్థలంలో ఎవర్ని వుంచినా వారు మాత్రం స్థిరంగా నిలువాల్సి వుంది.

అకడున్న దేవుని కుంటుంబికుల కందరికీ వందనాలు చెప్పు. దేవుడు నన్ను ఆశీర్వదిస్తున్నట్లే నీ సమస్త పనిసాట్లలో ఆశీర్వదిస్తాడు. హెబ్రీ 12 : 1-8 చదువు.

ఇక్కడ సహోదరులంతా నీకు శుభమని చెప్పుతున్నారు. దేవునిలో నీ విశ్వాసం ఎంతో బలంగా వుందనీ, నీ శ్రమల్లో సహితం నీవు ఎడతెగక దేవుని స్తుతిస్తున్నావనీ వారు బహుగా ఆనందిస్తున్నారు మన వారికెవరికైనా నీవు ఉత్తరం వ్రాసేటప్పుడు వారికి మా వందనాలు చెప్పు

నీ సోదరి వారియ.

ఐదవ ఉత్తరము

ప్రియ మరియకు,

ఇప్పుడు నీకీ చిన్న ఉత్తరం వ్రాయడానకు నాకు అవకాశం దొరికింది. దేవుని కృపవల్ల నేను క్షేమంగా ఉన్నానని తెలియజేయడానికి సంతోషిస్తునాను.

నీవు నాపట్ల చూపుతున్న మాతృ ప్రేమకై వందనాలు. నీవుమాకు సిద్ధపరచి పంపినవన్నీ చేరాయ్. వాటిలో అతి శ్రేష్ఠమైన కానుక బైబిలుకోసం నా కృతజ్ఞత తెలుపుతున్నాను. అందరికీ నా వందనాలు. వారికి నీవు వ్రాసేటప్పుడు వారు పంపిన కానుకలన్నిటి నిమిత్తం నా వందనాలు వారికందజేయ్.

ప్రభువు తన పరిశుద్ధ ప్రేమలోని లోతుల మర్మాన్ని నాకు ప్రత్యక్ష పరచినందుకు లోకం అందరిలో నేను అదృష్టవంతురాలనని అనుకొంటున్నాను. నేను హింసలన్నిటినీ ఓర్చుకోగలగడం ఒక ప్రత్యేక కృపగా భావిస్తున్నాను. నేను ఆయనలో విశ్వాసముంచిన దినాన్నుండీ ఆయన కోసం శ్రమపడే భాగ్యం ప్రభువు నాకు ప్రసాదించినందుకు నేను ఎంతో ఆనందిస్తున్నాను. ఆఖరు వరకు నేను ప్రభువుకోసం నమ్మకంగా నిలిచేలా మీరంతా నా కోసం ప్రార్థించండి.

పరిశుద్ధ పోరాటంకోసం ప్రభువు మనల్నందరినీ కాపాడి బలపరచు గాక.

మీ కందరికీ నా ముద్దులు, నీకు ఉత్తరం వ్రాయడానకు నాకు మరో తరుణం దొరకవచ్చు. మా విషయం మీరు ఆందోళన పడవద్దు. పరలోకంలో మా ఫలం అధికంగా వుంటుందని మేం సంతోషించి ఆనందిస్తున్నాం. మత్తయి 5 : 11-12

నీ సోదరి వాంయ.

కమ్యూనిస్టు యువతి వారియ నుండి వచ్చిన ఆఖరు ఉత్తరం యిదే. ఆమె క్రీస్తును కనుగొని ఆయన కోసం సాక్ష్యమిచ్చినందుకు బానిస బాలికగా ఎక్కడికో పంపివేశారు అప్పటి నుండి ఆమెను గూర్చిన సమాచారం ఏమీ ఎవరికీ తెలీదు. క్రీస్తు యెడల ఆమెకున్న గొప్ప ప్రేమ, ఆయన కోసం ఆమె ఇచ్చిన సాక్ష్యం, వివిధ దేశాల్లో కమ్యూనిజం పాలనలో అపార శ్రమలు అనుభవిస్తూ కూడా నిశ్చలంగా వుంటున్న రహస్య సంఘ సౌందర్యానికివి సూచనగా వున్నాయ్.

## 12

# రహస్య సంఘాన్నుండి మీకు నా సందేశం

నేను 14 సంవత్సరాలు భయంకర హింసతో కూడిన జైలు జీవితాన్ని జీవించాను. రెండు సంవత్సరాలు "మరణ" గదిలో ఉంచారు. చావుకు సిద్ధమైన వారిని మాత్రమే ఆ గదిలో వుంచుతారు. దేవుని మహా అద్భుత శక్తి ద్వారా నన్ను బయటికి తీసారు. హస్య సంఘాల తరపున మాట్లాడ్డానకు పశ్చిమ దేశాలకు రాగలిగాను.

ఊరు పేరు లేక వేలాదిగా సమాధుల్లో నున్న నా సోదరుల పక్షాన మాట్లాడు తున్నాను.

రహస్యంగా అడవుల్లో, ఆరాధన చేసికొంటున్న నా సోదరుల పక్షాన మాట్లాడుతున్నాను.

రహస్య సంఘాన్నుండి నేను తెచ్చిన వర్తమానం ఏమిటంటే:

"మమ్మల్ని వెలివేయకండి!"

"మమ్మల్ని మరచి పోకండి!"

"మమ్మల్ని చిన్న చూపు చూడకండి!"

"మాకు కావలసిన సాధన సంపత్తిని మా కివ్వండి. వాటిని సక్రమంగా వాడుకొంటాం."

నేను మీకు అందించాల్సిన వర్తమానం యిదే.

నోళ్ళు మూయించబడ్డ రహస్య సంఘం పక్షాన నేను మాట్లాడు తున్నాను. పెదవి విప్పడానకు ఏ స్వాతంత్ర్యమూ లేని సంఘం కోసం మాట్లాడుతున్నాను.

కమ్యూనిస్టు దేశాల్లో నున్న మీ సహోదరుల ఆర్తనాదాలు. మూల్గులు వినండి. తప్పించుకోడానికి భద్రత, సుఖజీవనాన్ని వారడగడం లేదు. నాస్తికత్వం అనే విషం చేత భావితరాల జనాంగాల నాశనాన్ని నివారించడానకు సాధన సంపత్తిని అడుగు తున్నారు. దేవుని వాక్యాన్ని ప్రబలం చేయడానకు బైబిళ్ళు అడుగు తున్నారు. దేవుని వాక్యం వారికే లేకపోతే వారింకెలా దాన్ని వ్యాప్తిజేస్తారు?

రహస్య సంఘం రైలు ప్రమాదాన్ని తప్పించుకొన్న ఒక శస్త్ర వైద్యునిలా వుంది. అతని చుట్టూ హాహాకారాలు చేస్తూ చని పోతున్న క్షతగాత్రుల్ని చూస్తూ వారిమధ్య నడుస్తూ కన్నీళ్ళతో "నా సామాగ్రి నా యొద్ద ఉంటే! నా సామాగ్రి నాయొద్ద ఉంటే! ఎంత బావుండును?" అంటూ వాపోయినట్లుంది మా రహస్య సంఘం!" సామాగ్రి అప్పుడు అతని దగ్గర వుంటే ఎన్నో ప్రాణాల్ని రక్షించి యుండేవాడు.

రహస్య సంఘం కూడా ఆలాగే గొప్ప దీక్షతోవుంది. గాని దానికి పరికరాలు లేవు. దేవుని వాక్యాన్ని పంచిపెట్టడానకు, హత సాక్షాపికి, అనేక సంవత్సరాలు కమ్యూనిస్టు జైళ్ళలో మగ్గిపోడానికి రహస్య సంఘం సిద్ధంగానే వుంది. స్వతంత్రులైన మీబోటి విశ్వాసుల్ని రహస్య సంఘం కోరేది సువార్తలు. బైబిళ్ళు, పత్రికలు, ఇంకా ఇతర సహాయం తతిమ్మా విషయాలు వారే చూచుకోగలరు.

## స్వతంత్ర విశ్వాసులు సహాయం ఎలా చేయగలరు?

స్వతంత్ర దేశాలల్లోని ప్రతి క్రైస్తవుడు సహాయం చేయగలడు.

నాస్తికులు జీవిత రహస్యాల్ని ఎరుగరు. జీవితంలోను, భూలోకంలోని మర్మమైన సంగతుల విషయాల్లోనూ వారు జ్ఞానహీనులు. క్రైస్తవులు తమ విశ్వాస జీవితాల ద్వారా, దేవునితో ఎడతెగక నడిస్తే వారికి మార్గదర్శకులు కాగలరు. వారు త్యాగశీలతతో ఆదర్శ జీవితాన్ని జీవిస్తూ కమ్యూనిస్టు దేశాల్లోని క్రైస్తవులకు హింస గల్గుతున్నప్పుడు వారు దాన్ని బాహ్య ప్రపంచానికి గట్టిగ చాటి చెప్పడంవల్ల ఎంతో సహాయం చేయగలరు.

కమ్యూనిస్టులు కూడా రక్షింప బడేలా ప్రార్థన చేయడం ద్వారా కూడా చాల సహాయం చేసినవారౌతారు. అలా ప్రార్థించడం వృధా ప్రయాసగా కనబడవచ్చు. మేం కూడా కమ్యూనిస్టుల కోసం గట్టిగా ఎప్పుడు ప్రార్థించామో ఆ మరుసటి రోజుననే మరెక్కువ హింస పొందాం. యేసు యెరూషలేం నిమిత్తం చేసిన తర్వాతనే వారు ఆయన్ను సిలువ వేసారు. అయితే కొద్ది దినాల్లోనే ఐదువేలమంది పశ్చాత్తాపపడుతూ వచ్చి రక్షింపబడ్డారు. అలాగే కమ్యూనిస్టుల కోసం మనం చేసే ప్రార్థనలు కూడా నిష్ఫలాలు కాబోవు.

మనలా మన పొరుగువారిని కూడా ప్రేమించాలి. అందరిలా కమ్యూనిస్టులా కూడా మన పొరుగువారే. ఒకవేళ వారి క్రియలు మనకు యిష్టం లేకపోయినా వ్యక్తిగతంగా వార్ని ప్రేమించాలి.

మన అజాగ్రత్త వల్లనే యిందరు కమ్యూనిస్టులుగా మారిపోయా రన్న సంగతిని మనం మరచిపోకూడదు.

కమ్యూనిస్టుల సమస్యను పరిష్కరించడానకు ప్రేమ మాత్రమే సరిపోదు. ఒక రాష్ట్రంలో దొంగల ముఠావుంటే వారిని ప్రేమించడం మాత్రం చాలునని నే నొప్పుకోను. మన ప్రేమతో పాటు పోలీసులు, న్యాయధిపతులు, చెరసాలలు కూడా వుండాలి. అట్టి దుర్మార్గులు పశ్చాత్తాప పడకపోతే వార్ని జైలు వేయాల్సిందే. దొంగల ముఠా మనుష్యుల డబ్బు సంచుల్ని కాజేస్తుంది. అయితే అంతర్జాతీయ కమ్యూనిజం దేశాల్ని కబళిస్తుంది.

సంఘ కాపరులు, క్రైస్తవు లంతా కమ్యూనిస్టుల్ని క్రీస్తు దగ్గరకు తీసికరాడానకు తమ శక్తికొద్దీ ప్రయత్నాలు చేయాలి. వారు ఎన్ని దుష్కృత్యాలు చేసినా వారికోసం వివేకంతో ప్రార్థించాలి.

## బైబిళ్ళు, సువార్తలు మిక్కిలి అవసరం

ఇవి మాకు దొరికితే చాలు. వాటిని కమ్యూనిస్టు దేశాల్లోకి ఎలా పంపించాలో మాకు తెలుసు. నేను బయటికి వచ్చాక అనేక బైబిళ్ళు, సువార్తలు ఆ దేశాలకు పంపించాను. అవి భద్రంగా చేరాయి. పంపే విధానం మాకు తెలుసు. గాని వాటిని మాకిచ్చే వారు కావాలి. ఇవి వారికి ఎంతో అవసరంగా వున్నాయ్. కొన్ని కమ్యూనిస్టు దేశాల్లో ఇరువది సంవత్సరాలనుండి ఒక బైబిలును గాని, ఒక సువార్తను గాని చూడాలన్నా చూడలేని క్రైస్తవు లనేకులున్నారు.

ఒక పర్యాయం ఇద్దరు కూలివారు నా యింటికి వచ్చారు. వారు నిరుపేదలు మన్ను త్రవ్వి డబ్బు సంపాదించి దానితో ఒక

చివిగిన పాత బైబిలును కొనుక్కొని తిరిగి తమ గ్రామానికి వెళ్ళాలని వచ్చారు. అప్పుడు అమెరికానుండి వచ్చిన బైబిళ్ళు నా దగ్గర వున్నాయి. అందు వల్ల వెంటనే నేను ఒక కొత్త బైబిలును వారికివ్వగలిగాను. వారు ఆశ్చర్యపడిపోయారు! వారు కష్టపడి సంపాదించుకున్న డబ్బును, నాకివ్వ బోయారు. నేను దాన్ని తీసికోలేదు. వారు మిక్కిలి సంతోషంతో తమ ఊరికి తిరిగి వెళ్ళారు. తమ కృతజ్ఞకను తెల్పుతూ, బహు ఆనందంతో వారు ఒక ఉత్తరం వ్రాసారు. దానిమీద 30 మంది సంతకం చేసారు. ఆ బైబిలును 30 భాగాలుగా వారు విభాగించుకొని వంతుల ప్రకారం చదువు కొంటువ్వట్లు తెలియజేశారు. రష్యనులు ఒక బైబిలు పేజీ కోసం ప్రాధేయపడ్డం జాలిగొలపే విషయం అలా జరగడం నేను కళ్ళారా చూచాను. ఒక బైబిలు కోసం వారు ఒక ఆవునైనా, మేకనైనా యిచ్చెయ్యడానకు సిద్ధపడుతున్నారు. నాకు బాగా తెలిసిన ఒక వ్యక్తి చినిగి పాతగిలి పోయిన ఒక క్రొత్తనిబంధన సంపాదించుకోడానికి తన వేలి ఉంగరాన్నే అమ్మివేశాడు.

కమ్యూనిస్టుల నాస్తిక ప్రచారాన్ని అరికట్టే పత్రికలుమనం సిద్ధం చేసి అనేకభాషల్లో వాటిని అచ్చువేసి వారికి పంపిణీ చేయాలి. వారు కమ్యూనిస్టు గ్రంథాల్ని ప్రాథమిక పాఠశాలలు మొదలుకొని కళాశాల స్థాయి వరకూ గల విద్యార్థులతో చదివించి పిల్లల జీవితాల్ని భ్రష్టం చేస్తున్నారు. మనం ప్రచురించే పుస్తకాల్లో నాస్తికత్వానికి దేవుని వాక్యం యిచ్చే జవాబుల్ని తేటగా వ్రాయాలి ఇప్పుడు బాలబాలికలకు, యువతీ యువకులకు యివ్వడానికి యిలాంటి పుస్తకాలు రహస్య సంఘం వద్ద లేవు.

మనం చేయాల్సింది మరోటి వుంది. వీలుకొద్దీ మనం రహస్య సంఘంతో చేతులు కలిపి వారికి అర్థిక సహాయాన్ని చేయాల్సివుంది. అప్పుడు కమ్యూనిస్టు దేశాల్లోని విశ్వాసులు అంతటా తిరిగి వ్యక్తుల్ని ఒకొక్కర్నే కలిసికొని సువార్త నందించ గలరు. నేడు వారికున్న ఆర్థిక సమస్యను బట్టి తిరగడానికి బస్సు, రైలు చార్జీలకు డబ్బులేదు. ప్రయాణంలో భోజనానికి కూడ డబ్బుల్లేవు ఆ కారణాన్నిబట్టి వారు ఇంటి యొద్దే బందింపబడి నట్లున్నారు.

అంతేగాక ప్రభువు సువార్త మనం రేడియోల ద్వారా ఎడ తెరిపిలేకుండా కమ్యూనిస్టు దేశాల్లో ప్రకటించాలి. స్వతంత్ర దేశాలు రేడియో ద్వారా ఆత్మ సంబంధమైన ఆకలితో బాధపడుతున్న దేశాల్లోని రహస్య సంఘాన్ని పోషించాలి. ఇలా గొప్ప సేవ మనం చేయగలం.

## విశ్వాస వీరుల కుటుంబాల దుస్థితి

క్రైస్తవ హతసాక్షుల కుటుంబాలకు మనం సహాయం చేయాలి. ఇట్టి వేలాది కుటుంబాలు చెప్పలేనన్ని కష్టాల్ని అనుభవి స్తున్నాయి. ఒక క్రైస్తవుడు చెఱసాల్లో వేయబడ్డాక అతని భార్య బిడ్డలు ఎంతో శ్రమకు గురి అవుతారు.

స్వతంత్ర దేశాల్లోని విశ్వాసులు ధన సహాయంచేసి యుండకపోతే మేం యీపాటికె చచ్చిపోయి వుందుము. వారి సహకారాలవల్ల యింకా బ్రతికి ఈ విషయాలు మీకు వ్రాయగలుగు తున్నాను.

ఈ మధ్య తిరిగి రష్యాలోను ఇతర దేశాలల్లోను గొప్ప శ్రమ క్రైస్తవులకు సంభవించింది. అనేకులు హతసాక్షులె

పోయారు చనిపోయిన వారు సమాధుల్లోకి వెళ్ళిపోయారు గాని, విడువబడినవారి కుటుంబాలు మాత్రం బహు కష్టాల్లో మునిగి పోయాయి. ఇట్టివారికి మనం సహాయం తప్పక చేయాలి.

రహస్య సంఘ ప్రతినిధిగా నేను వచ్చి ఈ సంగతుల్ని తేటగా చెప్పుతున్నాను. నెను విడిచి వచ్చిన విశ్వాసులైన సహోదరుల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ వర్తమానాన్ని మీ కందించడానకు వారు నన్ను పంపారు. దీన్ని మీ కందజేయుడానను నేనూ అద్భుతంగా బ్రతికి వున్నాను.

కమ్యూనిస్టు లోకానికి క్రీస్తు నందించాల్సిన అత్యవసర పరిస్థితిని నేను మీకు విన్నవించాను. క్రైస్తవ హతసాక్షుల కుటుంబాలకు సహాయం చెయాల్సిన అవసరతను గూర్చి కూడా మనవి చేశాను. క్రీస్తు సువార్త విస్తరణలో మనం అవలంబించాల్సిన విధానాల్ని కుడా చూపించాను.

నా అరికాళ్ళమీద వారు దెబ్బలు కొట్టినపుడు నా నోరు ఏడ్చింది. ఎందుకు? దాన్ని ఎవరూ కొట్టలేదు గదా! అవి రెండూ ఒక్క శరీరం లోని భాగాలె గనుక నోరు ఎడ్చింది. ఇప్పుడు కమ్యూనిస్టు దేశాల్లో హింసింప బడుతున్న అవయవాలు ఏ శరిరంలా నున్నవో అదే శరిరంలో మీరూ వున్నారు.

మా నొప్పి మీకు కల్గడం లేదా?

గెత్సేమనే తోటలో ప్రభువైన క్రీస్తు వేదనతో ప్రార్థన చేస్తుంటే రాతి వేత దూరంలో నున్న పేతురు, యాకోబు, యోహానులు గాఢనిద్రలోవున్నారు.

హతసాక్షుల సంఘం విషయంలో మీకెంత పూచీ వుంది? కమ్యూనిస్టు దేశాల్లోని మీ సహోదరులకు మీరేవిధంగా, ఎంత వరకూ తోడ్పడుతున్నారు?

అక్కడ విశ్వాస సంఘంలో అనేకులు హతసాక్షులవు తుంటే స్వతంత్ర దేశాల్లోని సంఘాలు నిద్రాణంగా వున్నాయ్. మొదటి శతాబ్దంలోని సంఘం ఎంత శక్తితో సత్యం కోసం యుద్ధం చేసిందో అలాగే ఈ 20 వ శతాబ్దంలోని మన సహో దరులు ఒంటరిగాను, బహు ధైర్యంగాను, పోరాడుతున్నారు ఇలా వుంటే మీకెలా నిద్రపడుతోంది?

మా వర్తమానం. ఆర్తనాదం వింటారా?

"మమ్మల్ని జ్ఞాపకం చేసికోండి, సహాయపడండి కాని మమ్మల్ని త్రోసివేయకండి"!

# సత్యం కోసం చిత్రహింస

ఇదొక వాస్తవగాధ. దీన్ని చదవడంవల్ల సత్యంకోసం వర్మ్‌బ్రాండ్ ఎలా భయంకర చిత్రహింసల్ని అనుభవించాడో తెలుస్తుంది.

ఈయన రుమానియా దేశీయుడు. అక్కడి సంఘ నాయకుల్లో ప్రసిద్ధుడు. 14 సంవత్సరాలు కమ్యూనిస్టు చెఱసాలల్లో అమానుషంగా చిత్రహింసలు పొందాడు.

రుమానియాలో క్రైస్తవులు, క్రైస్తవ సంఘాలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితుల్ని యథాతథంగా స్వతంత్ర దేశాల్లోని విశ్వాసులకు తెలియజేయాలనే సంకల్పంతో ఈయన తప్పించుకొని ఆ దేశాన్నుండి బయటబడ్డాడు. ఆయన తన పర్యటనలో ఇంగ్లాండ్ అమెరికా దేశాల్లో చెప్పినగాదే ఈ పుస్తకం.

**TORTURED FOR CHRIST**